

# వీర తెలంగాణ

చైతన్యోద్యమ సారథి - స్వయం పాలన వారధి


సంపుటి : 1 సంచిక : 9 అక్టోబర్ : 2010 వెల : రూ. 15/-

www.veeratelangana.org



ప్రధాన సంపాదకులు

**వేణు సంకోజు**

ఎం.ఏ., పి.జి. డి.సి.ఇ., పి.జి.డి.జె., ఎంఫిల్

సెల్ నెం. 9948419881

ఎడిటర్

**బండ నరేందర్ రెడ్డి**

సెల్ నెం. 9849101188

సంపాదక వర్గం

**డోకూరి శ్రీనివాస రెడ్డి**

**డాక్టర్ సుంకిరెడ్డి నారాయణ రెడ్డి**

**డాక్టర్ బెల్లి యాదయ్య**

**డాక్టర్ కృష్ణ కౌండిన్య**

హైదరాబాద్ స్టాఫ్ రిపోర్టర్

**కొమాండూరి రఘు**

సెల్ : 9908141579

చిత్రకారులు

**కూరెళ్ళ శ్రీనివాస్**

**ఆర్. శ్రీనివాస్ నాయక్**

**గోనె లింగరాజు**

డి.టి.పి

**జయశ్రీ**

కవర్ డిజైన్ & పేజ్ సెట్టింగ్ :

**విజయ్,** సెల్ : 9491875063



Printed, Published & Owned by Banda Narender Reddy, Printed and Published at Shiridi Sai Offset Printers, H.No. 6-2-797, Sai Nialayam, Surya Nagar, Hyderabad Road, Nalgonda - 508001. Editor : Banda Narender Reddy. Cell No : 9849101188


## వీర తెలంగాణ దారిలో ...


**సంపాదకీయం** 2

**వ్యాసభూమి**

ఆంధ్రపాలకుల పాలనకూ ... 3

త్యాగాల చరిత : తెలంగాణం 7

నాటి నుండి నేటి వరకు ... 10

తెలంగాణవాదమూ ... (అం'తరంగం') 12

**ముఖపత్ర కథనం**

ధర్మపీఠం దద్దరిల్లింది ... 28

**జీవిత మాగాణం**

డా॥ దాశరథి ఆత్మకథాంశాలు 15

**కవనలోకం**

- బతికి సాధిద్దాం -9, కాడెద్దు -13
- జరుగు జరుగు -14, వీర తెలంగాణ -14
- రణవీరా -18, ఇష్టమైన తెలంగాణ -18, ఉద్యమాగ్ని -26

**చరిత్ర - సంస్కృతి**

నైజాం కాలంలో హైదరాబాద్ నగరంలో ... 19

మన హైదరాబాదీ చేతలకు ... 22

**'కథ'న కుతూహలం**

వర్ష నృత్యం 24

**వ్య(య)వసాయం**

ఏ పోషకం లోపించినా ... 27

**ఆదర్శం**

కాళోజీ జీవితమే ... 36

**సంవీక్షణం**

సామూహిక నినాదాల కేంద్రకం - వల్లుబండ 32

**ఉద్యమ పర్వం**

పులికోరలు ఊడబెరికిన ... 29

రైతుదే తెలంగాణము - 34

గండిపేట నీళ్లు తాగి ... 31

బీసీ పత్రికల... ఐక్యంకావాలి - 35

స్వయంపాలన కావాలి - 35

**సభలు సమావేశాలు**

నల్లగొండలో సుసంపన్నమైన సాహిత్య కార్యక్రమం ... 30

**జీవస్పర్శ**

తలనొప్పి - పార్శ్వ నొప్పి 38

**(అను)గ్రహఫలాలు**

అక్టోబర్ నెల రాశిఫలాలు 39

**గీతలు వాతలు** 40

సంపాదకీయం

# ఒక జన్మకాలం...



కాలాలు అనేకాలు. కలిసి వచ్చే కాలాలు, కలిసి వుండే కాలాలు, కలవని కాలాలు, నిలువని కాలాలు, నిలిచినా– తరువాతి తరాల కోసం మొలవని కాలాలు, కాని కాలాలు, కలిసి రాని కాలాలు, కొత్తగాని కాలాలు, పాతవాసన కొట్టే కాలాలు, ఎప్పటికీ పాతగాని–రోతగాని సరి కొత్త కాలాలు, కదిలి–కదిలించే కాలాలు, లేవక – మేల్కోవక ఆమరణాంతం – నిదురించే కాలాలు, బెదిరించే కాలాలు, అధిక్షేపించేకాలాలు, అధిగమించే కాలాలు, అన్నింటినీ అవగతం గావించే కాలాలు, మీనమేషాల్ని లెక్కించే కాలాలు, ఉల్లెక్కల పసిగట్టి–ప్రశ్నించే కాలాలు, పరిష్కారాలను వెదికే కాలాలు– పసందైన కాలాలు–పాడుకాలాలు–పడిలేచే కడలివంటి మహోధృత కాలాలు–ప్రతీపశక్తుల్ని అమాంతం–నిట్టనిలువునా ముంచే కాలాలు–మంచికనే ఆసాంతం పొంచియున్న కాలాలు. కాలాలు అనేకాలు.

ఆగక అన్ని ప్రయత్నాలు చేయడమంటేనే కాలంతో కలిసిపోవడం  కాలాన్ని వెంటేసుకుని తిరగడం  నమ్మిన నిరుపేద– ఆర్తుల – అణగారిన ప్రజల అభ్యున్నతికోసమే శ్రమిస్తూ, పరాక్రమిస్తూ కరగడం. దేవుళ్ళు కాలాలను సృష్టిస్తారని సామెత. అదెంత నిజమో కాని, దెయ్యాలనే కోస్తాంధ్ర–రాయలసీమ నాయకమ్మణ్యులు – కో'ట్లీ'శ్వరులు, దళారులు, నీతిబాహ్యమైన వారు కాలానికే తూట్లు పొడుస్తూ, కుట్రలూ–కూహకాలకే గేట్లు తెరుస్తూ వస్తారు. అయితేనేం, అన్ని అడ్డంకులను, అక్రమాలను, అణచివేతలను తోసి రాజని, తన్ని తగలేసే తత్వమే కాలానిది. కనుకనే అది చలన శీలురను ఆశ్రయిస్తుంది, తోడుగా నిలిచి తోడ్పడుతుంది  ఇదే అదనుగా వెంటనడుస్తుంది. అంతిమంగా మనిషికిచెందే కాలమే, అనగా, మనకు చెందేకాలమే మనదై మనవెంట వున్నప్పుడు – శత్రువును తెలియడమంటేనే గెలవడం ఖాయమని నిర్ధారణ అవుతున్నప్పుడు – కాలమే ***'వీర తెలంగాణ'*** ప్రాణమై ప్రభాసిస్తుంది.

ఇప్పుడిది ***'వీర తెలంగాణ'*** కొక ***"జన్మకాలం".*** ఈ కొద్దికాలంగానే అయితేనేమి, యిది కంటితో చూస్తూ – వింటూ కూడ వస్తున్నది  చెవులతో వింటూ కంటూ కూడ వస్తున్నది. అన్ని రంగులనూ, ఎన్నెన్నో హంగులనూ ఆవిష్కరిస్తూ వస్తున్నది. సకల విధ సంఘటనల మీద స్పందిస్తూ, ప్రతిస్పందనలను ఆహ్వానిస్తూ వస్తున్నది. జనంలోకి ప్రవహిస్తూ, జన–ప్రభంజనంతో కరచాలనం చేస్తూ వస్తున్నది. జనం చేతిలోని ఒక అక్షరాయుధంగా మెరవాలనే, అగ్నివర్షమై కురవాలనే చూస్తున్నది. ఈ ప్రాంతపు ప్రజల ఆకాంక్షలు ఈడేరగా, వారల ఆనందాతిరేకాల్లో తడిసి, నాని, పులకించాలనే తపిస్తున్నది. హమేశా ఒక కొత్త – బలమైన భావనను ప్రతిపాదించాలనే పూనుకుంటున్నది. నాల్గుకోట్ల ప్రజానీకమంతా జాగృతమై నినదిస్తుంటే, వారి స్వరంతో స్వరం కలిపి, అకళంక సమర్పణ భావంతో అలరారాలని, ఆశించిందానికన్నా ఎత్తులకెదిగి, మీరాలనుకుంటున్నది. అనుకున్న లక్ష్యాన్ని వేగిరం చేరాలనుకుకుంటున్నది.

ఈ కొద్దిపాటి ప్రయాణంలోనే అనేకానేకులు ***"వీర తెలంగాణ"***ను ఆత్మీయంగా స్వీకరించి, ఆదరిస్తూ వస్తున్నారు. అంతకంతకూ వీరి సంఖ్య అధికమౌతూనే వస్తున్నది. ఆకాంక్షలూ, ఆలోచనలూ, పాఠకులవని, తెలంగాణ ప్రేమికులవని నమ్మేవాళ్ళంగా–వాటిని అక్షరబద్ధం చేస్తూ వస్తుంటాం. ఈ కలగాపులగపు కాలం ముఖచిత్రాన్ని గీస్తూ వస్తుంటాం. తెలంగాణ సాధనోపోయాలన్నిటినీ నేస్తూ వస్తుంటాం. అయితే, కాలాన్ని పట్టి బంధించే, అర్హులైన ప్రతి వొక్కరికీ అర్థవంతమైన జీవితాలనందించే అసలు రహస్యం మీకే–***"వీర తెలంగాణ"*** ప్రజలకే –తెలుసునని కూడా మేం ఎప్పటికప్పుడు వాచ్యం చేస్తూ వస్తుంటాం. ఒక మహాద్భుత ఘటన అనేది – తెలంగాణ ఏర్పాటు అనేది – త్యాగాలు, కృషి ఫలితంగా నెరవేరనున్న సువర్ణ కాలమన్నది మీచేతుల మీదుగా సాధ్యమని, మీచేతల మీదుగానే –సుసంపన్నం కానున్నదనే యింగితంతో మసలుతుంటాం. మీ వివేకానికి ఆకరమై నిలువగా చూస్తుంటాం. మీతో కలిసి ఈ లోకాన్ని గెలుచుకోగా, మీ వెంటే, మీ కోసమే అన్నికాలాలూ అడుగులేస్తూవుంటాం. అవునిది – తెలంగాణ సాధన మార్గంలో అడుగులువేసే కాలం. ఉద్యమకాలం. పోరాట–గతిశీలంతో ఆగక సాగే కాలం. యిప్పటికిదొక ***'జన్మకాలం'.*** అతి త్వరగా తెలంగాణ – ఒక స్వతంత్ర తెలంగాణ రాష్ట్రంగా ఏర్పాటు కావాలని కోరుకుంటూ, ఆ ఏర్పాటు దిశగానే మోహరిస్తున్న కాలం. అవునిప్పుడిది అమోఘమైన ఒక ***'జన్మకాలం'...***

(వేణు సంకోజు)



# ఆంధ్ర పాలకుల పాలనకూ, దోపిడికీ గురైన తెలంగాణ వనరులు!

- గర్మిళ్ళపెల్లి అశోక్‌రావు, 9948395424

నిజాంల పాలనలో మగ్గిన తెలంగాణ ప్రజలు 1946-48 వరకు రజాకార్లపై వీరోచిత పోరాటం చేసి 6000 మందికి పైగా అమరులైనారు. సర్దార్‌పటేల్ సాగించిన సైనిక చర్యవల్ల తెలంగాణ ప్రజలు నిజాం నిరంకుశ పాలన నుండి విముక్తి పొందారు. 1952 మొదటి 'జనరల్ ఎలక్షన్లలో' బూర్గుల రామకృష్ణారావు హైదరాబాదు రాష్ట్రానికి మొదటి ముఖ్యమంత్రి అయ్యారు. అంటే, భారత స్వాతంత్ర్యానంతరం సంవత్సరానికి మనకు - తెలంగాణ ప్రజలకు తరువాత స్వాతంత్ర్యం వచ్చింది. ఒక 8 సంవత్సరాలు స్వతంత్ర్య హైదరాబాద్ రాష్ట్రంలో ఉన్నాము.

హైదరాబాద్ రాష్ట్రం 16 జిల్లాలు కలిగినట్టిది. 8 తెలంగాణ జిల్లాలు, 5 మరట్వాడ జిల్లాలు, 3 కర్ణాటక జిల్లాలు కలిపి మొత్తం 16 జిల్లాలు. మూడు భాషల ప్రజలతో ఉండే రాష్ట్రం. భిన్న భాషలతో పాటు - ఆచార వ్యవహారాలు వేరైనా ఇచ్చి పుచ్చుకునే ధోరణితో ప్రజలు సహజీవనం సాగిస్తూ వచ్చారు. 1947 ఆగష్టు 15న దేశప్రజలంతా స్వాతంత్ర్య వేడుకల్లో మునిగిపోయారు. ఆంధ్రులతో కలిసి ఉన్న మదరాసు రాష్ట్రానికి కూడా ఆంగ్లేయుల నుండి విముక్తి కలిగినందున వారు కూడా ఘనంగా ఉత్సవాలు జరుపుకున్నారు. కాని నిజాం నిరంకుశత్వం నుండి విముక్తి లభించనందున తెలంగాణ ప్రజలు మాత్రం నిరాశా నిస్పృహల్లో మునిగి పోయారు. స్వాతంత్ర్య సంబరాల్లో మునిగిపోయిన ఆంధ్రులు తెలంగాణ ప్రజల స్వేచ్ఛా స్వాతంత్ర్యాల గరించి ఈనాటికీ ఆలోచించి ఎరుగరు.

1956 వరకు తెలంగాణ - మిగులు బడ్జెట్‌తో, ఒక ప్రత్యేక రాష్ట్రంగా ఉంది. తెలంగాణను ఆంగ్లేయులు పరిపాలించలేదు. ఆంధ్ర రాయలసీమ ప్రాంతాలు మద్రాస్ రాష్ట్రంలో ఉండేవి. విద్యలో, ఉద్యోగాల్లో తమకు అన్యాయం జరుగుతుందని పొట్టి శ్రీరాములు నిరాహార దీక్ష ద్వారా ఆంధ్రులు మద్రాస్ రాష్ట్రం నుండి 1953 సం॥లో వేరు పడి ఆంధ్రరాష్ట్రం గా ఏర్పడినారు. తెలంగాణకు గానీ, ఆంధ్రప్రదేశ్‌కు గానీ పొట్టి శ్రీరాములు త్యాగంతో ఎలాంటి సంబంధం లేదు. 1953 సం॥లో ఆంధ్ర రాష్ట్రం కర్నూల్ రాజధానిగా ఆఫీస్ భవనాలు గాని, ఉద్యోగాలు - నీటి వనరులు గానీ లేకుండా లోటు బడ్జెట్‌తో కునారిల్లుతూ ఉండేది. అదే సమయంలో, తెలంగాణ ఫ్యాక్టరీలు నీటి వనరులు, భవనాలు మరియు మిగులు బడ్జెట్ కలిగి ఉండేది. ఆంధ్రప్రదేశ్ ఏర్పడే నాటికి దేశంలో హైదరాబాద్ 5వ నగరంగా వుండగా, నేడు 6వ స్థానానికి దిగజారింది. అత్యధిక బొగ్గు, సున్నపురాయి, ఉద్యోగాలు, నీటివనరులు, పరిశ్రమలు, భవనాలు కలిగి సుసంపన్నమైన తెలంగాణపై ఆంధ్రుల కన్నుపడింది. రెండు రాష్ట్రాలు కలిసి ఒక రాష్ట్రంగా ఏర్పడితే దోచినంత దోచుకోవచ్చు, కావలసినంత దాచుకోవచ్చునన్న కుట్రచేసి, ఉమ్మడి రాష్ట్రానికని కేంద్రంపై ఒత్తిడి తెచ్చారు.

అమాయకులైన తెలంగాణ ప్రజలను, మోసపూరితులయిన ఆంధ్రులను ఒకటిగా కలుపకూడదని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఫజల్ అలీ 1953లో గట్టిగా చెప్పాడు. ఆంధ్రలో తెలంగాణను కలుపడం జవహర్ లాల్ నెహ్రూకు కూడ ఇష్టం లేదు. పొత్తుకుదరకుంటే ఆలుమొగలు విడాకులు తీసుకున్నట్లు విడిపోవచ్చని ఆనాడే చెప్పాడు. ప్రస్తుతం నెహ్రూ మాటలకు ఆయన సొంత పార్టీలోనే విలువనిచ్చే తెలంగాణను ఆంధ్రలో కలుపడాన్ని 90% మంది తెలంగాణ వారు ఆనాడే వ్యతిరేకించారు. వారు లేనట్టి విపరీత ధోరణులు రాష్ట్రంలో ఏర్పడితే ఉద్యోగాలు, భూములు, నీళ్ళు ఆంధ్ర ప్రాంతం వారే ఆక్రమించుకుంటారని తెలంగాణ ప్రజలు భయపడ్డారు. మీ ఉద్యోగాలను, భూములను ముట్టమని, మీ నీళ్ళను ఆంధ్రకు తరలించమని, తెలంగాణకు చెందిన నయాపైసా మాకు వద్దని ఆంధ్రులు ఒట్టుపెట్టుకొని ఒప్పందం రాసుకున్నారు. అదే పెద్ద మనుషుల ఒప్పందం. పెద్ద మనుషుల ఒప్పందం, అఖిలపక్ష ఒప్పందం, పంచసూత్ర పథకం, 610 జి.వో. రాష్ట్రపతి ఉత్తర్వులు మొ॥నవన్నీ నీటి మీది రాతలయ్యాయి. తెలంగాణలో స్థానికుడుగా గుర్తింపు పొందడానికి కనీసం 14 సం॥లు నివాసం ఉండాలన్న నిబంధనను 4 సం॥లకు తగ్గించి తెలంగాణకు లభించే ఉద్యోగాలను దోచుకున్నారు. దొంగముల్కీ సర్టిఫికెట్లతో ఆంధ్రావారు తెలంగాణ ప్రాంతంలోని 22 వేల ఉద్యోగాలను 1969 నాటికే కొల్లగొట్టినారు. "మా ఉద్యోగాలు మాకు కావాల"ని 1969లో

ఉవ్వెత్తున ఎగిసిన ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో 369 మంది విద్యార్థులు ఆంధ్రపాలకుల తూటాలకు బలైనారు.

1985 నాటికి 60 వేల ఉద్యోగాలు కొల్లగొట్టబడ్డాయని 610 జీ.వో. తేల్చి చెబితే, నిన్నటి గిర్‌గ్లానీ నివేదిక 2,50,000ల ఉద్యోగాలు స్థానికేతరుల పరమయ్యాయని తేటతెల్లం చేసింది. సెక్రటేరియేట్‌లో 42% తెలంగాణకు చెందిన ఉద్యోగులు ఉండవలసి ఉంటే ఇప్పుడు కేవలం 9% మంది ఉద్యోగులు మాత్రమే ఉన్నారు. అక్రమ డిప్యూటేషన్ మరియు అవుట్ సోర్సింగ్ పేరుతో ఆంధ్ర వారిని మన తెలంగాణకు చెందిన యించు మించు అన్ని ఖాళీలలో భర్తీ చేస్తున్నారు. ఒకే ఎంసెట్ రాసిన రాయలసీమ విద్యార్థికి 1273 ర్యాంకుతో మెడిసిన్‌లో సీటు వచ్చి, 685 ర్యాంకు వచ్చిన తెలంగాణ విద్యార్థికి సీటు రావడం లేదు. విద్యా రంగంలో 10 తెలంగాణ జిల్లాలకిచ్చే నిధులు ఒక్క గుంటూరు జిల్లాకిచ్చే నిధులతో సమానం. పారిశ్రామిక రంగంలో తెలంగాణ వారికి దక్కింది కేవలం సెక్యూరిటీ గార్డ్ ఉద్యోగాలు ఆఫీసులలో అటెండర్ ఉద్యోగాలే.

తెలంగాణలో ఆర్థికాభివృద్ధి జరుగుతున్నదని ఆంధ్రప్రదేశ్ హ్యూమన్ డెవలప్‌మెంట్ రిపోర్టు 2007 చెప్పబూనింది. కరీంనగర్, వరంగల్ జిల్లాలు వ్యవసాయంలో చెప్పుకోదగ్గ పురోగతి సాధించామని ఏకరువు పెట్టింది. నిజానికి కనీస సౌకర్యాలూ, అరకొర అవకాశాల కోసమైనా ఎంతో మూల్యం చెల్లించాల్సొచ్చింది. కృష్ణా, ఉభయగోదావరి, గుంటూరు జిల్లాలలో వ్యవసాయం నదీజలాల నుంచి వచ్చే కాలువలతో నడిస్తే, తెలంగాణ జిల్లాలోని ఎన్నో ప్రాంతాలలో 70% వ్యవసాయం బోరుబావులపై ఆధారపడింది. (సుబ్రమణ్యం 2003) వాగ్దానాలేవీ నెరవేరని ఇచ్చంపల్లి, దుమ్ముగూడెం, శ్రీశైలం ఎడమ కాలువ ప్రాజెక్టులు, పూర్తికాని శ్రీరాంసాగర్ ప్రాజెక్టు, మధ్యలో ఆపివేసిన దేవనూరు వంటి నీటిపారుదల ప్రాజెక్టుల మూలంగా తెలంగాణలో వ్యవసాయానికి నీరు అందటంలేదు. రైతులే అత్యధిక భాగం స్వంత ఖర్చులతో నీటి ఏర్పాట్లు చేసుకుంటున్నారు. (ఉదహరణకు మనం కృష్ణా నది నీటి పరివాహక ప్రాంత లెక్కలను తీసుకుందాం. మొత్తం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కృష్ణానదీ పరీవాహక ప్రాంత విస్తీర్ణం 76251 చ.కి.మీ. అయితే, అందులో తెలంగాణ ప్రాంతం విస్తీర్ణం 52240 చ.కీ.మీ. (68.50%), కృష్ణా ట్రిబ్యునల్ 806 టియమ్‌సిల నికర జలాలను రాష్ట్రానికి కేటాయించింది. విస్తీర్ణం ప్రకారం తెలంగాణ ప్రాంతానికి రావల్సిన నీరు 552 టియంసిలు కాగా, అందులో తెలంగాణ ప్రాంతానికి వచ్చింది 266.83 టియంసిలు మాత్రమే (ఇది కూడా మొత్తం అందటం లేదు). ఈ పరీవాహక ప్రాంతంలో దాదాపు నాలుగోవంతున్నా (1769 చ.కీ.మీ. 23.20%) మహబూబ్‌నగర్ జిల్లాకు మొత్తం 806 టియంసిల నికర జలాలు అందవలసింది - 187 టియంసిల నీళ్ళు. కానీ, అందింది దాదాపు సున్నా! వరంగల్ జిల్లా (5814 చ.కి.మీ. 7.63%) వాటాగా అందవలసిన 62 టియంసి నికర జలాలు ఎటు పోయినయి? నల్గొండ జిల్లా (14,240 చ.కీ.మీ. 18.68%) విస్తీర్ణం అంతా కృష్ణా పరివాహక ప్రాంతమైతే, 150 టియంసిల హక్కు ఉన్నాగానీ, సాగర్ ఎడమ కాల్వ ద్వారా అందింది చాలా తక్కువ. అయితే, కోస్తాంధ్రాకు రావల్సింది కేవలం 99 టియంసిలు - అయితే, అసలు ఎన్నోరెట్లు నీరు అధికంగా అందుతున్నది. దీనివల్ల రాయలసీమకు (అనంతపురం, కర్నూలు-అందవల్సింది 155 టియంసి) కూడా ఎంతో నష్టం! ఈ రకంగా తెంగాణలో వ్యవసాయం ప్రమాదకరంగా మారి రైతుల ఆత్మహత్యలకు దారితీస్తున్నది. 1998 నుండి 2006 వరకు నమోదైన ఆత్మహత్యల్లో మూడింట రెండువంతులు తెలంగాణ ప్రాంత రైతులవే.

తెలంగాణ ప్రాంతం (దక్కన్ పీఠభూమి) ఎత్తులో వుండటం మూలంగా నీటిపారుదల సౌకర్యాలు ఎత్తిపోతలతోనే సాధ్యమవుతుంది. ఇది ఖర్చుతో కూడినది. ఈనీటిని ఎత్తు ప్రాంతానికి తీసుకెళ్ళే క్రమంలో వాడే పరికరాలు, విద్యుత్తు కై అయ్యే ఖర్చు ఎక్కువ. అందుకే ఈ మధ్య కాలంలో తెలంగాణ (జనాభా 41%)కి కేటాయించిన నీటి పారుదల ఖర్చు 55% ఉండటం చాలా ఎక్కువగా అనిపించవచ్చు.

అసమానత, వివక్షతలకు వ్యతిరేకంగా తెలంగాణ ప్రజలు ఉద్యమాలు చేస్తున్న ప్రతిసారీ "అభివృద్ధి" మంత్రాలు-వాగ్దానాలూ వారి ముందుకు వస్తున్నాయి. 'పెద్దమనుషుల ఒప్పందం - 1956' ఆరు సూత్రాల పథకం - 1973', 'రీజనల్ డెవలప్‌మెంట్ బోర్డు-2006' ఇవన్నీ వివిధ సందర్భాలలో తెలంగాణ ఉద్యమం సాధించుకున్న "అభివృద్ధి"లో భాగమే. రీజినల్ కౌన్సిల్స్, ముల్కీ నిబంధనలు, సబ్ కమిటీలు, ప్రెసిడెంట్ ఆర్డర్లు (1975), జీవో నెం. 610 (1985), గిర్‌గ్లానీ కమిషన్ నివేదిక (2004) వంటి అనేక వాగ్దానాలు కురిశాయి గానీ, ఒక్కటీ అమలు కాలేదు. ఈ విధంగా తెలంగాణ ప్రజలకి జరిగిన మోసాలు, అవమానాలు చెప్పుకుంటూ పోతే చాలా బాధాకరమైన లిస్టు తయారవుతుంది. 1973 నుండి తెలంగాణ ప్రజలు 'ఆత్మగౌరవ హక్కు'గా చర్చిస్తున్న విషయాన్ని 'వెనుకబడ్డ ప్రాంతాల అభివృద్ధి'గా మార్చి పేర్కొనడం ఒక విచిత్రం. ఇందులో భాగంగా ఒక మూసలో పోసినట్టుండే "వెనుకబడ్డ ప్రాంత అభివృద్ధి ప్రణాళికలు" ప్రభుత్వం ముందుకు

తీసుకురాసాగింది. చారిత్రకంగా తెలంగాణకు ఉన్నటువంటి ప్రత్యేక ప్రతిపత్తిని ప్రభుత్వం ఈ రకంగా హుళక్కి చేసింది. తెలంగాణను వెనుకబడ్డ ప్రాంతంగా ముద్ర వేయటంలో ప్రభుత్వం సఫలమయింది.

పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా కృష్ణానది జలాలను రాయలసీమకు, పోలవరం, దుమ్ముగూడెం ప్రాజెక్టుల ద్వారా గోదావరి జలాలను తరలిస్తున్నారు. తెలంగాణ భూములను తెగనమ్మి ఆంధ్ర ప్రాజెక్టులు కడుతున్నారు. ప్రాజెక్టుల పేరుతో జలదోపిడి చేస్తున్నారు. ప్రాజెక్టు నిర్మాణాల ద్వారా వందలాది తెలంగాణ పల్లెలు ముంపుకు గురయితే, కాల్వల ద్వారా లక్షలాది ఎకరాలు ఆంధ్రప్రాంతంలో సాగుబాటవుతున్నవి. 1956 ముందు తెలంగాణలో 18,50,000 ఎకరాల భూమి సాగులో ఉండేది. కాని ఇప్పుడు 10,50,000 ఎకరాలకు తగ్గింది. తెలంగాణలోని 10 జిల్లాలలో కాలువ కింద సాగవుతున్న భూమికంటే ఒక గుంటూరు జిల్లాలోని కాల్వల ద్వారా సాగవుతున్న భూమి అధిక కరెంటు లేక పంటలు ఎండిపోయి రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. పని లేక యువకులు గల్ఫ్ దేశాలకు వలస వెళ్ళి శవాల పెట్టెలో తిరిగి వస్తున్నారు. కుల వృత్తి తిండి పెట్టలేక పస్తులతో వేగలేక భిక్షాటన చేయలేక నేతన్నలు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. పురెబొమ్మపెట్టి 7 లక్షల 50 వేల మంది తెలంగాణ బీడి కార్మికులను వీధుల పాలు చేస్తున్నారు. 53 సం॥ల సుదీర్ఘకాలపు సమైక్యాంధ్రలో తెలంగాణ ముఖ్యమంత్రులు కేవలం 6 సం॥లు మాత్రమే పాలించారు.

ఒక్కసారైనా ఈ 53 సం॥ల చరిత్రలో అడ్వకేట్ జనరల్ పదవి తెలంగాణ వ్యక్తికి దక్కలేదు. ఇదేమని అడిగితే ఆపదవికి నమ్మకస్తులు కావాలంట! అంటే తెలంగాణ వారు నమ్మకస్తులు కారా? 2600 మెగావాట్ల విద్యుదుత్పత్తి చేసేది రామగుండం కాగా వినియోగమేమో ఆంధ్రలోనే అధికం, బొగ్గు ఉత్పత్తి చేసేది సింగరేణిలో అయితే, దాని ద్వారా విద్యుత్తును ఉత్పత్తి చేసేది విజయవాడలో. దీని పర్యావసానంగా మనం అనేక ఉద్యోగాలను, ఆదాయాన్ని కోల్పోతున్నాం. హైదరాబాద్‌ను మేము అభివృద్ధి చేసామన్న రాయపాటి, లగడపాటిలకు ప్రస్తుతం ఆనాటి అభివృద్ధి కంటే ఒక స్థానం దిగజారి 6వ స్థానంలో ఉందని తెలుసా? ముస్లింల వక్ఫ్ భూములు కాజేసి వేల కోట్లు సంపాదించిన లగడపాటిని నిలదీయవలసిన తరుణం. సినిమా, పత్రికా రంగాలలో తెలంగాణ భాష - యాసలను, సంస్కృతిని అవహేళన చేస్తూ, లైట్‌బాయ్ నుండి హీరో, హీరోయిన్ లందరూ ఆంధ్రోళ్లే. ఆంధ్రా ప్రాంతంలో 2వ పంటకోసం, శ్రీశైలంలో జలవిద్యుత్ చేయక, తెలంగాణ ప్రాంతంలో కొరత ఏర్పరచి ఈ ఖరీఫ్ సీజన్‌లో లక్షలాది ఎకరాలను ఎండబెట్టిన పాలకులను నిలదీయవలసిన సందర్భం. 27 రాజకీయ పార్టీలు 5గురు మాజీ ప్రధానులు, 443 మంది ఎంపిలు తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కావాలని సమర్థిస్తున్నా, ఏకాభిప్రాయం కుదరలేదట! మోహన్‌బాబు, చిరంజీవి వంటి ఆంధ్రా హీరోల సినిమాలు మనం చూస్తే వందల కోట్లు సంపాదించి తెలంగాణకు వ్యతిరేకంగా మాట్లాడుతున్న వారి సినిమాలనిక్కడ ఎందుకు ఆదరించాలి? నాగంపై దాడికి చంద్రబాబు గోడమీది పిల్లి వాటం కారణం కాదా? కేసీఆర్ ఆమరణ దీక్ష - విద్యార్థుల ఉద్యమం, వివిధ సంఘాల మద్దతు, న్యాయవాదుల పట్టుదల నాయకుల ఒత్తిడితో డిసెంబర్-9 చిదంబరం ప్రకటనతో తెలంగాణ వచ్చిందని భావించారు ప్రజలు. కానీ, లగడపాటి లాంటి పెట్టుబడిదారులు, భూ ఆక్రమదారుల ఒత్తిడికి తలొగ్గి వారికి అనుకూలంగా మరో ప్రకటన చేయడం కేంద్ర ప్రభుత్వపు కపటోపాయం కాదా? ఒంటిపై పెట్రోల్ పోసుకొని అంటించుకుని ఒకవేళ బతికితే మరోసారి తెలంగాణ కోసం ఆత్మార్పణం చేసుకుంటానన్నా శ్రీకాంతా చారి వంటి విద్యార్థుల ఆకాంక్షకు నిదర్శనం తెలంగాణ కాక మరేమౌతుంది?

పోలీస్ వ్యవస్థలో తెలంగాణ వారికి అన్యాయం జరుగుతుందని దానికి ప్రత్యేక రాష్ట్రమే పరిష్కారమని తనను తాను తుపాకీతో కాల్చుకున్న కానిస్టేబుల్ కిష్టయ్య ఆత్మార్పణం వ్యవస్థకే కనువిప్పు కావాలే. పార్టీలకు అతీతంగా అందరూ జేఏసీలో చేరి ఉద్యమిస్తే, ఉద్యోగులు పెన్‌డౌన్, పోలీసులు గన్‌డౌన్ చేస్తే తెలంగాణ రాదా? హిందీ మాట్లాడే రాష్ట్రాలు 9, బెంగాలి మాట్లాడే రాష్ట్రాలు 2 ఉండగా లేనిది తెలుగు మాట్లాడే రాష్ట్రాలు 2 ఉంటే తప్పేంటి?

వివిధ పార్టీలు, జెండాలు మోస్తున్న కార్యకర్తల్లారా! ఈ సారి మన తెలంగాణ గురించి ఏకంకండి. మనకే ఎందుకు విద్యాసంస్థల్లో సీట్లు దొరకడం లేదు? మనకే ఎందుకు కరెంటు కష్టాలు? మనకే ఎందుకు నీళ్ళ కరువు? మనమే ఎందుకు వలస వెళ్ళాలి? మనకే ఎందుకు ఉద్యోగాలు రావు? మన రైతులు, నేత కార్మికులు ఎందుకు ఆత్మహత్యలు చేసుకోవాలి? మన బీడీ కార్మికులకే ఎందుకు కష్టాలు? మనకెందుకు అభివృద్ధి జరగడం లేదు? ఇన్ని రకాల మోసాలు, దగా - కుట్రలకు గురైన తెలంగాణ సమైక్యాంధ్రలో బాగుపడుతుందా?

ఈ ప్రశ్నలన్నింటికీ ఒక్కటే పరిష్కారం - అదే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు. యావత్ ప్రపంచం తెలంగాణ వైపే చూస్తున్నది. విద్యార్థులు, ఉద్యోగులు, న్యాయవాదులు, రైతులు, కార్మికులు ఇలా అన్ని వర్గాల తెలంగాణ ప్రజలకు

ఆంధ్ర పెట్టుబడిదారులకు మధ్య జరిగే ధర్మపోరాటంలో విజయం మనదే కావాలె.

29, డిసెంబర్ 2009న కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్షతో తిరిగి మొదలయిన ప్రత్యక్ష ఉద్యమం తెలంగాణ అంతటా విస్తరించి అన్ని రంగాల ప్రజలు తమ ప్రబలమైన కోరికను, న్యాయబద్ధమైన ఆకాంక్షను బలంగా వ్యక్తపరిచిన క్రమంలో కేంద్ర ప్రభుత్వం డిసెంబర్ 9న తెలంగాణ ఏర్పాటు ప్రక్రియ మొదలు పెట్టినామని ప్రకటించిన విషయం తెలిసిందే. ఆ ప్రకటన తరువాత సీమాంధ్ర నేతల ప్రాయోజిత (స్పాన్సర్డు) కౌంటరు ఉద్యమం మొదలయింది. తెలంగాణ ఏర్పాటుకు తమ పార్టీ మద్దతు ఉంటుందని చెప్పుతూనే తెలుగుదేశం అధినేత చంద్రబాబు సీమాంధ్ర నేతలను సమైక్యాంధ్ర కోసం ఉద్యమించమని చెప్పి తన పార్టీ అవకాశవాద కుటిల నీతిని ద్వంద్వ ప్రమాణాలను తెలంగాణ ప్రజల ముందు బయట పెట్టుకొన్నాడు. తరువాత రెండుకళ్ళ దిక్కుమాలిన సిద్ధాంతాన్ని ఆశ్రయించాడు.

తెలంగాణ ఇచ్చేదీ మేమే తెచ్చేదీ మేమే అని ప్రకటించిన కాంగ్రెస్ – యిటు తెలంగాణ కాంగ్రెస్ వేరు అటు సీమాంధ్ర కాంగ్రెస్ వేరుగా, కేంద్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ అంతకన్న వేరుగా వ్యవహరిస్తున్న దుర్నీతిని, తెలంగాణ ప్రజలు తీవ్రంగా సునిశితంగా పరిశీలిస్తున్నారన్న విషయాన్ని ఆ పార్టీ మరువరాదు.

డిసెంబర్ 7న జరిగిన అఖిలపక్ష సమావేశంలో వివిధ పార్టీలు తాము వ్యక్తపరిచన అభిప్రాయాలకు భిన్నంగా ఇప్పుడు వ్యవహరిస్తున్నాయని కేంద్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం డిసంబర్ 23న ప్రకటించింది. మళ్ళీ తెలంగాణలో ఉవ్వెత్తున లేచిన ఉద్యమ ప్రభావం వల్ల తిరిగి జనవరి 5వ ఎనిమిది పార్టీలకు ఆహ్వానం పలికి చర్చలు జరుపుతామని డిసెంబర్ 29న ప్రకటించింది. జనవరి 5న చర్చల ప్రహసనమొకటి జరిగింది. 53 సంవత్సరాలుగా నిర్లజ్జగా, నిరాటంకంగా కొనసాగుతున్నది చాలదన్నట్టుగా, ఎప్పటికన్నా బలంగా మా తెలంగాణ మాకు కావాలని ఉద్యమిస్తున్న సమయంలో కూడా నాబార్డు నిధుల కేటాయింపులు పంటల భీమా నిధుల కేటాయింపులు, విద్యుత్ కేటాయింపులు, పదవులిస్తే తెలంగాణ ఉద్యమమే ఉండక పోవుననే ప్రకటనలను పరిశీలిస్తే సీమాంధ్ర వలసపాలకుల దోపిడీ, దురహంకార ప్రవృత్తి ఎంతటి తారాస్థాయికి చేరిందో అర్థం అవుతుంది.

అణిచివేతకు గురయ్యే ప్రాంతం అణిచేసే ప్రాంతం కంటే బలహీనంగా ఉంటుందనే వాస్తవాన్ని గుర్తించే, రాష్ట్రాల ఏర్పాటు అధికారాన్ని రాజ్యాంగం కేంద్రం పరిధిలో ఉంచింది. కానీ, కేంద్ర ప్రభుత్వం – "అసెంబ్లీలో మెజారిటీ ఉంటేనే" అని ఒకసారి, "రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల ఏకాభిప్రాయంతోనే ఏర్పాటు" అని మరొకసారి ప్రకటనలిస్తూ, యిప్పిస్తున్నది. "చిన్న రాష్ట్రాలలో అభివృద్ధి జరగదు నక్సలిజం పెరిగిపోతదని" కూడ ప్రకటనలు గుప్పిస్తున్నారు. పంజాబ్, హర్యానా, కేరళ, గుజరాత్ రాష్ట్రాలు చిన్నవి కావా? వాటిలో జరిగిన అభివృద్ధి ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన అభివృద్ధికంటే చాలా ఎక్కువ కాబట్టి అభివృద్ధికి పాలకుల చిత్తశుద్ధి ముఖ్యం తప్ప వైశాల్యంతో సంబంధం లేదని తెలుస్తుంది.

నక్సలిజం పుట్టింది బెంగాల్‌లోనే. ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్, బీహార్ రాష్ట్రాలలో పెద్దఎత్తున ప్రజా పోరాటాలు ఎగసినవి, మధ్యప్రదేశ్, బీహార్ రాష్ట్రాల విభజనకు పూర్వం నుండే నక్సలిజం – ఉద్యమాలు కొనసాగుతున్నవే. ప్రజలకు సమస్యలున్నంత కాలం పోరాటాలు ఉంటాయి. ఇట్లాంటి ప్రకటనలన్నీ తెలంగాణ ఏర్పాటును అడ్డుకునే కుట్రలో భాగమేనని తెలంగాణ ప్రజలు తెలిసినవారే. కనుకనే ఉద్యమించారు.

సీమాంధ్ర పెట్టుబడిదారీ వలస పాలకుల డబ్బు సంచులకు అమ్ముడుపోయి తెలంగాణలోని మూడున్నర కోట్ల ప్రజల ప్రబలమైన ఆకాంక్షను ఉద్యమాన్ని అణచడానికి జరిగే కుట్రలను తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారు కనుకనే తిప్పికొడుతున్నరు.

అన్ని మతాలు, కులాలతో కూడుకొన్న మన తెలంగాణ జాతి, ప్రస్తుత పరిస్థితిలో ప్రజలంతా ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరముంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడే వరకు వివిధ రకాలైన పోరాట రూపాలన్నిటినీ శాంతియుతంగా కొనసాగించాల్సి ఉంది. తత్ఫలితంగా త్వరలోనే మన జాతి శక్తి ముందు కుట్రలు, కుతంత్రాలన్ని పటాపంచలైపోయి తెలంగాణ ఏర్పడి తీరుతుందని ఆశిద్దాం!

---

"వీర తెలంగాణ" సెప్టెంబర్ నెల (8వ) సంచికలో ప్రచురితమైన "ఆత్మహత్యలు వద్దు – పోరాటమే ముద్దు" అన్న కరపత్రం తెలంగాణ ఉద్యోగుల సంఘం, హైదరాబాదు వారు విడుదల చేసిందని గమనించగలరు. – సం॥



# త్యాగాల చరిత : తెలంగాణం-మన ప్రాణం

- అనిశెట్టి రజిత, 9849482462

ఘనీభవించిన బతుకు యాతనంతా నేడు తెలంగాణ ఉద్యమ జాతరగా కరిగి ప్రవహిస్తున్నది. వివక్షలు విస్ఫోటించి ఆత్మగౌరవపు లావాలై ముప్పుతెచ్చిన ముంపు రాజకీయాలను ముంచెత్తుతున్నాయి. మరో మేనాన్ పోరాటంతో పోల్చదగిన 1946-51 నాటి సాయుధ తెలంగాణ పోరాటం నెత్తుటి తడి ఆరక ముందే 1969-71 జై తెలంగాణ, నేటి 2009-10 జైతెలంగాణ ఉద్యమాలు - వేరు తెలంగాణ పోరు బాటలో అప్రతిహతంగా ముందుకు సాగుతున్నాయి. తొవ్వల నిండా త్యాగాల పువ్వులు పర్చుకుంటున్నదే తెలంగాణ చరిత్ర.

ప్రజల ప్రభుత్వమేదైనా మొట్టమొదటగా ప్రాంతాలవారి ప్రజాస్వామిక ఆకాంక్షలు పట్టించుకోవాలి. చిక్కులు విడదీయాలి. తగాదాలు తీర్చాలి. కానీ, వాటిని రాజకీయ కుతంత్రాలతో అణిచి వేయరాదు. అయితే, మన అశక్త ప్రభుత్వాలు ప్రాంతీయ సమస్యల్ని పరిష్కరించకుండా, నిర్బంధంగా అణిచివేసే విధానాన్ని పాటిస్తున్నాయి. ఇదొక ప్రమాదకర పరిస్థితి. అయితే, మరో ప్రమాదం ప్రాంతీయవాదాన్ని - రాజ్యం - ఉగ్రవాదం, మతోన్మాదం నక్సలైట్ ప్రతిఘటనోద్యమంతో పోల్చిచూపి జనాన్ని భయానికీ, అయోమయానికీ గురిచేయబూనడం, "మేము చేతులెత్తేస్తున్నాం" అని చెప్పకుండా చేతులు దులుపుకునే నేర్పు ప్రదర్శిస్తున్నది. రాజ్యం ప్రజావ్యతిరేకమైనది అయినప్పుడు ప్రజలకు నిత్యవిభేదాలు తప్పవు. తెలంగాణ ఉద్యమాన్ని రాజ్యం తనకు, (రాజ్యానికి) వ్యతిరేకంగానే భావిస్తున్నట్లు తేటతెల్లం అవుతున్నది. ప్రాంతీయవాదం దేశ సమగ్రతకు, దేశాభివృద్ధికి ఆటంకమని పాలక వర్గం తన భావజాలాన్ని నిస్సంకోచంగా గుప్పిస్తున్నది.

కానీ, ప్రాంతీయత, ప్రాంతీయవాదం అనేవి ఆయా ప్రాంత ప్రజల ప్రత్యేకతతో కూడుకున్న జీవన వాస్తవికత అనే సత్యాన్ని విస్మరించి ప్రవర్తించడం ప్రజాస్వామిక ప్రభుత్వాల లక్షణం కాదు. ఒక దశాబ్దకాలంగా నూతన ఆర్థిక విధానాలను ఆవాహన చేసుకుంటూ పాలక పక్ష రాజకీయాలు అధిక లాభాలు మార్కెట్ వ్యామోహపు ఊబిలో మునిగి తేలుతూ దేశంలోని బహుముఖీన, సమాజాన్ని కూడా కేవలం మార్కెట్ దృష్టితోనే చూడటానికి అలవాటు పడి - ఉండటమన్నది అరిగించుకోవడానికి వీలులేని ఒక చేదు నిజం.

ప్రాంతీయ ఆకాంక్షలను దేశ ఐక్యతకు పీఠ ముడివేసి, బిగించి, లేని భూతాలను అద్దంలో చూపించి గందరగోళం సృష్టించడం చేవలేని అధికార పాలనకు నిదర్శనం. విభిన్నమైన సామాజిక - ప్రాంతీయ వర్గాలకు, వారి ఆకాంక్షలకు ఏ జాతీయ పార్టీ కూడా ప్రాతినిధ్యం వహించి న్యాయం చేయలేకపోయింది. పైగా వివిధ ప్రాంతాల్లోని రాజకీయ ఉద్యమాలను ఉగ్రవాదంతో పోల్చే క్రూరమైన తప్పిదనానికి కూడ పూనుకుంటున్నాయి. అరవై ఏళ్ల తెలంగాణ ఉద్యమం పట్లా అదే జరుగుతున్నది.

2009 ఎన్నికల ముందు అధికార (జాతీయ) పార్టీ అయిన కాంగ్రెస్ మొదలుకొని ప్రాంతీయ పార్టీలైన తెలుగుదేశం, కొత్తగా పుట్టిన ప్రజారాజ్యం, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు మద్దతు ఇస్తున్నట్లుగా ప్రకటించాయి. తెలంగాణ రాష్ట్ర సమితితో గతంలో కాంగ్రెస్ పార్టీ, మొన్న తెలుగుదేశంతో పార్టీ పొత్తు కూడా పెట్టుకున్నాయి.

వానకొట్టగానే నాణ్యతలేని రంగులు కడిగేసినట్లుగా 2009 చివరి దశలో ఉవ్వెత్తున లేచిన తెలంగాణ రాష్ట్ర ఉద్యమం వెల్లువలో ఆంధ్రా, ప్రాంతీయ పార్టీల రంగులు వెలిసి ముసుగులు చిరిగిపోయి వికృతమైన అసలు ముఖాలు బయిటపడ్డాయి. ఓట్ల కోసం బిచ్చమెత్తుకుంటూ అనేక వేషాలు కట్టి తిరిగిన పార్టీలు ఇప్పుడు నగ్నంగా బహిర్గతమయ్యాయి.

అది ప్రత్యేక రాష్ట్ర వాదమైనా, సమైక్య రాష్ట్ర వాదమైనా అధికార పీఠాన్ని దక్కించుకోవడమే ఈ గుంటనక్క పార్టీలధ్యేయం. శవాల కోసం గోరీల దగ్గర కాచుక్కూచున్న నక్కలకు నైతిక విలువలు, విలువల రాజకీయాలు నేర్పాలనుకుంటే అది మన అమాయకత్వమే మరి. ఇక సైద్ధాంతిక నిబద్ధతను ఆశించడం కూడా అంతకన్న పెద్ద అజ్ఞానమే అవుతుంది.

ఇప్పుడు తెలంగాణ ప్రజలు రాజ్యాంగబద్ధంగానే పార్లమెంటులో బిల్లు ప్రవేశపెట్టి రాష్ట్ర విభజన చేయమని కోరుతున్నారు. ఈ సందర్భంలోనే ఉత్తర ప్రదేశ్ ముఖ్యమంత్రి మాయావతి సాహసోపేతంగా యు.పి. రాష్ట్రాన్ని నాలుగు చిన్న రాష్ట్రాలుగా విభజించడానికి తాను సుముఖమే అని ప్రకటించారు. బహెన్‌జీ మాయావతి చిత్తశుద్ధి, ముందు చూపును ఆదర్శంగా తీసుకొని బుద్ధి, జ్ఞానం తెచ్చుకొనైనా మన తెలుగు రాజకీయ నాయకులెవ్వరూ అలాంటి ప్రకటన చేయలేకపోయారు. వారిలో

అంత విశాలత్వం, నిస్వార్థం, సానుకూలత, వివేచన లేకపోవడమనేది తెలుస్తున్నది.

పెట్టుబడులు, మార్కెట్, లాభాలు, వాటాలు, దోపిడీ అనే రాజకీయార్థిక లక్ష్యాలతో చక్రాలు తిప్పుతూ కత్తులు దూసే దోపిడీమూకలు, ఐక్యత, సమగ్రత, సోదరత్వం, ఒకే భాష ఒకే జాతి, అభివృద్ధి అని హాస్యాస్పదంగా నీతులు వల్లిస్తూ ప్రవచనాలు చెప్తుంటారు. గోతులు తవ్వే తోడేళ్ళకు నీతులు వల్లించడం ఒక వ్యాపకం.

మానసికంగా చీలిపోయిన వారు బలవంతంగానైనా ఏ ప్రాతిపదికన కలిసుండాలో సీమాంధ్ర మేధావులూ, నాయకులూ వివరించాలి. పవిత్ర దాంపత్యం అనేది కల్ల. బానిస పాతివ్రత్యం దురాచార సమానమైనది.

రెండున్నర జిల్లాల - రెండున్నర సంపన్న వర్గాల నాయకులు, బడా పెట్టుబడిదారులు వ్యాపారులు మొత్తం రాష్ట్రాన్నే తమ గుప్పెట్లో పెట్టుకొని ఆడిస్తున్న దొంగాటకు చెక్ చెప్పడమే తెలంగాణ ప్రజలు చేస్తున్న ఈ ధర్మయుద్ధపు ధ్యేయం. అంతేకాదు, దొరల తెలంగాణను ఇక్కడి ప్రజలు ఒక్క రోజైనా భరించడాన్ని సహించరు. జన తెలంగాణ స్థాపనలో మరిన్ని త్యాగాలకు ప్రజలు వెనుకాడరు. త్యాగాలు ప్రజలు చేస్తూ, భోగాలు-సుఖాలను ఆధిపత్య కుల వర్గాలు పొందడాన్ని శ్రామిక జనం ఉపేక్షించరు. అందుకే రేపటి తెలంగాణ రాష్ట్రంలో దొరల ఏలుబడి ఉంటుందని ఎవ్వరూ భ్రమించనవసరం లేదు.

ఏ సంస్కృతీ సౌధాలైనా నిర్మించబడటానికి వందల వేల ఏండ్లు పడతాయి. ఎంతో మంది శ్రామికులు అందుకు శ్రమ - మేధోదానం చేస్తారు. కానీ, ఆ మహాసంస్కృతీ - సౌధ నిర్మాణాన్ని కూల్చి కుప్ప చేసే కొద్దీ కొంత మంది భ్రష్టులు అటు చరిత్రకూ ఇటు సంస్కృతికీ తీరని ద్రోహం చేసే నియంతలై విర్రవీగుతుంటారు. చరిత్రహీనత వారి జన్మలక్షణం మరి.

అరవై ఏండ్ల ఆంధ్ర దురాక్రమిత రాజకీయ పాలనలో ప్రేమనగరమైన భాగ్యనగరం (హైదరాబాద్) అభాగ్యనగరంగా మారిపోయింది. మాఫియా గ్యాంగుల అడ్డాగా వికృతమైపోయింది. హైదరాబాద్‌లో దాని చుట్టూ వందల వేల మైళ్ల విస్తీర్ణంలో వలస వ్యాపార వర్గాలు విషపు ఊడలూ, వేర్లూ దించుకొని పటిష్టంగా పాతుకుపోయాయి. రాష్ట్ర విభజన జరిగితే వారికే కదా నష్టం. అందుకే హైదరాబాద్‌ను ఉమ్మడి నగరమని దబాయిస్తున్నారు. ఇక్కడి ప్రజలను కూలీలను అంచులకు నెట్టివేసి వారి అస్తిత్వాన్ని పాతిపెట్టి రియల్ ఎస్టేట్‌లూ, భవనసముదాయాలూ, చిత్ర పరిశ్రమలూ, విశాలమైన మేడలు కట్టుకొని, కాలనీలు సాగదీసి ఇదే అభివృద్ధి అని నమ్మించాలనుకుంటున్నారు. ఈ 60 ఏళ్ళలో తెలంగాణలోనే అధికాభివృద్ధి జరిగిందని పెద్ద మాయోపాయంతో ఉల్లెక్కలు/దొంగ లెక్కలు చూపిస్తున్నారు. అబద్ధాల చిట్టాతో తమ అస్త్రాలు సిద్ధం చేసుకుంటున్నారు. "సీమాంధ్ర నేతలూ ఇంకేం మరి అభివృద్ధి మా ప్రాంతంలో జరిగింది, వెనుకబాటు మీకు మిగిలింది కాబట్టి ఈ అన్యాయాన్ని నిలువరించేందుకు ఎవరికి వాళ్ళం విడిపోదాం ఎవరిల్లు వాళ్ళు కట్టుకుందాం ఎవరి అభివృద్ధిని వాళ్ళమే స్వయంగా చేసుకుందాం"మని మనం అంటున్నాం.

హైదరాబాద్ విషయంలో నిక్కమైన హక్కు ముమ్మాటికీ తెలంగాణ ప్రజలదే. అది వలస దురహంకారుల, వలస సంపన్నుల అబ్బసొమ్ముకాదు. మూడు ప్రాంతాల ప్రజలు చేసిన ముచ్చటైన అభివృద్ధి ఏదీ హైదరాబాద్‌లో లేదు. కనుచూపు మేరలో కానరాదు. అలాంటిదేదో ఉన్నదని బుకాయిస్తే అటువంటి గాలి మాటలు, అబద్ధాల మూటలు మోసేపని మీదౌతుంది తప్ప న్యాయ పోరాటం చేస్తున్న యిక్కడి వారిది కాదు. అందుకే విభజన కోసం పట్టుపడుతున్నది కేవలం తెలంగాణీయులే.

తెలంగాణ జిల్లాల్లో తలాపున గోదారి పారుతున్నా తడి అంటని పొలాలు, చేన్లు ఎందుకు ఎడారిగా మారాయో చెప్పమంటున్నాం. మా భాష, సంస్కృతిని ఎందుకు కల్తీ చేసారో, ఎందుకు అవమానించారో జవాబు ఇవ్వమంటున్నాం. నిలువెల్లా గాయపర్చి ఉన్నదంతా దోచుకున్న మీ కూటనీతికి కాలం చెల్లింది తెలుసుకొమ్మంటున్నం. నాలుగు కోట్ల మంది ప్రజల ఆకాంక్షను నీచంగా కుటిలంగా, గొంతునొక్కి చంపడం మీ హంతక ప్రవృత్తికే నిదర్శనమని అర్థం చేసుకున్నాం.

మా తెలంగాణకు మా హైదరాబాద్ గుండెకాయ, ఎప్పటికీ ఆంధ్రప్రదేశ్‌కు కాదు. రక్తతర్పణలతో కష్టజీవులు నిర్మించుకున్న తెలంగాణ నడిబొడ్డు లోని గొప్ప పట్టణం హైదరాబాద్. పాపాలరాయుళ్ళారా ఖబడ్దార్! అది ఫ్రీజోన్ అంటే పచ్చినేరం, ఘోరమైన పాపం.

ఎవరింట్లో వారు పరాయి కావడం ఎంత వరకు సమంజసం? ఎవరి ఇంటికి వారు స్వంతదారు కావాలనుకోవడం తప్పెట్లా అవుతది? స్థానికతకు కొత్త రంగులద్ది, వింతరూపులు రుద్ది తమదే అని ప్రకటించుకోవడం రుబాబ్ కాదా? జబర్దస్తీ - దౌర్జన్యాలు కాదా? కలిసుందాం అనే సమైక్యతా ప్రేమరాగంలో అన్నీ అపశృతులే. అసలు పాటా, బాటా ఎడం - ఎడమై చీలిపోయాయి. అర్థం అనర్థమై పోయింది.

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు వెన్నుపోటు దారులు - విశ్వసనీయత కోల్పోయిన రాజకీయ పక్షాలు... వాటి నేతల కప్పదాటు వైఖరులు, కాలయాపన చర్యలు, కిరాయి దుండగుల

చర్యలు, ఆందోళనలు, డబ్బులు గుప్పించి జనాన్ని రెచ్చగొట్టి ఉద్రిక్త పరిచే దుండగుల చర్యలు, కరుడుగట్టిన సీమాంధ్ర సంపన్న వ్యాపారుల క్రౌర్యాలు, దౌష్ట్యాలు.

రాష్ట్రం ముక్కలుగా విడిపోతే మొదటికే మోసమట! (హియర్! హియర్!) తెలుగువారి మనుగడకు భంగపాటట. (బహుత్‌ఖూబ్!) తెలుగు రాష్ట్రంలో ఉత్తరాంధ్ర, కోస్తాంధ్ర, రాయలసీమ (దత్తమండలం) తెలంగాణ మనే నాలుగు ప్రాంతాలకు భాషలో, యాసలో సంస్కృతిలో విభిన్నతలు ఆచార వ్యవహారాల్లో తేడాలున్నాయి. అదరినీ ఏకం చేసే, చేయగల ఒక మౌలిక / ఉమ్మడి సంస్కృతిని ఈ అరవై ఏళ్లలో ఎందుకు నిర్మించడం జరగలేదు. పైగా స్థానిక కళలకూ, సంస్కృతికీ ద్రోహమెందుకు చేశారు? వాటి ఉనికికి ఎసరు పెట్టి ఇప్పుడు కల్లబొల్లి కబుర్లతో దువ్వినంతమాత్రాన ఫలితం ఉండదు గాక ఉండదు.

ఐక్యత, అన్యోన్యత, అనేవి విశ్వాసం – నమ్మకం – సమానత్వం అనేవాటి పునాదులమీద ఏర్పడుతాయి. ఈ అంశాలన్నీ అనుభవ పూర్వకంగా తెలిపోయాక, వంచనకు గురైన తరవాత, ఇంకా ఐక్యతకూ అన్యోన్యతకూ అర్థం లేదు. డా॥ బి.ఆర్. అంబేద్కర్ ప్రకారం – దేశంలో వంద చిన్న రాష్ట్రాలు ఏర్పడినా సమస్యేలేదు. పాలనా సౌలభ్యం ఉంటుందని ఆయన ఏనాడో సెలవిచ్చాడు. ఉన్న చిక్కల్లా రాజకీయ వ్యాపార మాఫియాల దోపిడీ దౌర్జన్యాల వల్లనే–తప్ప చిన్నరాష్ట్రాల వల్ల కానేకాదు.

ప్రప్రథమంగా చిన్న రాష్ట్రాల ఏర్పాటు డిమాండ్ – రాజ్యాంగ పరమూ, చట్టబద్ధమైనదే అని గుర్తించాలి, ఒప్పుకోవాలి. ఇతరుల ఆత్మగౌరవాన్ని, స్వయం పాలనాభిలాషను స్వాగతించాలి. సామాజిక శాంతి భద్రతల స్థాపనకు అందరూ సహకరించాలి. కాని దాన్ని మరింత ఉల్లంఘించి, కంగాలం చేస్తూ, ఇతర ప్రాంతాల ప్రజల మనోభావాల ఆకాంక్షలను కలుషితం చేయడం ప్రతిభా కాదు కళ అంతకన్నా కాదు. అది కళంకం అని సీమాంధ్రులు తెలుసుకోవాలి.

తెలంగాణ ఉద్యమ ఉధృతికి దిక్కుతోచక కేంద్రం 'చిదంబర' ప్రకటన చేసింది. కానీ, సీమాంధ్ర సంపన్న నాయకుల లాబీల ఉచ్చులో పడిపోయి కాలయాపన ద్వారా ఉద్యమాన్ని నీరుగార్చేందుకు ఎత్తుగడగా యిదే కేంద్రం – శ్రీకృష్ణ కమిటీని వేసింది. పాలుతాగే పసిపిల్లలకైనా ఈ "చాణక్యం" అర్థమవుతుంది. యుద్ధంలో గెలవాలంటే రణనీతిని పాటించడం కాదు – ఏదో చాకచక్యంతో వ్యవహరించాలని, కూహకం చేయాలనెంచింది. కాని ఈ కుట్ర భగ్నం కాకతప్పదు!

మన ఉద్యమం, కోల్పోతున్న మనయువత ప్రాణాలు, మనడెడ్‌లైన్‌లు వాళ్ళకు పట్టవు. మన ప్రాణాలతో చెలగాటం ఆడే పోకడలు, ఎత్తుగడలు, వ్యూహాలతో ఎప్పటికప్పుడు కపటత్వం ప్రదర్శిస్తూ నెగ్గుతూ రావడం జరుగుతూనేవున్నది. రాబందుల రాజ్యం నుండి ఇటువంటి వైపరిత్యాలు కాక మరింకేం ఆశించగలం? అయితే, మహా సర్పానికి పట్టిన చీమల దండును తక్కువ అంచనా వేయవద్దని మాత్రం మనం హెచ్చరిస్తాం.

అమరులకు అశ్రువులు అర్పిస్తూ వాగ్దానం చేస్తున్నాం. మన చరిత్రను కాపాడుకుని తీరుతాం. మన హైదరాబాద్ కేంద్రంగా పది జిల్లాల ప్రత్యేక రాష్ట్రానికి ప్రాణంపోసి బతికించుకుంటాం... విద్యార్థి వీరుల బలిదానం సాక్షిగా ఇది మన నినాదం. దేశపునాదుల్ని కదిలిస్తాం. కల్లోలిత తెలంగాణగా మార్చిన చోటునే పచ్చగా కళకళలాడే ప్రాంతంగా మార్చుకుంటాం తీర్చుకుంటాం. వీరాంగనలు సమ్మక్క–సారలక్కలు, వీరులు పగిడిద్ద జంపన్నలమీద ఆన.. జై తెలంగాణ!

# బతికి సాధిద్దాం....

– వల్లాల పరంధామ్ యాదవ్
9985909046

ఇప్పటికే....
ఎందరు అమ్మానాన్నలు
గుండెలవిసినట్లు ఏడుస్తున్రు –
ఎన్నెన్ని పల్లెలు పట్నాలు –
సాహసాలకు త్యాగాలకు పూనుకున్నె
కూలుతున్నె

ఎందరెందరు విద్యార్థినీ విద్యార్థులు... వీరులు
రణంజేసి రంధితోను
ఆత్మహత్యలు... బలవన్మరణాలు పొందిన్రు !

నిరాశకిక తావులేదు – నిప్పులకాగేదిలేదు
ఎప్పటికైనా పోరుతొ – తెచ్చుకొనుడె తెలంగాణ !

బతికుండీ పోరుసల్పి – బతుకే పోరాటమనీ
చాటిచెప్పి సాగుదాము – సమిధలు శత్రువులజేసి !

జై తెలంగాణ! జై జై తెలంగాణ!

చైతన్యోద్యమ సారథి – స్వయంపాలన వారధి

# నాటి నుండి నేటి వరకు తెలంగాణకు అడుగడుగునా అన్యాయమే


- కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి

భారత స్వాతంత్ర్య పోరాటంలో ఇతర ప్రాంతాల ప్రజలకు ఏమాత్రం తీసిపోకుండా, తెలంగాణ ప్రజలు నిర్వహించిన పాత్ర అద్వితీయం, అజరామరం. - 1947 ఆగస్టు 15 భారత దేశమంతటా సంబరాలు చేసుకుంటుంటే.. నిజాం ప్రభువు పాలనలో దుర్భర జీవితాన్ని గడిపిన యావత్ తెలంగాణ ప్రజలు మాత్రం సంతోషంగా గడపలేక పోవటమే కాదు, చిత్ర హింసలకు కూడ గురౌతూ వున్నారు. 1948 సెప్టెంబర్ 17న తెలంగాణ భారత యూనియన్‌లో విలీనం చెందే వరకు మధ్యకాలంలో రజాకార్ల దురంతాలకు వ్యతిరేకంగా సాగిన తెలంగాణ సాయుధ పోరాటం చరిత్రలో రష్యా, ఫ్రెంచ్ విప్లవాలను గుర్తుకు తెస్తుంది. ప్రతిపల్లె ఒక జలియన్‌వాలాబాగ్‌గా నిలిచింది. భారత స్వాతంత్ర్య పోరాటం తర్వాత అంత పెద్ద పోరాటం యిదే. 1948 సెప్టెంబర్ 17న హైద్రాబాద్ రాజ్యం దేశంలో విలీనమైనప్పటి నుండి 1956 నవంబర్ 1 వరకు హైద్రాబాద్ ప్రత్యేక రాష్ట్రంగానే కొనసాగింది. బ్రిటిష్ ఇండియా పరిపాలనలోనున్న ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలోని తెలుగు ప్రజలు 1953 అక్టోబర్ 1న పొట్టి శ్రీరాములు ఆత్మార్పణ ఫలితంగా ఉమ్మడి మద్రాసు రాష్ట్రం నుండి వేరుపడి ఆంధ్రరాష్ట్రంగా ఏర్పడ్డారు.

ఆంధ్రప్రదేశ్ అవతరణ: ఉమ్మడి మద్రాసు రాష్ట్రం నుండి వేరైన ఆంధ్ర రాష్ట్ర ప్రాంతం, నిజాం పాలన నుండి విముక్తి అయిన హైద్రాబాద్ రాష్ట్రం తెలుగుభాష పేరుతో 1956 నవంబర్ 1న ఆంధ్రప్రదేశ్‌గా అవతరించింది. నెహ్రూ మాటల ప్రకారం అదొక అపవిత్రమైన కలయిక. ఇక అక్కడి నుండి తెలంగాణ ప్రాంత ప్రజలు రెండవ తరగతి ప్రజలుగా చలామణిలోకి వచ్చారు. బ్రిటిష్ పాలన కింద నాలుగు ఇంగ్లీష్ మాటలు నేర్చి, బ్రిటిష్ వారి అధునాతన పరిజ్ఞానాన్ని ఒంటబట్టించుకున్న ఆంధ్రప్రాంత ప్రజలు ప్రతిచోటా తెలంగాణ ప్రజలను అవహేళన చేస్తూవచ్చినారు. నిజాం పాలనలో మగ్గిన తెలంగాణ పల్లె ప్రజలు సరైన విద్యావకాశాలు లేక దుర్భర దారిద్ర్యాన్ని అనుభవించినారు. నాటి నిజాం పాలనలోనూ అష్టకష్టాలు అనుభవించిన తెలంగాణ ప్రజలు-స్వతంత్ర భారత్‌లో విలీనానంతరం సుఖంగా జీవించారా అంటే - అదీ లేదు.

ఆంధ్రప్రదేశ్ ఏర్పాటును యిక్కడి వారు అంగీకరించేందుకు గాను ఒక పెద్దమనుషుల ఒప్పందమనే నాటకమాడినారు. అతి త్వరలోనే అట్టి ఒప్పందాన్ని గంగలో కలిపినారు. ఫలితంగా 1969లో ప్రత్యేక తెలంగాణ ఉద్యమం తలెత్తింది. ప్రత్యేక రాష్ట్రానికై సాగిన తెలంగాణ ఉద్యమం - చరిత్రలో మరచిపోజాలనిది. దీనిని వలసాంధ్రపాలకులు అతి క్రూరంగా అణచివేసినారు. 369 మంది తెలంగాణ వాదులను తూటాలకు ఎక్కుపెట్టి పొట్టనపెట్టుకున్నారు. విద్యార్థుల ఉద్యమాన్ని రంగులు మార్చే రాజకీయ నాయకుల చేతుల్లోకి పోయేట్లు చేసి, ఉద్యమాన్ని నీరుగార్చినారు. 1972లో జరిగిన జై ఆంధ్ర ఉద్యమం ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటును కోరుకుంది. అందుకు ప్రతిఫలంగానన్నట్లు తెలంగాణ ప్రజల జన్మసిద్ధ అధికారమైన ముల్కీనిబంధనలను - భూమిపుత్రుల హక్కులను హరించివేసినారు. ఆనాటి నుండి నేటి వరకు ఎన్ని ఉద్యమాలు జరిగినా, పాలకులు పారదర్శకంగా వ్యవహరించక పోవడం ఫలితంగా తెలంగాణకు అడుగడుగునా అన్యాయమే జరుగుతూవచ్చింది. నీళ్ళ విషయంలో గాని, నిధుల విషయంలో గాని, ఉద్యోగ-విద్యా-వైద్య- పరిశ్రమల అభివృద్ధిలో గాని తెలంగాణ పట్ల పాలకులు పక్షపాతం వహించారు. అంతేగాకుండా తదనంతరం ముల్కీ నిబంధనలకు ప్రత్యమ్నాయంగా వచ్చిన 610 జి.వో. అమలు విషయంలో మరీ తీవ్రమైన అన్యాయం జరిగింది. ప్రాజెక్టుల రూపకల్పన, విశ్వవిద్యాలయాల ఏర్పాటు, నిధుల కేటాయింపులు, విడుదలలో తేడాలు -వీటన్నింటి ఫలితంగా ప్రత్యేక రాష్ట్ర వాంఛ నానాటికీ పెరుగుతూనే వచ్చింది. అంతేగాకుండా భాష, యాస, కట్టు, బొట్టు, సాంస్కృతిక విషయాలపై దాడులను తెలంగాణ ప్రజలు సహించలేక పోయారు. కనీసం పాఠ్యాంశాల ఎంపికలో కూడ తెలంగాణ ప్రాంతపు అంశాలకు ప్రాధాన్యత ఇవ్వలేదు. ఈ విధంగా ప్రతి అంశంలోనూ తెలంగాణ ప్రజలు అన్యాయానికి గురైనారు. అందుకే నక్క జిత్తుల ఆంధ్ర పాలకుల పాలనలో తెలంగాణ ప్రజలు కలిసి ఉండలేకపోతున్నారు. వీటన్నిటి ఫలితమే ఇటీవల మళ్ళీ ప్రత్యేక రాష్ట్ర వాంఛ ప్రబలటం, కేంద్ర ప్రభుత్వం ఇచ్చినట్లు గానే చేసిన డిసెంబర్ 9, 2009 ప్రకటన అగమ్యగోచరంగా మారింది. ఆంధ్ర పాలకుల, పెట్టుబడిదారుల ప్రయత్నంగానే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియ ఆగిపోయింది. దానికో కమిటీని నియమించి కాలయాపన చేయసాగింది. దీనితో తెలంగాణ ప్రాంత ప్రజలలో ఆందోళన పెరిగి విద్యార్థుల ఆత్మహత్యలు, సర్వసాధారణం అయినాయి. దీనికి తోడు తెలంగాణ ప్రాంతంలోని రాజకీయ నాయకులలో చిత్తశుద్ధి లేకపోవడం కూడా ప్రముఖంగానే చెప్పాలి. రాష్ట్ర విభజనకు ప్రజలు సంసిద్ధంగా ఉన్నా, పాలకులు, నాయకుల ద్వంద్వ విధానాల కారణంగా తెలంగాణ ఘోరమైన అన్యాయానికి గురైంది.

ఈ పరిస్థితి డిశంబర్31, 2010 వరకు కొనసాగినా, ఆ తదనంతరం కేంద్ర ప్రభుత్వం ఏదో ఒక స్పష్టమైన నిర్ణయానికి గనుక రాకపోతే ప్రజలలో ఆందోళన మరింత ఉగ్రరూపం దాల్చే ప్రమాదం పొంచియున్నది. అట్లా కాకుండా ఈ తెలంగాణ ప్రాంత ప్రజల న్యాయమైన పోరాటం ఫలించి తెలంగాణ ఏర్పడి తీరుతుందని ఆశిద్దాం.


'మాభూమి' ని మేమే ఏలుకోవాలి మా బతుకు మేమే బతకాలి అని చాటి చెప్పిన సమరయోధుని వీరగాధ !
కీ॥శే॥ డా॥ పి. సుబ్రమణ్యం IAS
స్ఫూర్తితో
ఆదివాసి చిత్ర(ఐ.టి.డి.ఏ.ఉట్నూరు)
సమర్పించు
ఫిల్మీడియా ప్రొడక్షన్స్
కొమరం భీమ్
DIGITAL dts SOUND
ఉత్తమ నంది అవార్డులు
అందుకున్న చిత్రం!
ఉత్తమ జాతీయ
సమగ్రతా చిత్రం
ఉత్తమ దర్శకుడు
స్క్రీన్‌ప్లే-దర్శకత్వం
అల్లాణిశ్రీధర్
నిర్మాణం
ఆదివాసి చిత్ర &
అల్లాణి శ్రీధర్ (ఫిల్మీడియా ప్రొడక్షన్స్)
రచన-సంభాషణలు: ఎస్.ఎమ్.ప్రాణ్‌రావు పాటలు: భూపాల్ సంగీతం: గౌతమ్‌ఘోష్ కెమెరా: కె.భవానీశంకర్ ఎడిటింగ్: కె.రవీంద్రబాబు
సహకారం: గిరిజన సంక్షేమ-శాఖ, ఆంధ్రప్రదేశ్ చలనచిత్ర అభివృద్ధి సంస్థ & కొమరంభీమ్ ఫౌండేషన్

అం'తరంగం'

# తెలంగాణ వాదమా? తెలుగుదేశమా?



– డోకూరి శ్రీనివాసరెడ్డి, 9392323126

గోనె హన్మంతరావు, ముద్దసాని దామోదర్‌రెడ్డి, బాబుమోహన్, బోడ జనార్ధన్, శికారి విశ్వనాథం – ఇట్లా ఎందరో ఓనాటి ముఖ్యనాయకులు! ఒక్కొక్కసారి రాష్ట్ర మంత్రివర్గంలో సభ్యులు! ఆంధ్రుల ఆత్మగౌరవ నినాదంతో ఆవిర్భవించిన పార్టీ!

తెలంగాణ ఆత్మగౌరవ పోరాటంలో మట్టిగొట్టుకపోయిన పార్టీ! పన్నెండుకు పన్నెండు స్థానాలలో డిపాజిట్లు కోల్పోయిన పార్టీ. అదే తెలుగుదేశం పార్టీ. నేడది చంద్రబాబునాయుడు పార్టీ. అయినా, పడిలేస్తామంటున్న ఆ పార్టీ అధినేత–ఉప ఎన్నికలలో తెలంగాణ ప్రజలిచ్చిన తీర్పుతో, తెలంగాణ వాదాన్ని బలపరిచిన తీరుతో, దిమ్మతిరిగి దిక్కుతోచని స్థితిలో రెండు కళ్లలో ఒక కన్నుపోగా మరో కొత్త నినాదం! అదే ఇద్దరు బిడ్డలు. అంతేకాని, తెలంగాణ వాదాన్ని, సెంటిమెంటును గుర్తించనిరాకరణ. ఆధిపత్యపు – అహంకార ధోరణి. తెలంగాణ ప్రజల ఓట్లు కావాలె. తెలంగాణ తెలుగుదేశం పార్టీ నాయకులు తన అడుగులకు మడుగులొత్తాలె. అంతేకాని, శ్రీకృష్ణ కమిటీకి తెలంగాణ గురించి నివేదిక ఇవ్వడట. తెలంగాణ ఆత్మగౌరవ పోరాటాన్ని అంగీకరించకపోవడం, పైగా తెలంగాణ రాష్ట్ర సమితిని, అధినేత శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖర్ రావును విమర్శిస్తూ, బావమరది హరికృష్ణచేత లేఖ రాయించడం. ఎవరీ హరికృష్ణ? ఏమిటి ఇతని స్థాయి? పన్నెండు నియోజక వర్గాలలో తెలంగాణ వాదుల అప్రతిహత విజయానికి కారకుడై నిలచిన ఉద్యమ నాయకుడు – కేసీఆర్‌ను విమర్శించే అర్హత ఉందా?

తాను వెన్నుపోటు పొడిచి పదవులు దక్కించుకున్న చంద్రబాబు, ఎన్టీఆర్ కుటుంబ సభ్యుల నుండి ఏ సమస్యా ఉత్పన్నం కాకుండా ఉండాలనే భావనతో, పాచికలా మలచి విసిరేసిన పొలిట్‌బ్యూరో సభ్యత్వం, రాజ్యసభ సభ్యత్వంతో నాయకుడైనాడా? ఎంత ధైర్యం? మరెంత అహంకారం? తెలంగాణ తెలుగుదేశం పార్టీలో హరికృష్ణను మించిన నాయకులు లేరా? ప్రజల ఉద్యమ స్ఫూర్తిని గౌరవించలేరా?

"చిరకాలం జరిగిన మోసం/బలవంతుల దౌర్జన్యాలూ/ధనవంతుల పన్నాగాలు/ఇంకానా! ఇకపై చెల్లవు" అని శ్రీశ్రీ అన్నట్లు – సీమాంధ్ర పార్టీలు, నాయకుల కుట్రలూ, దోపిడీలు, ఇకపై సాగవుగాక సాగవు! తెలంగాణ ఇట్లా పిడికిలెత్తితే పడిపోలేదా వారి పేకమేడలు! అయినా, తీరుమారని చంద్రబాబు "ఉత్తర – దక్షిణ" తెలంగాణ అంటూ సరికొత్త పల్లవి అందుకున్నాడు. రెండు కళ్ళు – ఇద్దరు బిడ్డలు, ఉత్తర – దక్షిణలు" వంటి విషపాతకపు ఎత్తు గడలలో దిట్ట కదా చంద్రబాబు! కుట్రలు, విద్వేషం, మాయోపాయాలు, వక్ర విధానాలు ఆయన నరనరాన నిండిన లక్షణాలు. తెలంగాణ ఆయనకొక వలస ప్రాంతం. ఓట్లనిధి, అది అణగిమణగి ఉండాలె. ఇక్కడి నేతలు ఆయన చుట్టూచేరి ఆయన పలికే ప్రతిమాటకూ తల ఊపాలె. వారి ఆత్మగౌరవం, స్వతంత్ర్య భావనలు ఆయనకు తాకట్టు పెట్టాలె. లేకపోతే లేఖల రూపంలో బావమరిదిని వారిపైకి ప్రయోగిస్తాడు.

శ్రీకాంతాచారి, వేణుగోపాల్‌రెడ్డి, యాదయ్య, కిష్టయ్య, ఇషాన్‌రెడ్డి, ఈవరుసలో మరెందరో! అంతా నాలుగు వందల పైమాటే. అదిగో వారి ఆత్మలు ఘోషిస్తున్నాయి. అంతేకాదు – ప్రశ్నిస్తున్నాయి. తెలంగాణ కొరకు ఇంకెంతమంది బలికావాలంటూ నిలదీస్తున్నాయి. క్యాదరంతా "జై తెలంగాణ" అంటూ నినదిస్తున్నా తెలంగాణ తెలుగుదేశం నేతలకు – వినబడటం లేదు. ఆలకించలేరు! చంద్రబాబు ఉక్కు కౌగిలి నుండి బయటపడే సమయం ఆసన్నంకాలేదా? "రెండు కళ్ల" నినాదం, బాబ్లీ డ్రామా వీరిని గట్టెక్కించిందా? బాబ్లీ యాత్రలాగా మందీ, మార్బలంతో ఆర్.డి.యస్. యాత్ర చేపట్టాల్సిందిగా తెలంగాణ నాయకులు చంద్రబాబుపైన వత్తిడి తేగలరా? ఎప్పుడో దత్తత తీసుకున్నట్టి పాలమూరు జిల్లాకే అన్యాయం జరుగుతుండగా నోరు మెదపకపోవడం సమంజసమేనా! అసలు నదీ జలాలపైన తెలుగుదేశం పార్టీ విధానమేమిటి? "వ్యవసాయం దండుగ" అన్న అధినేతకు నదీ జలాలు ఓ సమస్యకాదేమో!

"గ్రూప్–1 పరీక్షలలో మా వాటా 42% మాకివ్వండి లేదా పరీక్ష వాయిదా వేయండి ఎ.పి.పి.యస్.సి. చైర్మన్ వెంకట్‌రాంరెడ్డి అవినీతిపరుడే కాక తెలంగాణ అభ్యర్థుల పట్ల వివక్ష చూపుతున్నాడు మాకు అన్యాయం జరుగుతుంద"ని అంటూ, ఉస్మానియాలో విద్యార్థులు ఆందోళన చేస్తున్న తరుణంలో, తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూర్ సమావేశంలో – విద్యార్థుల ఆందోళనపై స్పందించని తీరు, చర్చించని వైనం చంద్రబాబు ఆడే కపట నాటకం కాదా? ఈ ఒక్క సంఘటన చాలు అతని నిజస్వరూపం బయటపడడానికి. 53 సంవత్సరాలుగా అణచివేయబడినాము. కేవలం ఒక నదీ జలాల చౌర్యం వల్లనే ఇప్పటికే 4 లక్షల కోట్ల రూపాయల విలువచేయగల వ్యవసాయ సంపదను నష్టపోయాం. విద్యా, ఉపాధి రంగాలలో కోల్పోయిన మానవ సంపదను లెక్కకట్టజాలం. ఇట్లా ఒక తరం తలరాతలే మారినవి. కాదు మార్చినారు. మన హైదరాబాద్‌లో మనవారి పేరిట వెలసిన పార్కులెన్ని? నిలిచిన విగ్రహాలెన్ని? ఇట్లా ఎన్నో, ఎన్నెన్నో గాయాలు. ఒక తరం అనుభవం ఇది. దీనినే వారసత్వంగా మన పిల్లలకు అందించుదామా? తెలంగాణ నినాదంపైన "యూ టర్న్" తీసుకోవడం భావ్యమా? పొలిట్‌బ్యూరో తీర్మాణం, ప్రణబ్‌కమిటీకి ఇచ్చిన లేఖ, గత డిసెంబర్ 7న అఖిలపక్ష సమావేశంలో తీర్మాణాన్ని సమర్థిస్తామని చెప్పిన మాటలు వాస్తవాలా– కాదా? బాబ్లీపై బస్సు యాత్ర చేసిన పార్టీ ఆర్.డి.యస్. ప్రాజెక్టు స్లుయిస్‌లను బద్దలు కొట్టడంపై స్పందించదేమి? ద్వంద్వ విధానాలు, అవకాశవాద నిర్ణయాలు, వివక్షాపూరిత చర్యలు – ఇవే తెలుగుదేశం పార్టీ విధానాలైతే ఆపార్టీ వైఖరి తేల్చుకోవాల్సిందే. పార్టీలో అధికారం చెలాయించి ప్రభుత్వంలో భాగస్వామియై, గ్రూపు రాజకీయం చేసి, చివరకు మామకు వెన్నుపోటు పొడిచిన వ్యక్తి,

అవకాశవాది, తెలంగాణకు న్యాయం చేయగలరని ఎవరైనా ఆశించ గలరా?

***చేసేవన్నీ చేసుకుంటూ పోతున్నకొద్దీ, మెల్లగానైనా తెలుసు కుంటాడులెమ్మని అనుకుంటున్న కొద్దీ, తన బలం తగ్గుతున్నదని, కేడరంతా తన పార్టీని విడిచివెళ్ళి యితర పార్టీ(ల)లో చేరిపోతున్న పరిస్థితిని గ్రహించి, తట్టుకోలేక మతిచెడినట్లై, బుర్రగిర్రున తిరుగుతున్న కొద్దీ - శ్రీ చంద్రబాబు విషంకక్కుడుకు, విషపు నవ్వులకు కూడ పాల్ప డటం విడ్డూరం. తను ఏదైనా - కనవచ్చు ముఖ్యంగా, నేలమీదుండి స్వర్గం మీద కాలుబెట్టినట్టు కూడ కలగన వచ్చు. కాని, యితరులు నెరవేరే కలలు కూడ కనరాదట! (హియర్! హియర్!) కల ఆయన రక్తంబొట్టు కాదు, పచ్చబొట్టు! మాట్లాడితే యీమధ్య "కండ్లుకండ్ల"ని గొణుగుతూ, తెలంగాణను "పండ్లో" అని అమ్ముకోజూస్తున్నాడు కదా! 2020 దాకా తానే ముఖ్యమంత్రినని కలగన వచ్చు. యుగాంతం దాకా నేనే సియీవోనని కలగనవచ్చు. ఇట్లా ఎవరైనా అనుకున్నా, ఆలోచించినా తనకు తీరని ప్రమాదమని, కలనుంచి దిగ్గున లేచినట్లు పళ్ళికిలించుకుంటూ, అందంగా సకిలించుకుంటూ, "ఆలూ లేదు, చూలూ లేద"ని ఏదేదో కూయవచ్చు. అధికారం నుంచి దిగజారి ఏకంగా జీరోస్థాయికి పడిపోయినా, నేనే అధికారినని పాడు - పాడు - పిచ్చి - పిచ్చి, కల్లబొల్లి కలలుగని హాస్యాస్పదుడు కావచ్చు. కాలరెగ రేయబోయి బొక్కబోర్లా పడవచ్చు. రంధిలేదు. కాని, అతని దృష్టిలో కల అతని జాగీరు దాయాదుల ఆస్తి-పాస్తి! ఇతరులకంతా నాస్తి. కోస్తాంధ్ర -సీమవాదుల తోనే దోస్తి!***

***కలగనే హక్కు చంద్రబా(o)బు పేటెంటు హక్కుగాదు. ప్రతిమనిషికీ కలగనే హక్కుంది. కలలకు వెలియైన వాడేం మనిషి? తాను తప్ప యితరులెవ్వరికీ అవకాశాలు దక్కకూడదనుకునే ద్రోహచింతనే అతడిని యింతటి పతనావస్థకు చేర్చిందని యిప్పటికైనా గ్రహించకపోతే, అతనికి యే గతీ వుండదు - ఒక్క దుర్గతి తప్ప! అవును, బహుశా - దుర్గతే అతని మహాస్వప్నం కాబోలు!***

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు అడ్డంకులు సృష్టిస్తున్నవారు, అవాకులు, చవాకులు పేలుతున్నవారు, అవరోధాలై నిలుస్తున్నవారు చరిత్ర నుండి గుణపాఠాలు నేర్చుకోవాలె. ఓ దశలో చరిత్రనే కాదన్నవారు గదా? అటువంటి వారికి తెలంగాణ నేతలు ఎంతకాలం కొమ్ముకాయగలరు? అతుకుల బొంత వ్యవహారం సాగదింకా. ***పీడనకు గురైన సమాజం పిడికిలెత్తితే మహా సామ్రాజ్యాలే నేల కూలినవి.*** అది చరిత్ర. అహంకారం, ఆదిపత్యం ఇక చాలు. ఇది వర్తమానం. భరించే ఓపిక, సహించే శక్తి, నశించింది. తెలంగాణదే ***భవిష్యత్తు!***

"దోపిడి చేసే ప్రాంతేతరులను / దూరం దాక తన్నితరుముతం / ప్రాంతం వాడే దోపిడి చేస్తే / ప్రాణంతోనే పాతర వేస్తం" అని ప్రజాకవి - కాళోజి అన్నట్లు, ప్రాంతం వారే తెలంగాణకు మోకాలడ్డుతున్నప్పుడు పరిస్థితులు ఏవిధంగా వుండగలవో ఊహించవచ్చు. భవిష్యత్తరాలు చైతన్యవంతమై తమ హక్కుల సాధనకని ఉద్యమిస్తున్నారు. ఇది గమనించకుండా, తెలంగాణ లక్ష్యానికి వ్యతిరేకంగా ప్రవర్తిస్తున్నవారు ***ఆ చైతన్యోద్యమ రథ చక్రాల కిందపడి నలిగిపోగలరు జాగ్రత్త.***

చైతన్యోద్యమ సారథి - స్వయంపాలన వారధి

# కాడెడ్లు !

- మహ్మద్ హనీఫ్ అలీ

సెల్ : 9346491023



జబర్దస్తీగ ఇంట్లకు జొర్రబడి
బబ్లింగమోలె అతుక్కొని పాకుతున్న
నల్లబల్లుల మజిలీలలు
దొబ్బుకుంటున్న దొరతనం
మూసీలకు ముంచబడుతున్న
ఆత్మబలం మా కనీసపు హక్కులు
మేధావుల ఆలోచన తీరులపైన
కమ్ముకుంటున్న తుఫాను మేఘాలు
చరిత్ర అమావాస్య చంద్రగ్రహణం
పొంగి పొర్లుతున్న స్వరాష్ట్ర కాంక్ష
పక్వానికొచ్చిన అమరుల కోరిక
బలహీనుల్లో రాజుకున్న కుంపటి
ఐదునూర్ల బలిదానాలు వృధా
పోరాటమే చిరునామా లెక్క -
పల్లెల్లో పూచిన గులాబి పూలు
అమరుల స్థూపం సాక్షిగా
ఆత్మార్పణలు ఆత్మహత్యలు
అసలే వద్దు ముద్దు బిడ్డల్లారా!
క్షణిక ఉద్రేకాలు మూలకునెట్టి
చేపలోతిగ ఎదురీత నేర్చినోళ్ళం
నిఘాకండ్ల కెమెరాలతో కలెబడుదాం
మిమ్ములను కోల్పోయిన తెలంగాణ
పూలు పిందెలు రాల్చుకున్న నావతన్
ఒక ఒంటరి వనం
రోషం నిండి పారే ఆత్మగౌరవం స్వంతం
ఆత్మతేజం సూర్యరశ్మి వర్ణం
శ్రీకాంతాచారి టు ఇషాంత్‌రెడ్డి
ఆది అంతం శవయాత్ర దృష్యాలు
"ఇచ్చేదీ తెచ్చేదీ మేమే"నని బొంకులు
ఎదురు చూపులు వెదుకులాటలు
మన అసెంబ్లీ ఒక బందిల దొడ్డి
ముల్లుగర్ర గుచ్చేది కేంద్రం హస్తం
అధిష్టానం కండలు మంచుగడ్డలు
కాని కాలమొచ్చింది
కాడెడ్లు మార్చుకోవాలె!

కవనలోకం

# జరుగు-జరుగు

- దాసోజు జ్ఞానేశ్వర్
సెల్: 9912138152



ఓనా వలసా సామీ! నీజాత్కమంత
తిరిగేసి మరిగేసి ఎట్ల జూసినా
తెలంగాణ శెట్టుకు వట్టిన సెదపురుగువేనని
తేటతెల్లమైంది!
నిన్ను ఇంట్లెకు రానిచ్చింది మొదలు
వాసాలు లెక్కవెడుతుంటే
నాకు నీకు సోపతెట్లగలుస్తది?
పేరు మార్చి పెండ్లిజేసినంత మాత్రాన
సొబావం మారంది-సాపత్యమెట్లనిలుస్తది?
మన మజ్జెన నక్కకు నాగలోకానికున్నంత తేడుంటె
ఇడాకులకుగాకుంట యింకేమిగురం మిగిలిందని?
గుండెను చెరువోలె జేసుకోని బతుకొచ్చిన పతోన్ని
శాప పిల్లలోలె సూసుకొనేది నేను-
ఎండ్రికిచ్చలోలె జేరి పొలంల
బుంగలు వెట్టుకొనే దొంగవు నువ్వు
మా తాత ముత్తాతలు
బొట్టుబొట్టుగ రగుతంగార్సిన ఎర్రనేలల్ల
వానపామోలె తిరిగెటోన్ని నేను-
పచ్చగున్న కాదల్ల పత్తిపురుగులెక్క
రసం బీల్చెటోనివి నువ్వు
నల్లరేగడి నేలల్ల ఆరిద్రపురుగోలె
పందుమిరపతోని దోస్తాన జేసేది నేను-
పొగాకు తోటలల్ల ఎండిన
దరిద్రపు పీనిగోలె ఏల్లాడేది నువ్వు
శెరిసగం పారిచ్చుకుందామంటె నమ్మి
నా బూమిల ప్రాజెక్టులు గట్టనిచ్చింది నేను-
నా వూల్లను ముంచి - ఏర్లను మల్లిచ్చి
ఎదుమకాల్వను ఎండబెట్టి
కుడికాల్వ పేర్న కొల్లగొడుతున్నది నువ్వు
ఎట్లనోగట్ల వొచ్చిపడ్డ మద్రిత్తుకు
జగ్గల మజ్జెన కుసింత జాగిచ్చి
జాలితోని సూసుకున్న తాటిబొత్తోలె నేను-
ఆ బొత్తనే మొత్తంగా అమ్రిచ్చుకున్న
(ఛ)వటవృక్షానివి నువ్వు
సూశినావె-
నీకు నాకు నడుమ యింత ఏరుబందమున్నంక
మనమజ్జెన సోపతెట్ల కుదుర్తదే?
ఏదో సామెజ్జెప్పినట్టు
తల్కాయె నాకు పంచిచ్చి
పొదుగు దగ్గర పొందుగ గూకుంటివి
మొదలుకు నీళ్ళు నాతోని పోపిచ్చి
సక్కదనంగ-కొమ్మల పండ్లు నువ్వేరుకోవడితివి
నీ"వలస తెలివి"నంత సూశిసూశి
సోయి దెచ్చుకోని నిలేయంగనె
'తెలంగాణోడు దేశద్రోహి'-అనుకుంట
నోటికొచ్చినట్ల మొరగవడ్తివి
సమైక్య రాష్ట్రం పేరుజెప్పి మోసంతోని నువ్వు-
మా బతుకుల్ల అమాసను అలుకుతుంటె
కనికారంతోని-నెనరుతోని
ఏకంగ ఎన్నెలను పుదిచ్చుకుంట నేనున్న
గిట్లున్నంక-నీ మోసానికి నా మమకారానికి
సోపతింకేలెక్కన గుదుర్తదే?
జరుగు జరుగు - శాంతనం సాలిచ్చు
నీళ్ళమీద-నేలమీద హద్దులు గీసుకున్నంకనే-
గిప్పుడింకేమాటైనా-ముచ్చటైనా!

# వీర తెలంగాణ

- రామరాజు వెంకటేశ్వర రావు,
కొత్తపేట

జై తెలంగాణ జై జై తెలంగాణ
'వీర తెలంగాణ' జై 'వీర తెలంగాణ'
రాజకీయ మనుగడ కని మా ప్రాంతం కొల్లగొట్టి
మాయాసను - మాభాషను పదే పదే పరిహసించి
మా బతుకులు బుగ్గిచేసి మానవతను మంటగలిపి
ఆస్తులెన్నో కూడబెట్టి అనునిత్యం అణగదొక్కి -
నందుకు మా విద్యార్థులు అసువులు బాసిరి అదిగో
త్యాగధనుల ఆత్మాహుతి త్యజించావో అధోఃగతే
మేకవన్నె పులులారా మేలుకొంది తెలుగుజాతి
నాటినుండి నేటి వరకు భరించింది సహించింది
'భాగ్యనగరి' కాదంటే భరతం పడతానంది
ఈనీరూ - ఈగాలీ - ఈనేలా మాదంది
తెలంగాణ రాష్ట్రాన్ని సాధించగ సాగింది
సాధిస్తాం - సాధిస్తాం తెలంగాణ సాధిస్తాం !

# డా॥ దాశరథి ఆత్మకథాంశాలు




***'నా తెలంగాణ కోటి రతనాల వీణ' అంటూ ఆనాడే సగర్వంగా ఆత్మవిశ్వాసంతో నినదించిన మహనీయుడు - డా॥ దాశరథి కృష్ణమాచార్య. 1988 ఆగస్టులోనే అంటే , వారు భౌతికంగా తమ తనువును చాలించిన ఒక సం॥లోపుననే, వారి స్వీయచరిత్ర - యాత్రాస్మృతి వెలుగు చూసింది. తిరిగి అది నవంబరు 2006లో పునర్ముద్రణకు నోచుకున్నది.***

అదిగొ! వసంతరాజు, పువు టమ్ములతో మరు దేగుదెంచగా,
మృదుల రసాల కౌసుమ పరీమళ వీధుల సాగివచ్చి నా
యెదుట పరాగముల్ చిలికె  నా ప్రియురాలి నవాధరోష్టమం
దెదియొ రదచ్ఛదమ్ము కనుపించె: సురా చషకమ్ము నొక్కనో

ఆమని. 3 : అగ్నిధార

## రుబాయిూలు

మాది వరంగల్లు జిల్లా మహబూబాబాదు తాలూకా గూడూరు గ్రామం. మహబూబాబాదుకు తెలుగు పేరు మానుకోట. కోటవలె ఆ వూరు చుట్టూ మ్రానులు ఉండేవి. చక్కని తెలుగు పేర్లు మారిపోయాయి. మహబూబ్‌నగర్‌కు తెలుగు పేరు పాలమూరు. ఈ నాటికి మహబూబ్‌నగర్ నుంచి వచ్చే రైతుల్ని "యాణ్ణించి వస్తాన్నవ్!" అని అడిగితే "పాలమూర్నించి" అనే జవాబిస్తాడు. నిజామాబాదుకు అసలు పేరు ఇందూరు. "ఇందూరు పోతాన్న దొరా!" అంటాడు ప్రయాణికుడు ఈ నాటికీ. కరీంనగర్ తెలుగు పేరు వెలిగందుల. నాటి హైదరాబాదు సంస్థానంలో మూడు భాషా ప్రాంతాలుండేవి - తెలుగు, మహారాష్ట్రం, కన్నడం, రాజభాష ఉర్దూ, మొత్తం పదహారు జిల్లాలు. వాటిలో యెనిమిది తెలుగు జిల్లాలు, అయిదు మరాఠీ జిల్లాలు, మూడు కన్నడ జిల్లాలు. నాటి హైద్రాబాద్ రాష్ట్ర పటం చూస్తే, శివాలయంలో నందిలా ఉండేది. మా వూరికి వరంగల్ కంటే ఖమ్మం దగ్గర. కనుక నా విద్యాభ్యాసం ఖమ్మంలోనే జరిగింది. నా బాల్యం అక్కడే గడిచింది. అప్పుడు ఖమ్మం ప్రత్యేక జిల్లా కాదు. వరంగల్ జిల్లాలో ఒక భాగంగా వుండేది.

పోలీసు చర్య జరిగిన కొన్నేండ్లకు శ్రీ బూర్గుల రామకృష్ణారావు ముఖ్యమంత్రిగా పరిపాలన నిర్వహిస్తున్న కాలంలో ఖమ్మంకు జిల్లా ప్రతిపత్తి ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్ ఏర్పడ్డ తరువాత భద్రాచలం డివిజన్ ఖమ్మం జిల్లాలో చేరిపోయింది. ఖమ్మం నుంచి వరంగల్ వెళ్ళడం, వేయి స్తంబాల గుడి దర్శించుకోవడం, ఆ దగ్గర్లో రామప్పగుడికి వెళ్ళడం, తర్వాత హైద్రాబాద్‌లో గోల్కొండ, చార్మినారు చూడడం, "గోలుకొండ పత్రిక" కార్యాలయంలో ప్రతాపరెడ్డిగారినీ, "ఆంధ్రకుటీరం"లో మాడపాటి హనుమంతరావు గారినీ దర్శించుకోవడం నాటి విద్యార్థుల ఆచారం. వారి దర్శనం అయిన తర్వాత మహాకవి "అమ్జద్ హైదరాబాదీ" గారి ఇంటికి వెళ్ళి వారికి సలాము చేసి వారి ఆశీర్వాదం పొందేవాళ్ళం.

ఆయన పార్శీ, అరబ్బీ, ఉర్దూ భాషల్లో గొప్ప పండితుడూ, కవీ, రుబాయిూలు వ్రాయడంలో ఆయనకు ఆయనే సాటి. ఆశువుగా రుబాయిూలు చెప్పేవాడు. అరబ్బీ భాషలో "రుబా" అంటే "నాలుగు" అని అర్థం. నాలుగు పంక్తుల పద్యం గనుక రుబాయిూ అని పేరు వచ్చింది. రుబాయిూకి ప్రపంచ ఖ్యాతి తెచ్చినవాడు ఫారసీకవి ఉమర్ ఖయ్యాం. రుబాయిూకి బహువచనం రుబాయ్యాత్.

"రుబ్బాయ్యాతె ఉమర్ ఖయ్యాం" అనగా ఉమరు రచించిన చతుష్పదులు. ఫిట్జ్‌రాల్డు అనువాదంతో అవి ఆంగ్లభాషా ప్రపంచాన్ని అదరగొట్టాయి.

అలాగే అమ్జద్ ఉర్దూ రుబాయిూలు అందరినోటా పలికేవి. "అమ్జద్" ఆయన కలంపేరు. అసలు పేరు సయ్యద్

అహ్మద్ హుసేన్. కాని "అమ్జద్ హైదరాబాదీ"గానే ప్రసిద్ధుడు.

ఆయన దగ్గరికి వెళ్ళినప్పుడల్లా - పందొమ్మిది వందల ఎనిమిదవ సంవత్సరంలో మూసీనది వరదల్లో హైదరాబాదు మునిగిపోవడం, ఆ వరదల్లో తన రుబాయీలూ, తన బంధువులూ కొట్టుకుపోవడాన్ని గురించి చెబుతూ కన్నీరు పెట్టేవాడు- అమ్జద్. తనకు జ్ఞాపకం వున్న పాత రుబాయీలు తక్కువే.

పరమేశ్వరుణ్ణి, ప్రేయసినీ స్ఫురింపజేసేలా ఉండేవి ఆయన రుబాయీలు. ఉస్నే అంటే అతడు (దేవుడు) కావచ్చు. ఆమె (ప్రేయసి) కావచ్చు. అది ఆ భాష సొగసు. "చిరునామా యే మాత్రం తెలవనేలేదు, ఆచూకీయేకాస్తా తెలియనే లేదు. ధడధడమని గుండెచప్పుడౌతూ వుంది, వచ్చెనేమొ అనుకుంటే రానేలేదు". పరమేశ్వరుడు తన హృదయంలోకి వస్తున్నాడనో, ప్రియురాలు తన వాకిలిలో అడుగుపెడుతున్నదనో కవి భావన. ఈ "ధ్వని" ఆయన కవితలో అడుగడుగునా వినపడేది.

ఆగాపురా ప్రాంతంలో ఒక చిన్న ఇంట్లో వుండేవాడు. ఆయన బేగం, చాయ్ తయారు చేయించి పంపుతూ వుండేది. వేడి వేడి చాయ్ తాగుతూ ఆయన వాడి వాడి రుబాయీలు వినేవాళ్ళం. పసి పిల్లవాడి హృదయం ఆయనది. అలాగని అంత అమాయకుడూ కాడు. కొంటెతనం, గడుసుదనం కొట్ట వచ్చినట్లు ఆయన కవితల్లో కనిపించేవి - ఈ రుబాయీ చిత్తగించండి.

"దేవుణ్ణి గొంతెత్తి పిలుస్తుంటారు, దీవించలేదంటూ గునుస్తుంటారు. పాపాలు చేస్తారూ, వ్రతాలూ చేస్తారు. పథ్యం చేయరు, మందులు తింటుంటారు" పథ్యం చేయకుండా మందులు తింటే పనిచేస్తుందా?

*జ్వాలాతోరణమాల కొండసిగపై బంధించినా రెవ్వరో*
*బాలా! మాధవమాస వాసరములన్ ప్రత్యగ్ర మాధ్వీక పు*
*ష్పాలన్ బంభర కంబుకంధరలు తప్పన్ ద్రావి నిద్రింపగా*
*కాలాజ్వాలలు చుట్టుముట్టినవి సౌఖ్య ధ్వంసకాగ్న్యోఘముల్.*

జ్వాలాతోరణము. 1 : అగ్నిధార

## గోలకొండ పత్రిక

తెలుగు, సంస్కృతం, ఫారసీ, ఉరుదూ భాషావిద్వాంసులకు హైదరాబాదు లోను, జిల్లాల్లోను కొరత వుండేదికాదు. గుండేరావు హర్కారేగారికి ఈ భాషలన్నిటితో పాటు మరాఠీ, కన్నడం మొదలైన భాషలు కూడా వచ్చేవి. అంతటి మహా విద్వాంసులు చాలా అరుదు.

ఏడవ నిజాం రాజు ఉస్మాన్ అలీఖాన్ బహద్దుర్ భాషావేత్త, సాహిత్యాభిమాని, కవి. అతని కాలంలోనే అరాచకం ప్రబలింది. తత్ ఫలితంగా ఆయన గద్దె దిగ వలసి వచ్చింది. ఈయనతోపాటు ఈయనని నమ్ముకున్న వాళ్ళంతా మునిగారు.

రోజొక రాజు దిగిపోయె
రాజ్యం ప్రజాళి పాలాయె
దండుగ రాజుల నమ్మినవారికి
తండులమ్ములే కరువాయె

అని వ్రాశాను నేను. సంస్థానాలు రద్దయిన రోజుల్లో సాహిత్యాభిమానం ఉన్న రాజు తనకేమైనా సహాయం చేస్తాడనే ఉద్దేశ్యంతో సుప్రసిద్ధ ఉరుదూకవి జోష్ హైద్రాబాద్ వచ్చారు. (జోష్ ఇటీవలే పాకిస్తాన్‌లో మరణించారు.) నిజాం రాజు దర్శనం లభించడానికి ఎంతో కాలం పట్టింది. యెందరెందరి ద్వారానో ఆస్థానంలో ప్రవేశించగలిగాడు. ఇంకా ఉద్యోగం దొరకలేదు. ఇంతలో ఆయన భార్య, పిల్లలతో కూడా హైద్రాబాద్‌లో దిగింది. జోష్ కనబడగానే వెక్కి వెక్కి యేడ్చింది.

"ఎందుకూ ఏడవడం? సంగతి చెప్పు" అన్నాడు జోష్.

"ఇంకేం చెప్పను మీ పిల్లల్ని మీరు తీసుకోండి. నా ఉంగరంలోని వజ్రం మింగి ప్రాణం వదిలేస్తా" అంది ఆయన భార్య యేడుస్తూ. "ప్రాణం వదలడం దేనికి?" అని అడిగాడు జోష్. "మరోదాన్ని నిఖా (వివాహం) చేసుకుంటున్నారట కదా? టెలిగ్రాం వచ్చింది" అని చూపించింది. ఆశ్చర్యపోయాడు. ఎవడో వోర్వలేని వాడు దొంగ టెలిగ్రాం యిచ్చాడు. హైదరాబాద్‌లో ఆ రోజుల్లో బహుభార్యాత్వం చాలా యెక్కువ. పిల్లలమీద వొట్టేసి చెప్పారు జోష్, ద్వితీయ వివాహం అబద్ధమని. అప్పుడు ఆమె మనస్సు కుదుట పడింది.

నిజాం నవాబు అందరిపట్ల ఏకవచనమే ప్రయోగించేవారు. ఆయన గురువుగారైన హజ్రత్ జలీల్‌ను కూడా "నువ్వు" అనే సంబోధించేవాడు. గురువుకూడా నోరు మూసుకుని పడివుండవలసిందే. రాజుగారు రాసిన పద్యం పత్రికలో అచ్చయ్యేది కాని కిందనే గురువుగారి ప్రశంస కూడా అచ్చయ్యేది! ప్రశంస అచ్చు వేయకపోతే ఆ పత్రిక యిక వెలువడదు! ప్రశంసించకుంటే గురువుగారు కనపడరు!

మొత్తం మీద జోష్ కృతజ్ఞత తెలుపడానికి నిజాం వద్దకు వెళ్ళాడు జోష్!

"నీకు యెంత మంది భార్యలు!" అని అడిగారు రాజుగారు.

"ఒక్కతే నండీ మహాప్రభో!" అన్నాడు కవి.

"మీది అవధ్ సంస్థానం గదా! అక్కడ అందరికీ ముగ్గురు నలుగురు భార్యలుంటారే" అని అడిగాడు కవి.

"ఉంటారు కాని నాకు నా భార్య అంటే చాలా ప్రేమ. పైగా ఆమె చాలా కాలంగా అనారోగ్యంగా వుంది. మరోదాన్ని చేసుకుంటే ఈమె చికిత్స ఆమె విచికిత్స మధ్య నేను నలిగిపోతాను" అన్నాడు కవి.

"మీ ఆవిడకు జబ్బు? ఎంత కాలం నుంచి?"

"అయిదేండ్లయింది, చస్తున్నాను".

"ఎవరు చికిత్స చేశారు."

"చాలా మంది, కాని ఉపయోగించలేదు" అన్నాడు కవి.

వెంటనే ఒక అయిదు రూపాయలు పనివాడికిచ్చి వనమూలికలు తెప్పించి మందు తయారు చేయించాడు రాజు.

"నాకు తెల్సినంత వైద్యం ఈ డాక్టర్లకు తెలియదు. ఈ మందు ఉదయం, సాయంత్రం నీ భార్యకు ఇవ్వు. మృగశిరకార్తె ప్రవేశించగానే వచ్చి ఎట్లా వుందీ చెప్పు" అని పురమాయించాడు రాజు. పదిహేను రోజుల్లో మృగశిర రానే వచ్చింది. కవి వెళ్ళి తన భార్య ఆరోగ్యం పూర్తిగా బాగైంది అని చెప్పాడు. నిజానికి ఆ మందు పనిచేయలేదు. ఆరోగ్యం బాగైంది అని తెలియగానే నవాబుగారి ముఖంలో ఆనందం తాండవించింది. హైదరాబాదు నగరంలోని డాక్టర్లను, భారతీయ వైద్యం చేసే వారినీ వెంటనే హాజరు పరచమని ఆదేశించారు. అంతా క్షణాల్లో కింగ్‌కోఠీకి వచ్చారు.

తన కుడివైపు వైద్యుల్నీ, యెడమవైపు డాక్టర్లనీ నిలబడమని ఆజ్ఞాపించాడు రాజు. అంతా చేతులు కట్టుకుని రెండు వైపులా నుంచున్నారు. మధ్యలో పోలీస్ కమీషనర్ వెంకటరామారెడ్డిని నిలుచోమన్నారు.

"జోష్ తన భార్య చికిత్సలో ఇరవైవేల దాకా ఖర్చు పెట్టినా ఉపయోగించలేదు. నేను స్వయంగా రెండు మందులిస్తే పదిహేను రోజుల్లో బాగైంది. ఓరి నా బామ్మర్ది యెదవల్లారా! మీకు వైద్యం తెలుసా? తెలుసా అంట? తెలుసు అన్నారంటే మిమ్మల్ని నగ్నంగా పడుకోబెట్టి మీ మల ద్వారాల్లో రైలు నడిపిస్తాను. ఆరైల్లో కూచునీ మన్మాడ్ జంక్షన్‌దాకా వెళ్ళిపోతాను తెలిసిందా?" అని బండ బూతులు తిట్టాడు. బూతులు తిట్టడంలో నిజాంను ఎవరూ మించలేరు. రాజుగారి నోటి నుంచి బండ బూతులు విని వైద్యులవళ్ళు జలదరించింది, గడ్డాలు గాలిలో రెపరెపలాడాయి. మెలి వేసిన మీసాలు వంగిపోయాయి. అవమానపు కాకులు డాక్టర్ల తలలమీద కావు కావుమంటూ అరవసాగాయి. వాళ్ళ వాలిపోయిన కనురెప్పల కిద యెర్రమూతి కోతులు గెంతసాగాయి. వాళ్ళని చూస్తుంటే – నిశ్శబ్దంగావున్న చెరువులో కొండమీది నుంచి బండపడి సంచలనం కలిగినట్లనిపించింది. జోష్ కవి ఇదంతా తన "జ్ఞాపకాల పెళ్ళి ఊరేగింపు" (యాదోంకి బరాత్) అన్న పుస్తకంలో వివరంగా రాశాడు.

నిజాం నవాబు బండ బూతులు వినని తిట్లు తినని అధికారి ఆ రోజుల్లో లేడనే చెప్పాలి. బూతుల పంచాంగ పఠనం అతనికి దినచర్య.

యెంతటివారికీ జంకేవారు గారు ప్రతాపరెడ్డిగారు. అటు ఆంధ్ర మహాసభలో, ఇటు ఆంధ్రసారస్వత పరిషత్తులో ప్రముఖపాత్ర నిర్వహిస్తూ పత్రిక నడిపేవారు. చాలా పట్టుదల మనిషి.

"నిజాం రాష్ట్రంలో ఆంధ్రకవులు పూజ్యము" అని ఎవరో ఒకరు వ్రాశారట. అది ప్రతాపరెడ్డిగారికి బాధ కలిగించింది. ఇట్లా ఎందరో అని వుంటారు.

ఈ కవ్వింపు కారణంగా ఆయన "గోలకొండ కవుల సంచిక" ప్రకటించారు. ఇది 1934 మాట. ఈ సంచికకు వారే సంపాదకత్వం వహించారు. ఈ "గోలకొండ ఆంధ్ర కవివరేణ్య కవితా విలాస పుష్పం" అమరచింత – ఆత్మకూరు సంస్థాన ప్రభ్వీణి శ్రీశ్రీశ్రీ సవైరాణీ భాగ్యలక్ష్మమ్మ బహదరు వారికి అంకితం చేయబడింది.

ఇందులో మూడువందల యాభై నలుగురు తెలంగాణ కవుల కవితలున్నాయి. "భాగ్య సంపూతః హైద్రాబాదు మాతః" అనే మకుటంతో వ్రాసిన కన్నెకంటి సత్యనారాయణమూర్తి కవిత అద్భుతంగా వుంది.

పురాణం పుల్లయ్యగారు "రాష్ట్రాధిక్యత" అనే కవితలో నిజాం రాష్ట్రాంధ్ర కవులను గురించి చెబుతూ –

"ఇట్టి పండిత సత్తము లెందరో ని<br>
జాము రాష్ట్రంబునందు నెసంగుచుండ<br>
కవులులేరన్న యతని వా గ్గరిమ నెంచ<br>
అంధుడు జగంబులేదని యనుటగాదె!" అన్నారు.

గోలకొండ కవుల సంచికలో చక్కని అనుబంధం వొకటి వుంది. దాని విశేషం యేమంటే – ఈ ప్రాంతంలో పూర్వకాలంలో వున్న మహాకవుల, విద్వాంసుల పట్టిక, వారి

వివరాలు ఉన్నాయి. అగస్త్యుడు (నలకీర్తి కౌముదీకర్త) వరంగల్లు వాడు. గౌరనమంత్రి (లక్షణదీపికాకర్త) రాచకొండవాడు. సర్వజ్ఞసింగ భూపాలుడు (రసార్ణవసుధాకర కర్త) కూడ రాచకొండ వాడే. సోమనాథ కవి (వేములవాడ). రతి రహస్యం వ్రాసిన హరిభట్టుది ఖమ్మం మెట్టు. రావిపాటి త్రిపురాంతకుడు (త్రిపురాంత కోదాహరణము) వరంగల్లు వాసి. శతావధానులు శేషాద్రి రమణ కవులు ఈ సంచికను గురించి వ్రాస్తూ –

"గోలకొండ కవుల కుసుమముల్ సమకూర్చి
దండగ్రుచ్చె మా ప్రతాపరెడ్డి" అన్నారు.
"భారతీ కంఠమున గూర్చు భాగ్యరేఖ
అలవడె ప్రతాపరెడ్డి కత్యనఘమతికి" అనీ అన్నారు.

ఎవరో కవ్వించగా చక్కని కవితా సంపుటి వెలువడింది ఆనాడు. అలా అన్నవాడు మహానుభావుడు! మంచిపని చేయించాడు! నిజానికి తెలంగాణ అన్నా ఇక్కడి కవులన్నా విద్వాంసులన్నా నాటి మద్రాసు రాష్ట్రంలోని తెలుగు ప్రాంతంలో నివసించే పెద్దలకు చాలా అభిమానం వుండేది. విశ్వనాథ సత్యనారాయణగారు, మల్లంపల్లి సోమశేఖర శర్మగారు, కట్టమంచి రామలింగారెడ్డి గారు, అడివి బాపిరాజుగారు తరచు హైదరాబాదు వచ్చి ఇక్కడి విద్వాంసులను కలుసుకునేవారు. వారి కృషికి హర్షించేవారు.

గోలకొండ పత్రిక 1925లో అవతరించింది. ప్రతాపరెడ్డిగారే సంపాదకులు. అప్పుడది ద్వైవార పత్రిక. వారి సంపాదకీయాలు అద్భుతంగా వుండేవి. నిజాం ప్రభుత్వానికి ఆ పత్రిక గుండెలో కుంపటి. 1947లో గోలకొండ దినపత్రికగా రాసాగింది.

"గోలకొండ పత్రిక తెలంగాణ ప్రజలను మేలుకొలిపిన మహా సంస్థ" అన్నారు శ్రీ దేవులపల్లి రామానుజరావుగారు. పోలీసు చర్య జరిగేవరకు ప్రతాపరెడ్డి గారే సంపాదకులు. ఆ తర్వాత నూకల నరోత్తమరెడ్డిగారు మేనేజింగ్ ఎడిటర్‌గా బాధ్యత స్వీకరించారు. అప్పటి నుంచి దేవులపల్లి రామానుజరావుగారే సంపాదకీయాలు వ్రాస్తూ వచ్చారు. పత్రికా నిర్వహణ వారే జరిపేవారు. వారి సంపాదకీయాలు వాడిగా వేడిగా వుండేవి. అస్మదాదులం గోలకొండ పత్రికకు రచనలు విధిగా పంపుతూ వుండేవాళ్ళం. అది పత్రిక మాత్రమే కాదు మహా సంస్థ. అది అడుగుపెట్టని ఊరు వుండేదికాదు. మేము జైల్లో సైతం ఆ పత్రికనే చదువుకునేవాళ్ళం. గాఢాంధకారంలో కాంతిరేఖ గోలకొండ పత్రిక.



## కవన లోకం

# రణవీరా! చంద్రశేఖర!!

– పెంటమరాజు నరసింగరావు
9247490965

మణి! నాయకద్యుమణి, మణి!
అణగిన తెలగాణ పౌరుషాగ్నిం సవిజ్యం
భణ జేసినట్టి సాహసి!
రణవీరా ! చంద్రశేఖర! నమస్సులివే!!

# ఇష్టమైన తెలంగాణ

– గుండు రమణయ్యగౌడ్, పెద్దాపూర్

అరవై సంవత్సరాల పోరు ఆగదింకా
ఆరని అగ్నిగుండం తీరు చల్లారదింకా...
ఆంధ్ర పాలకుల నిరంకుశత్వాన్ని
అగ్ని కీలల్లో పారవేసి పాతర పెట్టుదే ఇంకా...

అద్దూ, అదుపూ లేక కోట్లు గడించే
ఆంధ్ర వలస వాదుల ఆటలు సాగవింకా
అన్నదమ్ములంటూ.. సమైక్యవాద మంటూ
అందర్నీ ముంచే, నక్క వినయం పారదింకా...

ఇంకా మా సహనాన్ని చూస్తూ ఊరుకుంటే
ఈటెలై గుండెల్లో గుచ్చక తప్పదింకా...
ఇగో, అగో తెలంగాణ అంటూ ఉంటే
ఇష్టమున్నట్లు ప్రకటనలు చేస్తే ఊరుకోమింకా...

ఈగవాలినా మా తెలంగాణ బిడ్డలపైనా
ఇగ మొదలౌతుంది అనివార్యంగా యుద్ధమింకా...
ఇక రోశయ–చిదంబర–కృష్ణకమిటీలకు జంకమింకా
ఇష్టమైన తెలంగాణ రాష్ట్రాన్ని సాధిస్తమింకా...

# నైజాం కాలంలో హైద్రాబాద్ నగరంలో కవులు, రచయితలు

- పరవస్తు లోకేశ్వర్, 9160680847

నైజాం రాజులు తెలుగు భాషకు, సాహిత్య పోషణకు దూరంగానే వున్నా కవులు, రచయితల ఆవిర్భావం ఆగలేదు. 1850 నుండి 1950 మధ్యకాలంలో 10,15 మంది ముఖ్యమైన కవులు, పండితులు నగరంలో మనకు కనిపిస్తారు.

వారణాసి రామయ్య కవి. 1870లో సికింద్రాబాదులో జన్మించారు. కులం రీత్యా హరిదాసులు. కొండా వెంకట్‌రెడ్డి ఆస్థాన కవి. ఇతడు అనేక గ్రంథ రచనలు చేశాడు. అందులో ప్రముఖమైనది 'దత్తాత్రేయ పంచవింశతి'. పంతం ఆంజనేయ కవి. స్వస్థలం సికింద్రాబాద్. అనేక గ్రంథాలు ముద్రించారు. గోల్కొండ కవుల సంచికలో మాతృప్రేమ శీర్షికతో పద్యాలను అచ్చు వేశారు. అరిగే రామస్వామి. 1890లో హైద్రాబాద్‌లో జననం. దళితుడు, దళిత ఉద్యమనాయకుడు. రైల్వే ఉద్యోగం చేసేవాడు. కవిత్వంలో నిష్ణాతుడు. గోరాగారి ప్రభావం వలన నాస్తికత్వాన్ని ప్రచారం చేశాడు. ప్రముఖ సంఘ సంస్కర్త. రైతుల మీద, దళితుల మీద కవిత్వం రాశాడు. తిరుమల పంచాంగం వెంకటాచార్యులు. హైద్రాబాద్‌లోని సీతారాంబాగ్ నివాసి. 1890లో జన్మించాడు. ఈయన రాసిన జానకీ పరిణయం, చంద్రమతి పరిణయం ముద్రణకు నోచుకోలేదు. ఈతని దంపతీ సంవాదం గోల్కొండ కవుల సంచికలో అచ్చయ్యింది. గొట్టుపర్తి సుబ్బారావు. హైద్రాబాద్ నివాసి. 1837 జూన్ నెలలో జన్మించాడు. ఈయన వెంకటేశ్వర శతకం రాశాడు. కాని ప్రచురణకు నోచుకోలేదు. సురవరం ప్రతాపరెడ్డి పుణ్యమా అని ఈతని ఆత్మబోధ వెలుగులోకి వచ్చింది. కొండా ఎల్లయ్య. 1903 హైద్రాబాద్‌లో జన్మించాడు. పద్మశాలి కులస్తుడు. ఇతని రచనలన్నీ అముద్రితాలే. పేరకం రంగాచార్యులు. గౌలీగూడా నివాసి. 1904లో జన్మించాడు. అనేక గ్రంథాల రచయిత. గోల్కొండ కవుల సంచికలో సూర్యుడు అనే శీర్షిక కింద పద్యాలు అచ్చు అయ్యాయి. కిండింబివారి కేసరి శృంగారం కృష్ణాచార్యులు. సీతారాంబాగ్ నివాసి. 1905లో జన్మించాడు. సంస్కృతాంధ్ర కవి. జ్యోతిశ్శాస్త్ర పండితుడు. వాద్యోపాఖ్యానము ఈతని రచన. పి.వి. వరదాచార్యులు. సీతారంబాగ్ నివాసి. వృత్తిరీత్యా వైద్యుడు. ఆయుర్వేదం ఆరోగ్యం మీద పద్యాలు రాశాడు. చివుకుల అప్పయ్య శాస్త్రి. సికింద్రాబాద్‌లోని ఇమామ్‌బౌడి నివాసి. దివ్యవాణి పత్రిక సంపాదకుడు. ముడుపు శేషగిరిరావు 1921 ఆగస్టులో జన్మించాడు. విజయనగర్‌కాలనీ నివాసి. అనేక గ్రంథాల రచయిత. శ్రీవిజయ రామరాజ చరిత్ర ఈతని ముఖ్య రచన. అన్నగారి వెంకటకృష్ణరాయుడు. బీబీనగర్ నివాసి. అనేక పద్య రచనలు చేశాడు. స్త్రీ విరహిణి శతకంలోని కొన్ని పద్యాలు గోల్కొండ కవుల సంచికలో అచ్చయ్యాయి. వేలూరి రంగధామ నాయుడు. బడీచౌడీ నివాసి. లండన్ పట్టభద్రుడు. ఈయన ఆళ్వారు చరిత్రము, శంకర విజయము, శ్రీకృష్ణలీలలు మొదలగు గ్రంథాలు రాశాడు. ఈతని నీలకంఠ గురువు కవిత గోల్కొండ కవుల సంచికలో వుంది. కీ॥శే॥ సురవరం ప్రతాపరెడ్డి ప్రోత్సాహం వలన వీరందరు కవులుగా రాణించారు. తెలంగాణలో అసలు కవులే లేరంటూ అసత్య ప్రచారం జరిగినప్పుడు సురవరంగారు 1934లో గోల్కొండ కవుల సంచికను ఫోటోలతో సహా తీసుకువచ్చారు. 354 మంది తెలంగాణ కవులు ఇందులో వున్నారు. 237 సంస్కృత శ్లోకాలు, 1181 తెలుగు పద్యాలు ఇందులో వున్నాయి. తెలంగాణ అస్తిత్వ వాద ఉద్యమానికి సురవరం ప్రతాపరెడ్డి గారు ఆద్యులు. వీరు గోల్కొండ పత్రికను స్థాపించి తెలంగాణ పతాకాన్ని దశదిశలా ఎగురవేశారు. వీరి అసలైన వారసుడు కాళోజి నారాయణరావు గారు. తెలంగాణ అగ్నిని ఆరకుండా నిలబెట్టింది వారే.

హైద్రాబాద్ నగరం ఒక మహావృక్షం. ఆ వృక్ష శాఖలలో అనాది నుంచి వున్న పావురాలేగాక బయటినుండి వచ్చి స్థావరం ఏర్పాటు చేసుకున్న కోయిలలు కూడ వున్నాయి. అటువంటి వారే మాడపాటి హన్మంతరావు, బూర్గుల రామకృష్ణారావు, కొమర్రాజు లక్ష్మణరావు, రాయప్రోలు సుబ్బారావు, ఆదిపూడి సోమనాథరావు, దాశరథి కృష్ణమాచార్య, ఖండవల్లి లక్ష్మీరంజనం, శేషాద్రిరమణ కవులు, పల్లా దుర్గయ్య, వానమామలై వరదాచార్యులు మొదలగువారు. వీరిలో చాలామంది సాహిత్య పరిశోధనలు చేశారు.

తెలంగాణ కొనసాగించిన సాహిత్య పరిశోధనకు సాహిత్య పత్రికలు, సాహితీ సంస్థలు కృషిచేశాయి. తెనుగు, నీలగిరి, విభూతి, తెలుగుతల్లి, శోభ, సుజాత, మీజాన్, గోలకొండ మొదలగు పత్రికలు మరియు విజ్ఞాన చంద్రికా మండలి, ఆంధ్ర సారస్వత పరిషత్తు, తెలంగాణ రచయితల సంఘం, విజ్ఞాన వర్ధనీ పరిషత్తు, సాధన సమితి, దేశోద్ధారక గ్రంథమాల, అణా గ్రంథమాల మొదలగు సాహిత్య ప్రచురణ సంస్థలు పరిశోధనలకు వేదికగా ఉపకరించాయి.

హైద్రాబాద్ నగరంలో వీరే గాక జిల్లాల్లో ఇతర పరిశోధకులను కొందరినైనా స్మరించుకోవటం అవసరం. పాలమూరు జిల్లాల్లో హుస్నాబాద్ నాగలింగ శివయోగి తాళపత్ర

గ్రంథ సేకరణలో తమ జీవితాన్నే వెచ్చించగా, కపిలవాయి లింగమూర్తి పెక్కు అముద్రిత కావ్యాలను పరిష్కరించి వెలుగులోకి తెచ్చినాడు. తేరాల సత్యనారాయణశర్మ రాచకొండ కవుల చరిత్రను, మల్యాల దేవీప్రసాదు మెదక్ మండల సాహిత్య చరిత్రను పరిశోధించినాడు. తెలుగు ఛందోవికాసమును వివేచించిన కోవెల సంపత్కుమార వరంగల్లు జిల్లా కవుల, పండితుల, రచయితల చరిత్రను అందించినాడు. మూసీ పత్రికను నిర్వహించిన బి.ఎన్. శాస్త్రి తెలంగాణ శాసనాలను వెలికి తీయటమేకాక, నల్లగొండ నవాబుల కాలంనాటి చరిత్రను త్రవ్వి తీసినాడు. ఈ సందర్భంలో తొలి దశలో తెలంగాణలో స్థాపించబడిన పత్రికల గురించి కూడా తెలుసుకోవాలి: ఈ సందర్భంగా తొలి తరంలోని తెలంగాణ రచయిత్రులను కూడా మనం జ్ఞాపకం చేసుకోవాలె. ఎల్లాప్రగడ సీతాకుమారి, ఇల్లిందుల సరస్వతీదేవి. (ఈ ఇద్దరూ ఆంధ్రులయినా తెలంగాణ కోడళ్లమని సగర్వంగా ప్రకటించుకున్నారు). నందగిరి ఇందిరాదేవి. 1919లో హన్మకొండలో జన్మించారు. పర్సా జానకీదేవి. 1923లో జన్మించారు. సామరాజు ఇందిరాదేవి (వరంగల్), పాకాల యశోధరా రెడ్డి. 1930లో మహబూబ్ నగర్‌లో జన్మించారు. బొమ్మ హేమాదేవి అసలు పేరు బొమ్మా రుక్మిణీదేవి. 1932 లో నిజాంబాద్‌లో జన్మించారు. మాదిరెడ్డి సులోచన 1936లో

## తెలంగాణ తొలి పత్రికలు

| సం॥ | పేరు | వెలువడిన ప్రదేశం | పత్రికపేరు | సంపాదకులు |
|---|---|---|---|---|
| 1886 | శేద్యచంద్రిక | హైద్రాబాద్ | మాసపత్రిక | ప్రభుత్వ పత్రిక |
| 1890 | దినవర్తమాన్ | సుల్తాన్ బజార్ | ??? | నారాయణస్వామి మొదలియార్ |
| 1909 | సంయుక్త సంఘవర్తమాని | మధిర, ఖమ్మం | క్రైస్తవ పత్రిక | ఎస్.బి.సిమోన్-పశుమలే |
| 1913 | హితబోధిని | వనపర్తి | సాహిత్యమాసపత్రిక | శ్రీనివాసశర్మ |
| 1917 | ఆంధ్రమాత | సికింద్రాబాద్ | మాసపత్రిక | దివ్యజ్ఞాన సమాజం, స్వామి వెంకటరావు |
| 1920 | ములాగ్ వర్తమాని | ఖమ్మం | క్రైస్తవ మాసపత్రిక | ఎం.పి.టాక్ |
| 1921 | సువార్తామణి | మహబూబ్‌నగర్ | క్రైస్తవ మాసపత్రిక | గంధం అల్బర్టు సామేలు |
| 1922 | తెనుగు | వరంగల్(ఇనుగుర్తి) | వారపత్రిక | ఒద్దిరాజు సీతారామచంద్ర రావు |
| 1922 | నీలగిరి | నల్లగొండ | వారపత్రిక | షబ్నవీస్ వెంకటరామ నర్సింహా రావు |
| 1923 | శైవప్రచారిణి | వరంగల్ | మాసపత్రిక | ఎం.వి. శాస్త్రి |
| 1923 | రయ్యత్ | హైద్రాబాద్ | దినపత్రిక | మందుముల-నర్సింగరావు |
| 1925 | నేడు | సికింద్రాబాద్ | పక్షపత్రిక | శ్రీభాస్కర్ |
| 1925 | భాగ్యనగర్ | హైద్రాబాద్ | పక్షపత్రిక | భాగ్యరెడ్డి వర్మ |
| 1926 | గోల్కొండపత్రిక | హైద్రాబాద్ | పక్షపత్రిక | సురవరం ప్రతాపరెడ్డి |
| 1927 | ఆది హిందూ | హైద్రాబాద్ | పక్షపత్రిక | భాగ్యరెడ్డివర్మ |
| 1927 | సుజాత | హైద్రాబాద్ | మాసపత్రిక | పసుమాముల నృసింహాశర్మ |
| 1938 | తెలుగుతల్లి | హైద్రాబాద్ | మాసపత్రిక | శ్రీమతి రాచమల్లు సత్యవతీదేవి |
| 1934 | దక్కన్ కేసరి | హైద్రాబాద్ | మాసపత్రిక | దత్తాత్రేయశర్మ |
| 1936 | విభూతి | హైద్రాబాద్ | మాసపత్రిక | చిదిరెమఠం వీరభద్రశర్మ |
| 1937 | దివ్యవాణి | హైద్రాబాద్ | వారపత్రిక | చివుకుల అప్పయ్యశాస్త్రి |
| 1937 | శోభ | వరంగల్/హైద్రాబాద్ | మాసపత్రిక | దేవులపల్లి రామానుజరావు |
| 1944 | తెలంగాణ | హైద్రాబాద్ | దినపత్రిక | బుక్కపట్నం రామనుజాచార్యులు |
| 1947 | ఇమ్రోజ్ | హైద్రాబాద్ | దినపత్రిక | షోయబుల్లాఖాన్ |

శంషాబాద్‌లో జన్మించారు. పోల్కంపల్లి శాంతాదేవి 1942లో వనపర్తిలో జన్మించారు. తెన్నేటి సుధాదేవి 1952లో హన్మకొండలో జన్మించారు. ఈ రచయిత్రులకు వారసులుగా తర్వాత కాలంలో చాలా మంది రచయిత్రులు తెలంగాణ నుండి వచ్చారు.

ఈ సందర్భంగా తెలంగాణ యక్షగాన పితామహుడు చెర్విరాల భాగయ్యకవిని మనం మరువరాదు. ఈయన 1903 లో ముషీరాబాదులో జన్మించాడు. 1912 ప్రాంతంలో బొంబాయికి వెళ్ళి సుమారు 40 సంవత్సరాలు కార్మికుడిగా పనిచేశాడు. రెండో ప్రపంచ యుద్ధకాలంలో మిల్లు మూతపడగా వరంగల్లుకు వచ్చి ఆజంజాహిమిల్లులో కార్మికునిగా పనిచేశాడు. సమ్మెకారణంగా అది మూతపడింది. మళ్లీ ముషీరాబాదు వచ్చాడు. కొండా శంకరయ్య ప్రచురణల సంస్థ ఈతని పుస్తకాలను ముద్రించింది. అందులోనే చివరి వరకు ప్రూఫ్‌రీడర్‌గా పనిచేశాడు. ఈతని సుగ్రీవ విజయం యక్షగానం ఆ రోజులలో లక్ష ప్రతులు అమ్ముడుబోయి చరిత్రనే సృష్టించింది. ఈయన బహుగ్రంథ కర్త. 15 వరకు ఆధ్మాత్మిక-తంత్ర-మంత్ర శాస్త్ర గ్రంథాలను, 25కు పైగా బతుకమ్మ పాటలను, రెండు శతకాలను, ఒక నవల, రెండు బుర్రకథలు రాశాడు. వందకుపైననే యక్షగానాలు రాశాడు. అన్ని రచనలు కలిపి దాదాపు 200 వరకు వుండొచ్చని అంచనా. వారి జీవిత కాలంలోనే 50 లక్షల గ్రంథాల ప్రతులు అమ్మవచ్చని అంచనా. ఈయన అసలుసిసలు తెలంగాణ ఆత్మ తత్వవాది. జీవితమంతా దరిద్రంతోనే బతికాడు. కర్మనే దైవంగా భావించాడు. చేతికి, నోటికి, కాలికి విశ్రాంతి ఇవ్వకుండా వృత్తి, ప్రవృత్తిని కొనసాగించాడు. 1966లో కాలం చేశాడు.

తొలితరం కవులనే గాక తొలితరం కథకులను కూడా మనం ఈ సందర్భంగా స్మరించుకోవాలి. 1912లో మొదటి కథ హృదయశల్యము. దీనిని మాడపాటి హన్మంతరావు రాశాడు. వరంగల్లులోని ఒద్దిరాజు సోదరులు మరియు సిరిగూరి జయరావు, ఆదిరాజు వీరభద్రరావు, సురవరం ప్రతాపరెడ్డి, హీరాలాల్ మోరియాగారలు అనేక కథలను రాశారు. తొలి తెలంగాణ కథకురాలు నందగిరి ఇందిరాదేవి. 1941లో ఈమె కథ అచ్చయ్యింది. తర్వాత కాలంలో అనేక మంది తెలంగాణ రచయిత్రులు వచ్చారు.

1930-40 ప్రాంతాలలో గ్రంథాలయ ఉద్యమం బయలుదేరింది. ఇది జాతి జనులను జాగృతం చేసేందుకు ఒక పునరుజ్జీవన, పునర్వికాస ఉద్యమంగా పనిచేసింది. ఈ ఉద్యమంలో భాగంగా అణా గ్రంథమాల లాంటి సంస్థలు ఎన్నో కృషి చేశాయి. తొలి దశలో తెలంగాణలో గ్రంథాలయాలు ఎప్పుడు ఎక్కడ ప్రారంభించబడ్డాయో తెలుసుకుందాము:

## హైద్రాబాద్ స్టేట్‌లో గ్రంథాలయాల స్థాపన

| | |
|---|---|
| 1872 | ముదిగొండ శంకరాధ్యుల లైబ్రరీ, సికింద్రాబాద్ |
| 1892 | ఆసఫియా స్టేట్ సెంట్రల్ లైబ్రరీ |
| 1895 | భారత్ గుణ వర్ధక్ సంస్థ లైబ్రరీ, శాలిబండ |
| 1896 | బొల్లారం లైబ్రరీ |
| 1901 | శ్రీ కృష్ణదేవరాయ ఆంధ్రభాషా నిలయం, సుల్తాన్‌బజార్ |
| 1904 | రాజరాజనరేంద్ర ఆంధ్రభాషా నిలయం, హన్మకొండ |
| 1905 | విజ్ఞాన చంద్రికా గ్రంథ మండలి, హైద్రాబాద్ |
| 1913 | ప్రతాపరుద్ర ఆంధ్రభాషా నిలయం, మడికొండ, వరంగల్ జిల్లా |
| 1913 | సంస్కృత కళా వర్ధనీ గ్రంథాలయం, సికింద్రాబాద్ |
| 1923 | బాలసరస్వతీ గ్రంథాలయం, హైద్రాబాద్ |
| 1930 | జోగిపేట గ్రంథాలయం, మెదక్ జిల్లా |

వట్టికోట ఆళ్వారుస్వామి, ఆదిరాజు వీరభద్ర రావు, జమలాపురం కేశవరావు, హీరాలాల్ మోరియా, కోదాటి నారాయణరావు, కొమర్రాజు లక్ష్మణరావు మొదలగువారెందరో ఈ గ్రంథాలయ ఉద్యమానికి పునాదులు వేశారు. ఇందులోనుండే ఆంధ్ర మహాసభ ఆవిర్భవించి, అద్భుతమైన పాత్ర పోషించి, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి బాట వేసింది. ఈ సాయుధ పోరాటం సందర్భంగా అనేక మంది కవులు, కళాకారులు, గాయకులు ఆవిర్భవించారు. వారిలో సుద్దాల హన్మంతు (పల్లెటూరి పిల్లగాడ - పసులుగాసే మొనగాడ) బండి యాదగిరి (బండెనక బండి గట్టి పదహారు బండ్లు గట్టి - ఈ పాట అంతకు పూర్వమే వాడుకలో వుంది. కాలానుగుణంగా ఈ పాటను మార్చినారు) ఎర్రోజు మాధవాచార్యులు, తిరునగరి రామాంజనేయులు, మగ్దుం మోహియుద్దీన్ మొదలగు వారలు ముఖ్యులు. వీరి వారసత్వపు కొనసాగింపే ఈనాటి గద్దర్, గోరెటి వెంకన్న, గూడ అంజయ్య మొదలగు వారు.

తెలుగు సాహిత్యంలో ఈ నాటికీ గిడుగు పిడుగు, గురజాడ, వీరేశలింగం వంటివారలే రాజ్యమేలుతున్నందున తెలంగాణ సాహిత్య చరిత్రను ఇంత వివరంగా శాతవాహన కాలం నుండి 1950 వరకు పునర్మూల్యాంకనం చేసుకోవలసి వచ్చింది.

*గతంలో అచ్చయిన - హైద్రాబాద్ సంస్థానంలో పరిశ్రమల అభివృద్ధి అనే వ్యాసం కూడ శ్రీ పరవస్తు లోకేశ్వర్ గారి రచన అని గ్రహించ గలరు.*

*- సం॥*






# మన హైదరాబాదీ చేతలకు నమస్కరిద్దాం!

- అనురాగ్

హైదరాబాద్ ఆకాశవాణి కేంద్రం ఆవిర్భవించి యిప్పటికి అరవై సంవత్సరాలు పూర్తయినాయి. కోట్లాది తెలుగు శ్రోతల గుండెల్లో అనుదినం అనేకసార్లు మారుమోగుతున్న వినోద - విజ్ఞాన - వికాసాల్ని విస్తృతంగా పంచి ఇస్తూ వచ్చిందీ రేడియోపెట్టె. తర్వాత అది ట్రాన్సిస్టరయ్యింది. ఈ కేంద్రం ఎంతో మంది వాచస్పతుల గొంతు చీల్చుకొని - సరికొత్త ఊపిర్లు నింపుకొని శ్రోతలను ఆకట్టుకునే రసవత్తర కార్యక్రమాలనెన్నింటినో మూటగట్టుకొని - శ్రోతల వీనులకు విందు చేకూరుస్తూ వచ్చింది. నిరక్షరాస్యులు ఎక్కువ మంది ఉంటున్న ఈ రాష్ట్రంలో - హైదరాబాద్ ఆకాశవాణి ఒక విలక్షణమైన పాత్రను పోషిస్తున్నది. ముఖ్యంగా వినోదాన్ని అందించటంతోపాటు, విద్యా వైజ్ఞానిక కార్యక్రమాలనెన్నింటినో - ఎప్పటికప్పుడు తాజాతాజాగా రూపొందించి ప్రసారం చేస్తున్నది. బాలబాలికలు, విద్యార్థులు, యువతీయువకులు, మహిళలు, వ్యవసాయరంగంలో ఉంటున్నవారు, పరిశ్రమల్లో పనిచేస్తున్నవారు - ఇట్లా అనేక రంగాల్లో ఉంటున్న శ్రోతలకు, ప్రత్యేక కార్యక్రమాల్ని ప్రసారం చేస్తున్నది. ఇంగ్లీషు, హిందీ, ఉర్దూ, కన్నడ, మరాఠీ వంటి భాషలతోపాటు - తెలుగు భాషాభివృద్ధికి - హైదరాబాద్ ఆకాశవాణి - శ్లాఘనీయమైన కృషి చేసింది. చేస్తూనేవుంది. ఈ రాష్ట్ర ప్రజలు ఎన్నో భాషలు మాట్లాడుతుంటారు. తెలంగాణ, రాయలసీమ, శ్రీకాకుళం, ఉభయ గోదావరి జిల్లాల ప్రజలు - వేర్వేరు మాండలికాల్లో మాట్లాడుతుంటారు. విభిన్న స్వరూప స్వభావాలు కలిగిన తెలుగు భాషకు ఈ కేంద్రం తన ప్రసారాలద్వారా పరోక్షంగానైనా ఒక సమగ్ర రూపాన్ని తీసుకొచ్చే ప్రయత్నం చేసింది. రోజూ సుమారు 15 గంటలపాటు - సాహిత్య, సంగీత, నాటక, సాంస్కృతిక కార్యక్రమాలతోపాటు దేశ విదేశ వార్తలు కూడ అందిస్తూ, అందర్నీ తనవైపు ఆకట్టుకుంటూ - రాష్ట్రంలోని ప్రతి ఇంటా - ఈ ఆకాశవాణి ఆత్మబంధువై అలరిస్తూ వచ్చింది. 1950 - ఏప్రిల్ నెలలో - తొలి ప్రసారాల్ని ప్రారంభించిన హైదరాబాద్ ఆకాశవాణికి - ఘనకీర్తి కలిగిన గతం మరెంతో ఉంది.

*ఇప్పటికి 77 ఏళ్ళక్రితం - అంటే, 1933వ సంవత్సరంలో పోస్టల్ డిపార్ట్‌మెంట్‌లోని ఓ సాధారణ ఉద్యోగి మహబూబ్ అలీ అనే వ్యక్తి - స్వంతంగా ఓ ప్రసార కేంద్రాన్ని ఏర్పాటు చేసుకున్నాడు. అతి తక్కువ శక్తి సామర్థ్యం కలిగిన ట్రాన్స్‌మిటర్‌తో నడిచే ఈ ప్రసార కేంద్రంనుంచి వినవచ్చే కార్యక్రమాలు ఆనాడు హైదరాబాద్ నగరవాసులకే పరిమితమయ్యాయి. రెండేళ్ళ తర్వాత - 1935లో ఈ అతి చిన్న ప్రసార కేంద్రాన్ని నిజాం ప్రభుత్వం స్వాధీనం చేసుకుని - సరూర్‌నగర్ ప్రాంతానికి తరలించింది. 5 కిలోవాట్ల శక్తి కలిగిన ట్రాన్స్‌మిటర్ సాయంతో కార్యక్రమాల ప్రసారాన్ని ప్రారంభించింది. ఇక ఆ తర్వాత 1939లో ఈ కేంద్రాన్ని ఖైరతాబాద్‌కు మార్చారు. ఇప్పుడున్న ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ భవన ప్రాంగణ ప్రాంతంలో ఈ కేంద్రం దక్కన్ రేడియో పేరుతో పూర్తిస్థాయి కేంద్రంగా పనిచేయడం ప్రారంభించింది.*

1935లో ప్రారంభమైన దక్కన్ రేడియో - 1947లో భారత్‌కు స్వాతంత్ర్యం వచ్చిన తరువాత 1948లో విజయవాడ రేడియో కేంద్రం ప్రారంభమైన నాటికి కూడా - ఉర్దూ, తెలుగు కార్యక్రమాల్ని ప్రసారం చేస్తూనే ఉండేది. 1950లో రేడియో ప్రసార వ్యవస్థ ఈ దక్కన్ రేడియోను తనలో విలీనం చేసుకుంది. అప్పటినుంచీ కొంతకాలంపాటు - ఆలిండియా రేడియో హైదరాబాద్ కేంద్రం - అని అనౌన్స్ చేసేవారు. ఆ తరువాత జాతీయస్థాయి అధికారులు ఆలిండియా రేడియో అనే పదానికి బదులు - దేశంలోని అన్ని కేంద్రాలూ ఆకాశవాణి అంటూ అనౌన్స్ చేసుకోవాలని ప్రతిపాదించారు. ఆ విధంగా ఇది ఆకాశవాణి - హైదరాబాద్ కేంద్రం అయ్యింది. 1957లో

ఈ కేంద్రాన్ని, సైఫాబాద్ రాక్‌ల్యాండ్స్‌లో ఉన్న ఇప్పటి ప్రాంగణానికి మార్చారు. *1970లో* ప్రత్యేకించి యువవాణి విభాగాన్ని కూడా ఈ కేంద్రంలో ఏర్పాటు చేయటం జరిగింది. అంతకుముందు *1956లోనే* ప్రాంతీయ వార్తావిభాగం, *1959లో* వ్యవసాయదారులకు ప్రత్యేకించి ఓ విభాగం కూడా సేవలందిస్తూవుండేవి. అప్పటినుంచీ ఈ హైదరాబాద్ ఆకాశవాణి కేంద్రం అంచెలంచెలుగా తన శక్తి సామర్ధ్యాలను పెంచుకుంటూ - సాంకేతికపరంగా కూడా ఎన్నో ప్రయోగాలు చేస్తూ - కోట్లాదిమంది శ్రోతలకు వినోదాన్ని, విజ్ఞానాన్నీ అనుదినం అందిస్తున్నది. హైదరాబాద్ ఆకాశవాణిలో పనిచేసినవారిలో స్థానం నరసింహారావు, దాశరథి, దేవులపల్లి కృష్ణశాస్త్రి, బుచ్చిబాబు, గోపీచంద్ వంటి ఎంతో మంది ఉన్నారు.

అప్పట్లో తాజా వార్తలంటే రేడియో వార్తలనే అందరికీ గుర్తు. ప్రాంతీయ వార్తలకు అంతకంటే ముఖ్యంగా ప్రాధాన్యం ఉండేది. వార్తా ప్రసారాల సమయం కోసం శ్రోతలు ఎదురు చూస్తూవుండేవారు. పల్లెటూళ్లలో రేడియో వార్తల్నే ప్రధానంగా ఆశ్రయించేవారు. అయితే, ఆనాడు అందరికీ రేడియో సాధనాన్ని పొందే అవకాశం లేనందున పంచాయితీ ఆఫీసు ప్రాంగణాన్నో, పబ్లిక్ పార్కునో అక్కడ ఉండే స్పీకర్లలోంచి ప్రాంతీయవార్తల్ని వినేందుకు జనాలు గుమికూడేవారు. సాయుధ రైతాంగ తెలంగాణ పోరాటకాలంలో ప్రజలు రేడియోవార్తల సమయాలను తెలుసుకుని ఆయా ప్రాంతాలలో ఉద్యమం ఏయేస్థాయిలలో ఎగసిపడుతున్నదీ - విని - తెలుసుకునేవారు. విశ్లేషించుకునేవారు. స్ఫూర్తిని పొందుతూవుండేవారు. ఈ వార్తలు నిర్ణీత సమయాల్లో తప్ప మరల వినే వీలు లేనందుకు నొచ్చుకునేవారు కూడ.

ఆకాశవాణి హైదరాబాదు కేంద్రానికి - ఎంతో గుర్తింపు తీసుకొచ్చినవి నాటకాలు. ఆదివారాలు, గురువారాల్లో ప్రసారమయ్యే నాటకాలు, వినటానికి ఒకప్పుడు శ్రోతలు - ఎన్ని ముఖ్యమైన పనులున్నా వాటిని వాయిదా వేసుకొనివినేవారు. సుమారు పాతికేళ్లపాటు శ్రోతల్ని ఆకట్టుకొని - బహుళ ప్రజాదరణ పొందిన మరో ప్రముఖ కార్యక్రమం - ఆదివారం నాటి కార్మికుల కార్యక్రమం. ఇది మధ్యాహ్నం *12.40* ని॥లకు జాతీయవార్తల తదనంతరం ప్రసారమవుతూవుండేది. కార్మికశక్తి ఆనాడు ఎంతో బలీయంగా పనిచేస్తూ ఉద్యమిస్తూ, పరిష్కారాలను కనుగొనబోయేది. చర్చలకు వీలుండేది. అనుమానాల నివృత్తికి తావుండేది.

ఇట్లా చెప్పుకోవాల్సివస్తే రేడియో సేవలు బహుళంగా వుండేవి. వాటిని ఏకరువు పెట్టడం ఒక్క ఉదుటున సాధ్యం కాదు. ప్రపంచం సహజంగా ఎదుగుతూపోతుంది. రోజు-రోజుకూ విస్తరిస్తున్న జ్ఞానం - తత్ సంబంధమైన అధునాతన సాధనాల కారణంగా రేడియో చల్లబడింది. కాని, చతికిలబడలేదు. ఇప్పటికీ యిష్టంతో, అలవికాని అనురాగభావంతో, రేడియోను వినేవారు లెక్కకు మిక్కిలిగానే వుంటారు. కాకపోతే వాళ్ళు ఆర్భాటం చేయరు. దాని శ్రవణ గుణాన్ని - సౌభాగ్యాన్ని అపురూపంగా ఎంచుతుంటారు. వాటి స్థానాన్ని (యిది స్పీడు యుగం గనుక) ఎఫ్‌ఎం వంటివి ఆలంకరింపజూస్తాయి. కాని సంగీతానికీ-శబ్దకాలుష్యానికీ పొంతన కుదరదు కదా! ఉద్యమానికీ - వృద్ధవ్యసనాలకూ సాపత్యం నిలువదు కదా! దృశ్యం గొప్పదేకాని అది రక్తమోడుతూ, అశ్లీలతను ధరిస్తూ, అరుస్తూ, దేబిరిస్తూ వున్నది. కళ్ళుపోతాయేమోనన్నంత భయంకరంగా మారినవి పరిస్థితులు. ఆలెక్కన పోల్చుకున్నప్పుడు ఒక హైదరాబాదీ రేడియో - ప్రసార కేంద్రాన్ని ఏర్పాటు చేయడం శ్లాఘనీయం కదా! అతని చేతలకు నమస్కరిద్దాం.

వీర తెలంగాణ

మాసపత్రిక

చదవండి! చదివించండి!!

చందాదారులుగా చేరండి, చేర్పించండి!!!

"వీర తెలంగాణ" మాసపత్రిక కార్యాలయం

పోస్టల్ చార్జీలు వగైరాలతో కలిపి ఈ "వీర తెలంగాణ" మాసపత్రిక వార్షిక చందా రూ. 200/-లు మనీఆర్డరు / చెక్కు / డి.డి. ద్వారా యీ దిగువ చిరునామాకు పంపమని కోరుతున్నాం.

6-2-10/3, 2వ అంతస్థు, బి.ఎన్.రెడ్డి కాంప్లెక్స్,
సుప్రభాత్ రెస్టారెంటు పక్కన, హైదరాబాదు రోడ్డు,
నల్లగొండ - 508 001.
సెల్ నెం. 9441188337, ఫ్యాక్స్ నెం. 08682-222334.

www.veeratelangana.org

- ఎడిటర్

ఆన్‌లైన్ ద్వారా సరాసరి "వీర తెలంగాణ"కు బ్యాంకులో డబ్బులు జమ చేయదలసిన వారు **62123432351** నెంబరు గల అకౌంటులో జమచేయగలరు.

'కథ'న కుతూహలం

# వర్ష నృత్యం

– జాజుల గౌరి



వారం నుంచి ఎడతెరిపి లేని వాన. ఆ రోజే కొంచెం తెరపిపడి మళ్ళా వేగం పుంజుకుంటుంటే పని ఉన్నదన్నట్లు గబ గబా కదిలిపోతున్న నీలి మేఘాలు, కారు మేఘాలై రయ్యి రయ్యిన హోరుగాలి జతై, జలజల ముత్యాల్లా రాలుతున్న వాన చినుకుల ముసురు జోరందుకుంటుండగా మూలన ముడుచుకున్న గువ్వల్లా అమ్మెన్క మేము.

అమ్మ లోపల యింట్లో పనిల మునిగివుంటే ఎదురింట్ల చెల్లె నేను పావులాట ఆడుతున్నం. అంతట్లనే అమ్మ బయటకు తొంగిచూస్తా"పొద్దుగాల్ల జెర గవురిచ్చిందని ఆవులను మేపుక రమ్మని అన్నను మైదాన్లకు తోలిన. అటు పోయిండో లేదో ఈ పాడు ఆన మల్లా జమాయించి కొట్టవట్టె. కొడుకు ఏడున్నడో ఏమో" అంటూ అన్న గురించి భయపడసాగింది.

ఆ మాట నా చెవిల పడంగనే ఆటను వదిలి ఎదరతలుపు దగ్గరకుపోయి అమ్మను చూస్తా "అమ్మా – అన్న ఏం నానడు తియ్యే, ఏ మఱ్ఱిచెట్టు తొఱ్ఱలనో తడువకుండా కూకోని వుంటడు తియ్యి" అని అనంగనే –

అది చూసి గిరుకున్న వెనుకకు తిరిగి బయట తలుపుదగ్గరకు పోయి వాన దిక్కు చూసినా. కుండపోత వానతో పరిసరాలు ఉక్కిరిబిక్కిరౌతున్నాయి. మా వాకిలైతే పొక్కిలి పొక్కిలై మొరం తేలుతున్నది. ముందలంతా వాన నీళ్ళు జరజరా పారుతుంటె అడుగు భాగం తేటగయింది. రయ్యి–రయ్యిన వీస్తున్న హోరుగాలి, వాన చినుకులను రపరపమంటూ దిశను మారుస్తున్నపుడు చిరు జల్లు నన్ను తడపబోతుంటే 'ఓహ్' అంటూ వెనకకు జరిగి గనుమ మీద నిలబడి చూరు నుంచి ధారగా కారుతున్న వాన నీళ్ళ కిందికి చేతులను అడ్డంగా చాపేసరికి, రయ్యిన పడ్తున్న నీళ్ళు నా అరచేతులల్ల గిరికీలు కొట్టి చక్రాల్లా మారి నన్ను నిలువునా తడిపేస్తుంటే హ్హా..హ్హా.. అంటూ సంతోషంగా నవ్వుతా చెల్లలు దిక్కు మర్లి చూసి నానిన చేతులను లంగకుచ్చిళ్ళకు తుడుస్తా వెనక్కు జరిగి అన్న పోయిన తోవదిక్కు సూసినా. దట్టమైన ముసుర్ల తెల్లని తెలుపు తప్ప మరేమి కానరాలేదు. గిరుక్కున వెనక్కు తిరిగి అమ్మ దగ్గరకు వురికి "అమ్మా ఆన యింకా జోరుగ పడ్తనే ఉందే" అన్నా.

నిముషంల తడిసిన నన్ను సూస్తా "అయ్యో ఏంది బిడ్డా జెర సూసి రమ్మంటే గిట్ల తడిసి వచ్చిన వేందిరా! గీపాడు ఆన గిట్ల పతాకం పానం తీస్తాంది. సర్ది అయితది బిడ్డా" అంట దగ్గరకు తీసుకోని కొంగుతో తుడుస్తా "గిట్ల నానినవేందిరా" అంట మల్ల అడిగేసరికి "ఉహూ ఏమ్లే ఉట్టిగనే" అన్న సంతోషంగా...

"ఏందో నీ లెక్కలు మల్ల గిట్ల నానకు" అంట పక్క రూంలకు పోయి గోనె సంచి తీసుకోని కొప్పెర పట్టుకుంట "ఆరం దినాల నుంచి పశువులకు మేత సరిగా లేదాయే, దొడ్ల కట్టేసినయి కట్టేసినట్లనే వుండే, గియ్యాల జెర గవురిచ్చిందని పుసుక్కున తోలిన–సూసుకో పాడు ఆన మరిపించి మాయచేసింది" అంట, ఆన దిక్కెల్లి ఇసుక్కుంట నెత్తిన కొప్పెర పెట్టుకోని "అన్న ఏడున్నడో బిడ్డా! అన్నను, ఆవులను తోలుకోని వస్త జెర పైలం" అంట చెప్తుంటె–

ఆన దిక్కు చూస్త 'సరె సరే' అన్న.

అమ్మ సీకులైను దగ్గర నుంచి పెద్ద రోడ్డుదాటి గుట్టకిందున్న మైదాన్లకు బిరాబిరా నడిచి పోతుంటే, గన్మట్లనే నిలవడి అమ్మను ఆనను సూడవట్టినం.

అమ్మ కనుచూపుమేర దాటంగనే మాకు పండుగే పండుగ. అటు ఇటు చూసి పుస్తకాల నడుమనుండి పేపర్లను చింపి కాగితం పడవలను తయారు చేసి మూలనున్న గోనె సంచులను తీసుకోని కొప్పెర పెట్టుకోని నేను, సెల్లె యింటి బయటకు వచ్చినం.

అప్పటికింకా వాన కొంచెం కొంచెంగా తగ్గుముఖం పడుతున్నది. మా చేతుల్ల ఉన్న కాగితం పడవలను వరదనీళ్ళల్ల విడిచి, వాటిని మురిపెంగ చూస్తుండగానే అది నీళ్ళపైన తేలుతూ వేగంగా పోతుంటే వాటి వెనకాల్నే పరుగెత్తి పరుగెత్తి వంగి వాటిని పట్టుకోవాల్నని చూస్తుండేసరికే మేము సగం ముద్దయినం.

అయినా, అదేమీ లెక్కచేయక ముందుకు ముందుకు సాగిపోతుంటే మా పడవలు వాన నీళ్ళతోని నిండి నాని ముద్దయి నీళ్ళపైన తేలలేక తేలలేక బుడుంగున మునిగిపోయినయి. పడవలతోని మా ఆటలు ఆగిపోయినయి. కానీ, మనస్సు నీళ్ళ వరదవెంట పరుగులు తీసింది.

వాన నీళ్ళు పాదాలను తాకుతూ వెనక్కు పరుగెడుతుంటే లంగకుచ్చిళ్ళను ఎడం చేతితోని కొంచెం ఎత్తిపట్టి వేగంగా నీళ్ళ వరద వెంట పరుగులు తీసిన.

నా పరుగును చూసిన చెల్లె "అక్కా ఏడికే ఆనలోనాని పోయినం అమ్మ చూస్తే కొడ్తది, యింట్లకు పోదాంరా" అని పిలిచింది."ఏ... నేను రాను నువ్వే నా ఎంటరా! కొంచెం సేపు ఆడుకోని తిరిగి వద్దాం" అంట చెల్లెలిని పిలుస్తూనే ఆమె జవాబు కోసం చూడకుండా ముందుకు పరుగెత్తిన. ఇంక చెల్లిలికి నా వెంటరాక తప్పింది కాదు. నేను ముందు తను నా వెనక నీటి కాలువల వెంట జింకపిల్లల్లా చెంగు చెంగున నీళ్ళల్ల కాళ్ళను ఎత్తెత్తి వేస్తుంటే ఆ తాకిడికి చివ్వున విరజిమ్మే నీళ్ళ పువ్వులలో మా ఆటలు మొదలైనయి.

నీళ్ళను చిందరవందరగ తన్నుకుంట పోతుంటే అప్పటి కప్పుడు కలగా పులగంగా తయారయి వెంటనే తేటగా మారి మా కంటే ముందుగ పరుగులువెడుతున్న నీటితోని పోటీ పడుతూ పరుగెత్తుతుంటే ఆకాశంలోంచి జారిపడుతున్న వానచినుకులు మమ్ముల్ని తడిపి మురుస్తున్నయి.

ఇంకోపక్క ఆకాశంలో దూరంగా పెడేల్.. పెడేల్ మంట మేఘాల ఘర్జనల నడుమ మెరుపులు మెరిసి ఉరిమి చూస్తున్నయి. ఆ చప్పుడుకు భయంతోని గుండెలు జలదరిస్తున్నా ఆగని నా పరుగు, ఎక్కడో దూరంగా 'దడాల్' మంటూ పిడుగు పడిన శబ్దం విని టక్కున ఆగింది.

ఎప్పుడో నాయిన చెప్పిన గురుతు "జోరువాన పడ్తున్నప్పుడు చెట్ల కింద దాసుకోవద్దు" అని. గా పిడుగు గట్లాంటి చెట్టు కాడికే మహా ఇష్టంగ వస్తదట.. దానిని ఎవరం గూడ చూడలేమట. కానీ, కళ్ళు మూసి తెరిచేటంతలనే అంతా నాశనం చేసి పోతదట.

"ఆన పడ్డప్పుడు చెట్ల కాడ జెర పైలం బిడ్డా" అంట నాయిన చెప్పిన మాటలు చెవుల్ల గింగురులు తిరుగుతుండగా చెట్ల దిక్కు సూసిన పాపం జోరు వానల హోరుగాలి ముందు తోటకూర కాడలెక్కన తడిసి తన రెక్కల కొమ్మలను జారవిడిచి ప్రకృతి ముందు దోషిలాగ నిలవడ్డ పొన్నంగి పూల చెట్టు గాలికి భారంగ కదులుతూ దవళ వర్ణపు పూలని భూమిపైకి వెదజల్లుతా నిల్చుంది. ఆ చెట్టు అవస్థను చూసి మహాజాలేసింది.

గబగబా ఆ చెట్టు కిందికి పరుగెత్తిన. పచ్చని చెట్టు కింద వెదజల్లబడిన తెల్లని పొన్నంగి పూల వాసన మత్తుగ మురిపిస్తుంటే ఓ గుప్పెడు పొన్నంగి పూలను ఏరి కొప్పెర పక్కన పడేసి జడల తురుముకున్న.

చేతులను వెనక్కు చాపి తలలోని పువ్వులను తడిమి ఆ పూల వాసన చూస్తూ మురిసి పోయాక చెట్టు పడ్తున్న అవస్థకు మల్ల జాలేసి రెండు మూడడుగులు గబాగబా నడిచి కొమ్మల చివర అంచుల కింద నిలబడి నడుంపైన చేతులుంచి తలెత్తి ఆకాశం దిక్కు కోపంగ చూస్తా "ఏందీ నీ సంగతి, అందర్ని గిట్ల ఏడిపిస్తున్న వేంది" అంటూ గట్టిగ అడిగిన.

నా వెనకాల్నే వచ్చిన చెల్లెలుకు ఏమి అర్థం అయిందో కానీ నన్ను అనుకరిస్తూనే కొప్పెరను పక్కన పడేసి పువ్వులను గబగబా ఏరి తలల తురుముకోని నా పక్కకు వచ్చి నిలబడి నడుం మీద చేతులుంచి "ఏంది నీ సంగతి" అంటూ తనుకూడా ఆకాశం దిక్కు మురిపెంగ చూసి పక్కున నవ్వుతుంటే ఆ నవ్వులనే నేను కూడా జతకలిశిన.

ఎత్తిన మా మొఖాలను మురిపెంగ హత్తుకోవాలనేమో చెట్టు తల్లి గాలి దేవుడ్ని జత చేసుకోని తన కొమ్మల నుంచి ప్రేమ జల్లులను మురిపెంగ జారవిడిచింది.

ఆ తడికి మురుస్తూనే ఎత్తిన తలను కిందికి దించి మునివేళ్ళతోని ముఖం తుడ్చుకుంటూ ముందుకు చేరేసరికి ఎదురుగ కాలువలనించి పరవళ్ళు తొక్కుతున్న నీళ్ళ వరద. "చెల్లె అటు చూడు" అంటూ నేను కాలువ దిక్కు పరుగెత్తుతుంటే పొన్నంగి పూలను ఏరి నడివలో ఏసుకుంటున్న చెల్లెలు "నేను పూలు ఏరుకోని వస్తా నువ్వు పో అక్కా" అని అన్నది.

నీళ్ళ వరదను చూసే సరికి మళ్ళా నా మనస్సు నాకంటె ముందుగనే అటు పరుగులు పెడుతుంటే పిల్ల కాలువ ఎంటబడి పరుగు పరుగున పోయిన.

గుట్టల్ల నుండి, చెట్లల్ల నుండి గట్లను దాటి మైదానాలనుంచి చుక్క చుక్కగా కురిసిన వాన చినుకులు వరదై, వాగై, పిల్ల కాలువలై నీళ్ళ కుంటల్ల చేరి చెట్లను, పుట్టలను రాళ్ళను రప్పలను ఇష్టంగ హత్తుకోని భూమమ్మను మురిపించి, తను మైమరిచి తనతోని జతకట్టి పాత నీరును తోడేస్తా, కొత్త నీరును వదిలేసి వేగంగ ముందుకు కదులుతుంటే అప్పటి వరకు నీటి చెలమల్ల నివాసం ఉన్న జీవరాశులు ఆ ధాటికి ఉక్కిరి బిక్కిరై వరద నీల్లతోని కలిసి వస్తుంటే సప్తవర్ణాల కలగలుపుతోని ముత్యాల లెక్క మెరుస్తున్న చిట్టి చేపల చెంత నా మనస్సు చిక్కింది.

వాటి వెనుకనే పరుగెత్తుతున్నప్పుడు కొన్ని గట్టున పడి ఉక్కిరి బిక్కిరైతుంటే తలుకులీనుతున్న వాటి ఛాయను చూసి మురిసిపోతూ మునివేళ్లతోని వాటిని నీళ్ళల్లకు తీస్తుంటే నీళ్ళ అలలు మెల్లగ నా చేతిని తాకి మరలి చూడక పరుగులు తీస్తున్నయి.

ఆ పరుగుల వెంటే నా చేతులు పరుగెత్తి నీటి నురగను చేరి ఆ నురగను ఆప్యాయంగ హత్తుకుంటుంటే గలగలా పారుతున్న సెలయేరు సవ్వడిలో మువ్వల రవలుల నాదం పని

కట్టుకోని పరుగులిడుతున్నది.

తన్మయత్వంతోని నా మనస్సు పరవళ్ళు తొక్కుతున్న వేళ ఆకాశం యింకొక్కసారి ఉరుములు ఉరిమి మెరుపులు మెరుస్తుంటే వాన చినుకులు ముత్యాల జల్లులై కురుస్తున్నయి. పిల్లగాలి తెమ్మెరలు హోరుగాలిల కలసిపోయి స్వరలయలని సమకూర్చుతుంటే, ప్రకృతి తల్లి పరవశిస్తూ వర్ష నృత్యం చేస్తున్నది.

ఆ ఆనందంతోని నా కన్నులు అరమోడ్పులయినయి. నా హృదయం లయ తప్పింది. చినుకై వాగై వొంకయి సెలయేరై ఆ వాన చినుకు పిల్లగాలిని వెంట తోల్కోని సెలయేరులో గలగలా పారుతూ పచ్చని పంట చేండ్లను దాటుకోని సెలిమెలను సేరి అడ్డుకట్టలను అధిగమించి ఊరి చెరువును చేరుతున్న వేళ ఆ పరుగు ప్రశాంతమై అడ్డుకట్టలకు ఆవల నిల్చుని వెనక్కు తిరిగి చూసే ఆ చినుకుకు నలుమూలలనుండి ఎన్నో పిల్ల కాలువలు తన లాగే వచ్చి చేరాయని అర్థమైంది.

పరవళ్ళు తొక్కుతున్న జల తరంగిణి వెంట ఆలోచనా తరంగిణినై ప్రకృతిలో పరుగులు పెడుతున్న నేను... అక్కా.. అంటూ పిలుస్తూ ఒడిలో పొన్నంగి పూలు పట్టుకోని యింకో చేత్తోని కొప్పెర్లు సర్దుకుంట చలికి చిగురుటాకు లెక్క వణికిపోతూ వడివడిగ వస్తున్న చెల్లెలును చూసి చటుక్కున ఆగిపోయిన హ్యా...హ్యా... అంట చెల్లెలు ఆయాసంతోని వగరుస్తూ పండ్లను బిగవట్టూనే "ఏందక్కా పిలుస్తుంటె ఆగవేంది గీకాలువల పడి ఏడికి పోతున్నవ్'–అంటూ నిలదీస్తుంటే "నీళ్ళతోనే పోతున్నా"అన్నా.

"ఏందీ– మల్ల చెప్పు" అంది అర్థంకానట్లు మొఖం పెడ్తూ. "ఏమిలే"అన్నా. "నీ తిక్కేందో గానీ అగో అమ్మ అన్న.. ఆవులను తోల్కోని వస్తుండ్రు" అంది. చలికి వణుకుతనే గిర్రుక్కున వెనక్కి తల తిప్పి చూసిన! తెల్ల మేఘాలను చీల్చుకుంట వస్తున్న చందమామాల లెక్క మా ఆవులు, ఆ ఎనకే ఆకాశంల నక్షత్రాల్లా అమ్మ, అన్నలు – ఆవులను తోలుకోని పరుగునొస్తుండ్రు.

"అమ్మో! అమ్మ చూసిందంటే మస్తు కొడ్తది జెల్దిరా" అంట చెల్లెదగ్గర కొప్పెర్లు తీసుకోని వరి పొలాలకెల్లి అడ్డంగా యింటి దిక్కు ఉరికిన.

ఎనకకు మర్లి సూస్తనే సూరుకింద కారుతున్న నీళ్లతోని కాలుచేతులను కడుక్కోని పచ్చి బట్టలను యిప్పి కొప్పెర్ల దాచేసి, పొడి బట్టలు కట్టుకోని లోపలి యింట్ల చీకట్ల చాపేసి, నిండ బొంతలను కప్పుకున్నం. కానీ, నా మనస్సులో వాన వాన – చల్లని వాన – నీటిబొట్టుగ కళ్ళముందు జారి ప్రకృతిలో సమస్త సంపదలకు మూలం అయిన వాన – నన్ను మురిపెంగ మురిపిస్తుంటే ప్రకృతిలోని జీవకోటికి ఆధారం అయిన ఆ వానమ్మని అనంతంగ తెలుసుకోవాలని ఆలోచనల పడ్డా...

అలసిన శరీరానికి వెచ్చదనం తోడవటంతోని సేదతీరుతూ నిద్రలకు జారుకుంటుంటే–

"ఏరిరా..ఏడుండ్రు..." అంట అమ్మ ఆకిట్ల నుండే మమ్ముల్ని పిలుస్తూ యింట్లకు వస్తుండగానే మల్ల నిద్రలకు జారుకున్న...

# ఉద్యమాగ్ని

– **నవీన్ గాంధీ,** హన్మకొండ

వివాదాల విషాదాల తగాదాల రాష్ట్రమా?
యువత భవిత మండుతున్న చితిమంటల కాష్టమా?

మా అన్నల మా తమ్ముల తనువు కాలిపోతుంటే
రగులుతున్న యువనెత్తురు ఉద్యమాలు కదుతుంటే
దగాపడ్డ బతుకులన్ని దండుకట్టి కదులుతుంటె
తెలంగాణ నినాదమే నలువైపుల ధ్వనిస్తుంటె
కండ్లున్నా చూడలేని సమైఖ్యాంధ్ర కుట్రలన్ని
చూస్తున్నం చూస్తున్నం మేమంతా కళ్ళు తెరచి

చెట్టుమీద కాకులోలె వలస వచ్చినారు మీరు
జాలి తలచి వుండనిస్తె మా బతుకులు కూల్చినారు
బతుకు లేక బతక లేక మా తల్లులు మా తండ్రులు
దేశాలకు వలస పోయి దేవులాడుకుంటుంటే
నిర్భాగ్యులు ఎంతమందొ ఆడ మోసపోతుంటే
అవుతలోల్లు మాజాగల పెత్తనాలు జేస్తుంటే
అరె చల్... దేశముఖుల దొరగాండ్లనె తరిమినాము
మా దారులకడ్డొస్తే ఉప్పుపాతరేస్తాము





Daniel Gabriele - http://danielg.hypermart.net

# ఏ పోషకం లోపించినా దిగుబడి తగ్గుతుంది

వరిలో అధికోత్పత్తి సాధించడానికి మేలైన వంగడాలు ఎంపిక చేసుకోవడంతోపాటు మెరుగైన యాజమాన్య పద్ధతులు పాటించాల్సిన అవసరం కూడా ఎక్కువగానే ఉంది. వీటిలో అతి ముఖ్యమైనది ఎరువుల యాజమాన్యం. తగిన మోతాదులో అవసరమైన పోషకాలు లభించినప్పుడే పైరు బాగా పెరిగి అధిక దిగుబడులు ఇస్తుంది. వరి పంటకు నత్రజని, భాస్వరం, పోటాష్ వంటి పోషకాలతోపాటు జింక్, ఇనుము వంటి సూక్ష్మపోషకాల అవసరం కూడా ఎంతైనా ఉంది. ఒక పోషకం చేసే పని మరొకటి చేయదు. అట్లాగే ఒక పోషకపు లోపాన్ని మరొకటి భర్తీ చేయలేదు. అందువల్ల వరి పంటకు అన్ని పోషకాలూ సమతుల్యంగా అందించాల్సి ఉంటుంది. లేకుంటే దిగుబడులు తగ్గిపోతాయి.

నత్రజని: వరి పైరుకు నత్రజని ఎరువు అవసరం ఎంతో ఉంది. అమ్మోనియం నైట్రేట్ రూపాల్లో మొక్కలు నత్రజనిని గ్రహిస్తాయి. మట్టిలో రేణువులకు నైట్రేట్ ఎరువు అంటుకొని ఉండదు. అందువల్ల అది చాలా త్వరగా నీటిలో కరిగి నేలలో ఇంకి పోతుంది. లేదా డీనైట్రిఫికేషన్ ద్వారా నత్రజని వాయువుగా మారి వాతావరణంలో కలిసిపోతుంది. అందుకని వరి పైరుకు అమ్మోనియా రూపంలో ఉన్న సల్ఫేట్ అమ్మోనియా క్లోరైడ్, కాంప్లెక్స్ ఎరువులు, అమ్మోనియాగా మారే అమైడ్... అంటే యూరియా ఎరువులు మాత్రమే వేసుకోవాలె. పైరుకు కాల్షియం నైట్రేట్, సోడియం నైట్రేట్ ఎరువులు వాడకూడదు. వరి సాగు చేసే సీజన్‌ను బట్టి, ప్రాంతాన్ని బట్టి నత్రజనిమోతాదు మారుతుంటుంది. నత్రజని వినియోగ సామర్థ్యాన్ని పెంచాలంటే దీనిని మూడు విడతలుగా సమానంగా వేయాలె. మొదటి భాగాన్ని దమ్ముచేసే సమయంలో, రెండవ భాగాన్ని దుబ్బు చేసే దశలో, మూడవ భాగాన్ని అంకురం దశలో అంటే 40 రోజుల తర్వాత వేసుకోవాలె. పైపాటుగా వేసుకునేటప్పుడు పొలంలో నీరు లేకుండా చూసి బురద పదునులో చల్లుకోవాలె. 50 కిలోల యూరియాకు 10 కిలోల వేప పిండి లేదా తేమ కలిగిన 250 కిలోల మట్టి కలిపి రెండు రోజులపాటు నిల్వ ఉంచి వెదజల్లితే నత్రజని వినియోగ సామర్థ్యం పెరుగుతుంది.

భాస్వరం: వరిలో రెండవ అతి ముఖ్యమైన పోషకం భాస్వరం. దీనిని కాంప్లెక్స్ ఎరువుల రూపంలో లేదా సూటి ఎరువైన సింగిల్ ఫాస్ఫేట్ రూపంలో అందించవచ్చు. ఉదజని సూచిక ఎక్కువగా ఉండే ఆమ్ల నేలల్లోనూ, క్షార నేలల్లోనూ భాస్వరం లోపం ఎక్కువగా కన్పిస్తుంది. భాస్వరం మోతాదును కూడా సీజన్‌ను బట్టి, ప్రాంతాన్ని బట్టి సిఫార్సు చేస్తారు. సిఫార్సు చేసిన భాస్వరం మొత్తాన్ని దమ్ము చేసే సమయంలోనే వేసుకోవాలె. ఎట్టి పరిస్థితులలోనూ పైపాటుగా వేయకూడదు. ఎందుకంటే భాస్వరానికి నేలలో కదిలే గుణం లేదు. కాబట్టి ఇది రసాయన మార్పు చెంది మొక్కలకు ఉపయోగపడకుండా పొలంలోనే ఉండిపోతుంది. పైరుకు ప్రథమ దశలో భాస్వరం పడకుండా పొలంలోనే ఉండిపోతుంది. ప్రథమ దశలో పైరుకు భాస్వరం అవసరం ఎక్కువగా ఉంటుంది. అందువల్ల పూర్తి మోతాదును దమ్ము చేసేటప్పుడు వేయాలి. వరికి భాస్వరం జీవన ఎరువైన



ఫాస్ఫోబాక్టీరియాను అందిస్తే భూమిలో లభ్యంకాని స్థితిలో ఉన్న భాస్వరాన్ని పైరుకు అందేటట్లు చేస్తుంది. ఫాస్ఫో బాక్టీరియాను వాడే వారు ఎకరానికి సరిపడే విత్తనాలను 200–400 గ్రాముల కల్చర్‌ను పట్టించాలె లేదా కిలో కల్చర్‌ను 20 కిలోల పశువుల ఎరువుతో కలిపి ఎకరం భూమిలో వేసుకోవాలె.

పొటాష్: వరిలో నత్రజని, భాస్వరం కంటే పొటాష్ ఎక్కువగా ఉంటుంది. మొక్కల్లో రోగనిరోధక శక్తి పెరగడానికి పొటాష్ ఎంతగానో దోహదపడుతుంది. ఈ కారణంగా వరికి పొటాష్ ఎరువును రెండు సార్లు వేయాల్సి ఉంటుంది. దీని మోతాదును కూడా సీజన్‌ను బట్టి, ప్రాంతాన్ని బట్టి సిఫార్సు చేస్తారు. నల్లరేగడి నేలల్లో అయితే సిఫార్సు చేసిన మొత్తం మోతాదును ఆఖరి దమ్ములోనే వేయాలె. తేలిక నేలల్లో అయితే ఆఖరి దమ్ములో సగం, అంకురం ఏర్పడే సమయంలో మిగిలిన సగం వేయాలె.

జింక్ లోపిస్తే: వరి పంటకు నత్రజని, భాస్వరం, పొటాష్ తర్వాత జింక్ అతి ముఖ్యమైన పోషకం. ఈ ధాతువు లోపం కొత్తగా సాగులోకి తెచ్చిన మాగాణి భూముల్లోనూ, బాగా చివకని సేంద్రియ పదార్థాలు వేసిన భూముల్లోనూ, చౌడు-ముంపు భూముల్లోనూ, ఎక్కువగా కన్పిస్తుంది. వరిపైరుకు స్వల్ప పరిమాణంలోనే జింక్ అవసరమైనప్పటికీ ఆ ధాతువు లోపిస్తే మాత్రం దిగుబడులు గణనీయంగా తగ్గిపోయే ప్రమాదం ఉంది. సాధారణంగా వరి నాట్లు వేసిన 25 నుండి 45 రోజుల లోపు.. అంటే దుబ్బు చేసే దశలో జింక్ ధాతు లోపపు లక్షణాలు స్పష్టంగా కనిపిస్తాయి. వరిలో జింక్ లోపం ఏర్పడితే మొక్కలు మొద్దుబారుతాయి. వరిదుబ్బు లోని చివరి ఆకులు (రేకులు) కుచ్చుగా తయారవుతాయి. ఆకులు సాధారణ పరిమాణం కంటే చిన్నవిగా ఉంటాయి. ఆకు చివర్లలో మధ్య ఈనెకు రెండు వైపులా ఇటుక రంగు మచ్చలు ఏర్పడతాయి. ఆకుల కింది భాగాలు ఇత్తడి రంగులోకి మారతాయి. లోపపు లక్షణాలు కలిగిన ఆకును తెంచి రెండు వేళ్ల మధ్య పెట్టి చెవికి దగ్గరలో ఉంచి విరిస్తే చిన్న శబ్దం చేస్తూ విరిగిపోతుంది. ఇలాంటి పరిస్థితుల్లో నత్రజని ఎరువులు వేసినప్పటికీ పైరు పచ్చబడదు.

నివారణ: ప్రతి మూడు పంటలకు ఒకసారి ఎకరానికి 20 కిలోల జింక్ సల్ఫేట్‌ను నాటేముందు ఆఖరి దుక్కిలో వేసుకుంటే జింక్ లోపాన్ని నివారించవచ్చు. దిగుబడుల్లో ఆశించిన వృద్ధిని సాధించవచ్చు. అయితే జింక్ సల్ఫేట్‌ను ఎట్టి పరిస్థితుల్లోనూ భాస్వరపు ఎరువులతో కలిపి వేయకూడదు. కనీసం మూడు రోజుల వ్యవధన్నా ఉండాలె. భాస్వరం ఎరువును, జింక్ సల్ఫేట్‌ను కలిపి వేస్తే రసాయనిక చర్య జరిగి ఎటువంటి ఫలితమూ ఉండదు. ఒకవేళ పైరుమీద జింక్ లోపం కనిపించినట్లయితే లీటరు నీటికి రెండు గ్రాముల చొప్పున జింక్ సల్ఫేట్‌ను కలిపి వారం రోజుల వ్యవధిలో రెండుసార్లు ఆకులన్నీ బాగా తడిసేటట్లు పిచికారి చేయాలె.

**– సేకరణ**

ముఖపత్ర కథనం...

# "ధర్మ"పీఠం దద్దరిల్లింది అధర్మవాదుల డొంక కదిలింది!



ఒకటికాదు, రెండుకాదు, ఆరు రోజులు ఆమరణదీక్ష వహించారు తెలంగాణ న్యాయవాదులు. వారికి చట్టం తెలుసు. పద్ధతులు తెలుసు. విధానాలు తెలుసు. రాజ్యాంగం తెలుసు. వాటిని అమలు చేయవలసిన విషయాలను గూర్చి సవివరంగా తెలుసు. కనుకనే, అన్ని ప్రయత్నాలూ విఫలమైనందున పెద్దపెట్టున నినదించారు. కోస్తాంధ్ర, రాయలసీమ వాదులిక్కడ అడుగుపెట్టకముందు నుంచే హైదరాబాదులో హైకోర్టు వుండి, పనిచేస్తూ వచ్చింది. ఇక్కడి ఎన్నో గొప్ప - చారిత్రక కట్టడాల్లో హైకోర్టు ఒకటి-ముఖ్యమైనది. న్యాయ నిర్ణయం చేయటంలో అప్పటికే అనన్య సామాన్యమైన అనుభావాన్ని గడించి వుందిది. దేశంలోనే కాదు, దేశదేశాలలోనూ పెద్ద పేరు ప్రఖ్యాతులను పొందింది. అటువంటి ఈ కోర్టులోనికి ఉమ్మడి రాష్ట్రం పేరిట కాలూనిన కోస్తాంధ్ర-రాయలసీమ ప్రాంతాలకు చెందిన న్యాయవాదులు(?), న్యాయమూర్తులు(?), మొదటి రోజునుండే అన్యాయాలకు పాల్పడుతూ వచ్చి, 60 సం॥లుగా ఆ అన్యాయ పరం - పరంను గట్టిజేసుకుంటూవచ్చారు. ఇక్కడి న్యాయవాదులకు - ఎక్కడాలేని, కలలోనైనా వూహించబోని కిరాతకాన్ని తలపెడుతూ, సకల విధ పక్షపాతాలకు పూనుకున్నారు. కీలక పదవులన్నింటినీ (పీతిరి) గద్దలకన్న వికారంగా, జబర్దస్తీగా, దొడ్డిదారిన, డొంక తిరుగుడుగా, కులం పేరిట, వర్గం పేరిట, అధికారమదం పేరిట, నిర్లజ్జగా-నిస్సిగ్గుగా తన్నుకుపోయారు.

ఏండేండ్లు ఈ అన్యాయాలను గురించి ప్రశ్నిస్తూ, సమన్యాయం కోసం అభ్యర్థిస్తూ వస్తున్నారు యిక్కడి న్యాయవాదులు కానీ-ఏంప్రయోజనం? పొరబాటున జరిగిందానికి దిద్దుబాటు వుంటుందిగానీ, బాహాటంగా కుట్రపూరితంగా, పట్టపగలు-దొంగలకన్న, ద్రోహులకన్న వికారంగా, ప్రవర్తించిన విషయాన్ని, చర్యలను ఎట్లా సవరించగలరు? సవరించ లేరుగనుకనూ, సవరించేదెందుకనేదే వాళ్ళ వుద్దేశంగనుకనూ, అన్ని అభ్యర్థనలను కాలితోతన్ని, అవతల పారేస్తూ వచ్చారు వాళ్ళు. వాళ్ళకి తెలియలేదు-తెలంగాణ వారల నిజాయితీతో కూడిన నిర్భీకతను గురించి నిర్భీకత నిండిన నిబద్ధతను గురించి నిబద్ధతతో ఎదిగిన నిర్ణయాత్మక పాత్రను గురించి. అడిగి అడిగీ, ప్రాధేయపడీ - అవగాహనగావించే ప్రయత్నం చేస్తూవచ్చి, దరఖాస్తులు పెట్టి-పెట్టీ-విసిగిపోయి, నోటీలసు లిచ్చీ అంతటా అంటించీ, ఫలితంలేక, గత్యంతరం అంతకన్నా లేక, జూలు విదిల్చిన సింగాలై లేచారు లాయర్లు. వీధిన పడ్డారు. నినదించారు. కొంచెం దిగివచ్చిన అవతలివారు - లిఖితపూర్వక హామీయిచ్చారు. అవక తవకలను గురించి చూసి, అవసరమైన చర్యలు చేపడతామని, ఒక నిర్ణీత గడువులోనే యివి చేసి చూపుతామన్నారు. చూపారు కూడా. అయితే, అవి చర్యలుకావు - ఉత్తుత్తి చేతులు, దుర్మార్గపు చేతలు, అణచివేత చేష్టలు పక్షపాతపూరిత -ఆధిపత్యపూరిత - అహంకారపు చేతలు.

గడువు ముగిసిందే తడవు, ఈ సారి పెద్ద అడుగే వేశారు లాయర్లు. ఐదుగురు ఆమరణ నిరాహార దీక్షకు పూనుకున్నారు. దీక్ష ప్రారంభమైన రోజుననే భూమి పగళ్ళుచూపి, ఆకాశం నేల రాలినంతపనైంది. తెలంగాణకు తెలంగాణయే అట్టుడికిపోయింది. అందరి నోటా అదే చర్చయి కూర్చున్నది. తిట్టని వారుండరు తీరాంధ్ర-రాయలసీమ వారల తీరు తెన్నులను. అన్నివర్గాల వారూ అధికారుల, (సోకాల్డ్) న్యాయాధికారుల మొండివైఖరిని ఈసడించుకున్నారు. ఇక ఓయూ, కేయూ విద్యార్థులు తమ సంపూర్ణ మద్దతును తెలుపుతూ, సంఘీభావంతో-ప్రజాస్వామ్యయుత పద్ధతులతో పోరాటం చేయసాగారు. తెలంగాణ న్యాయవాదులు కోరిన న్యాయమైన 42శాతం వాటాను యిచ్చి తీరవలసిందేనని, ఒక్క పెట్టున సంఘీభావ ఉద్యమం కొనసాగించారు. ఈ న్యాయబద్ధమైన వాటా దక్కకుండాచేసిన కీలకమైన అధికారుల పదవులను రద్దు చేసి, ఉద్యోగాలనుండి తొలగించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ జేఏసీ-కేంద్ర స్థాయి మొదలు, జిల్లాలు మండలాలన్నీ లాయర్ల సమ్మెకు తమ సంపూర్ణ మద్దతును ప్రకటించినవి. అసలు సమస్యకు ఉద్యమ తీవ్రతకు కారకులైన సంబంధిత అధికారులను వెంటనే బర్తరఫ్ చేయాలని, తెలంగాణ లాయర్ల న్యాయసమ్మతమైన 42శాతం కోటా డిమాండ్‌ను బేషరతుగా అంగీకరించి, అమలు చేసేందుకు సూచనగా లాయర్ల దీక్షను విరమింపజేయాలని తీర్మానాలు గావించారు. మరొక పక్క అన్ని జిల్లాల నుండి తండోప - తండాలుగా, ఒక మహాప్రవాహంగా లాయర్ల రాకతో హైదరబాదు నగరమంతా నిరసనగానన్నట్లు నల్లకోట్లను ధరించింది. ఇదిట్లుండగా, పేద ప్రజలయితే - ఆకిరాతకుల నోళ్ళళ్ళ మన్నుబడాలని, శాపనార్థాలు బెట్టింద్రు. వాళ్ళ చావు నిచ్చావు గావాలని మొక్కుకున్నరు.

నిరాహారదీక్షలు రెండోరోజు, మూడోరోజుకు చేరుకునేటప్పటికి అందుకు పూనుకున్న లాయర్ల ఆరోగ్యాలు దెబ్బతిన్నవనే పేరిట ప్రభుత్వం దుర్మార్గంగా వారిని, అరెస్టు గావించి, ఆస్పత్రులపాలు చేయాలని చూసింది. ఇందుకు సూత్రధారిగా అన్నట్టు మన తెలంగాణ పాలిట శిఖండి పాత్ర పోషిస్తున్న రాష్ట్రాధిపతి - లాయర్లకొక కోడంటూ-పోలిసు రాజ్యాన్ని తలపింపజేస్తూ, ఆర్డర్లు పురమాయించాడు. ఇంకేంది - రాత్రికి రాత్రి అరెస్టులు కానే అయినవి. ఆస్పత్రులకు తరలించనే తరలించారు. ఎవ్వరినీ అడుగుపెట్టనిచ్చేది లేదన్నారు. 'అయితే ఏందట'? అని ఎవరో ఒకాయన విషపు నవ్వు నవ్విందాన్ని గుర్తుజేసుకున్న ప్రజలు గేట్లు తోసేసుకుంటూ లోపలికి ప్రవేశిస్తూనే పోయారు. యుద్ధవాతారణమే నెలకొన్నది.

ఇవి చాలవన్నట్లు - సీమాంధ్ర, రాయలసీమ వాదుల రెచ్చగొట్టే పోకడలు, బూటకపు నిరసనలు, తూథూ మంత్రపు ప్రతివాదాలు-ప్రగల్భాలు అగ్నికి ఆజ్యం పోసినవి. వేలాది మంది చూస్తుండగానే ఒక లాయరు ఒళ్ళంతా పెట్రోల్‌తో తడుపుకుని ఆత్మహత్య చేసుకోబోయాడు. తర్జన భర్జన చేసుకున్నాయి అటు ప్రభుత్వ వర్గాలు-యిటు (అ)న్యాయ దుర్గాలు. పరిష్కారం తప్ప ప్రత్యామ్నాయం లేదని తేలిపోయింది. న్యాయ శాఖామాత్యులు ఈ విషయం దాటవేయజూశారు. మసి పూసి మాయజేయబోయారు. వాటా-గీటా మాట్లాడే పనేలేదన్నారు. ఆమాట కొస్తే తెలంగాణ వారికే అధిక వాటా అని కబుర్లు చెప్పబోయారు. ఆ మాట లాయర్లకు, తెలంగాణ వాదులకే కాకుండా, →

# 'పులి' కోరలు వూడబెరికిన తెలంగాణ వాదులు

**- అనుపమ్**

ఒకటికాదు, రెండుకాదు, అనేక పర్యాయాలు, భిన్న-భిన్న పద్ధతులలో తెలంగాణ వారల ఆత్మగౌరవాన్ని, సంస్కృతీ-సంప్రదాయాలనూ గాయపరిచే విధంగా చిత్రాలను నిర్మిస్తూ, ప్రదర్శిస్తూ పోతున్నారు- సీమాంధ్ర, రాయలసీమ నిర్మాతలు, దర్శకులు, తదితర సాంకేతిక రంగాలకు చెందినవారు. ఇంతకు మును పెన్నడూ-కనీ-వినీ ఎరుగని రీతిలో, సినిమాల పేరిట జరిగే అవమానకరమూ-అహంకారపూరితమూ అయిన చేష్టలను వ్యతిరేకిస్తూ, ఉద్యమిస్తూ వస్తున్నారు యిక్కడి వారలు. గతంలో యిటువంటి అసంగతాలు, అనృతాలు, దురహంకారాలను ఎదిరించినప్పటికినీ యిక మీదట అటువంటి పొరబాట్లకు తావివ్వమని సదరు సినిమాలవాళ్ళు హామీలిచ్చినప్పటికినీ, వెంటనే చెవులు జాడిచ్చినట్లుగా తిరిగి యింకోవిధమైన తప్పిదాలకు ఒడిగడుతూనే వున్నారు. ఈసారి కూడ "పేరు" మీద (టైటిల్ మీద) పేచీ.

అడవిపుత్రుల న్యాయబద్ధమైన, స్వేచ్ఛాయుతమైన, జీవితాల కోసం తుదికంటా పోరుజేసి, బ్రిటిష్ అండదండలతో క్రూరాతి క్రూరంగా ప్రవర్తించిన ఫ్యూడల్ నైజాం ప్రభువులనెదిరించి ఆదివాసీల, అడవిబిడ్డల హక్కులు సాధించటం కోసమే అమరుడైన అడవి వీరుడు, కొమురం భీమెక్కడ? - కేవలం డబ్బులుపెట్టి అంతకు అనేకానేకరెట్లుగా - యిబ్బడి ముబ్బడిగా యిక్కడి తెలంగాణ ప్రజల రెక్కలకష్టాలు కొల్లగొట్టేందుకు, ఒక మహావీరుడి పేరును కూడా "వినోదాత్మకంగా మలచబూనిన" ఒక సాధారణ సినిమాకు ఒక యోద్ధ పేరును పెట్టబోవడమెక్కడ? దీనినే ముక్తకంఠంతో ప్రశ్నించి నిలదీస్తూ, పెద్దయెత్తున ఉద్యమించి నిలిచారు తెలంగాణ వాదులు.

చేసిన తప్పిదాన్ని, అల్పపూరిత-అహంకారయుతమైన ధోరణిని గూర్చి ఆలోచించి సవరించుకునేందుకు బదులు - "స్క్రీన్‌ప్లే చూడకుండానే, కథయేమిటో తెలుసుకోకుండానే" వ్యతిరేకిస్తున్నారంటూ వాదించబోయారు. ఇటువంటి కల్లబొల్లి-డొల్ల డొల్ల మాయమాటలను వినేది లేదని, పేరు మార్చుకోవడం తప్ప గత్యంతరం లేదని పట్టుబట్టారు తెలంగాణ జేఏసీ వారూ, ముఖ్యంగా, సమస్త విద్యార్థి ప్రపంచం. ఈ తీవ్రతకు తట్టుకోలేనివారు, ముఖ్యంగా, ఈ అంశంతో ప్రత్యక్ష సంబంధం ఏమాత్రం వుందోగాని తెలంగాణ గురించి ఒక స్పష్టమైన వైఖరి అటుంచి, అసలు ప్రేమేలేని-చిరంజీవి మధ్యలోకి దూరటం, పేలటం శోచనీయం. ఆయనకొక ప్రత్యేకమైన సమాచార విభాగం, నిఘా కేంద్రం వున్నట్టుగా, అదేదో వెల్లడి చేస్తున్నట్టుగా తెలంగాణ విద్యార్థుల పట్ల తమ అక్కసును వెళ్ళగక్కారు. ఉస్మానియా విద్యార్థులు ఈ (పేరు మార్చే) విషయమై డబ్బులు ఆశించారని నిందమోపబోయారు. తక్షణం అందుకు పూనుకున్నవాళ్ళెవరో, వారికి ఎక్కడెక్కడి నుండి ఏమేమి అందాయో బయట పెట్టాలని విద్యార్థులు డిమాండ్ చేయడంతో, యిక గత్యంతరం లేక, పేరునే (టైటిల్‌నే) మార్చుకున్నారు. 'కొమరం పులి' కాస్త కోరలూడిన పులైపోయింది.

ఇక్కడ గమనించవలసిన విషయమేమంటే - ప్రశ్నించాల్సినప్పుడు ప్రశ్నిస్తే, నిలదీయాల్సినప్పుడు నిలదీస్తేనే ఫలితం వుంటుంది. 'మాకెందుకులే - అది సినిమాయేకదా - ఒక పేరేకదా'-అని నాలుక చప్పరించుకుంటూ, పెదాలకు గోందు-జిగురు-బంక అంటించుకుంటూ పోయినంతకాలం - దౌర్జన్యాలు, దురహంకారాలు కొనసాగుతూ పెచ్చుమీరుతూనే వుంటాయి. పరిగెత్తేకొద్దీ తరమాలని చేసేవాడివైపు-పరుగును ఆపి వెనక్కి తిరిగి చూడటమే తరావాయి - యిక పరుగు పందెంలాంటి వరుస అవతలి వాడిపనౌతుంది - కదా!

అన్యాయం అంగళమంతనా, ఆకాశమంతపెద్దదా అన్నది కాదు ప్రశ్న. అది అన్యాయమౌనాకాదా అన్నదే చర్చనీయాంశం. పంచభూతాల ఫలితాలైన నీరు, నేల, నింగితోపాటు సర్వమూ - తెలంగాణకు చెందిన సర్వమూ కాపాడుకోవలసిందని, పరిరక్షించుకోతగ్గదని తెలియాలిప్పుడు. అట్లా 'జరిగిందట', యిట్లా 'వుండొచ్చునట', అని దీర్ఘాలు తీసేవాళ్ళు మనచుట్టు పక్కలా ఈగలోలె, దోమలోలె తిరుగుతూనే వుంటారు. చెవులు కొరకుతూనే వుంటారు. వీరిని ముందు నిలదీసుకుంటూ పోవాలెమనం. నిమ్మకు నీరెత్తినట్టుగా అట్లా పడికొట్టుకు పోవడం ఆపి ప్రతి వెలితికీ, వికారానికీ, దౌర్జన్యానికీ కారణాలను సహేతుకంగా తెలుసుకుంటూ పోవాలెమనం. ప్రజాభిప్రాయాలను కూడ గడుతూ ప్రజా ఉద్యమాలను నిర్మించుకుంటూ పోవాలెమనం. "వాళ్ళు కిరాతకాల్ని తెలుసుకున్నారు అంతే కిరాతకాలు పటాపంచెలైనాయి" అనే సత్యాన్ని రుజువు చేద్దాం మనం. మనల్ని వెక్కిరించే వాళ్ళ దుశ్చర్యల అంతు చూద్దాం. జాగరూకులమై లేద్దాం. నిత్య నిరంతర జాగరణ చేద్దాం!

→ *ప్రభుత్వ పదవుల్లో వున్న వారికీ - అధికారులకు కూడా నచ్చకపోగా, వికారంగా అగుపించినై. ముఖం చెల్లనట్లు మంత్రి పుంగవులు మాట్లాడకుండా సమావేశస్థలం నుంచి ఆవలకు నిష్క్రమించారు. చివరకు సత్యానిదే విజయమైంది. ధర్మపీటం దద్దరిల్లింది. అధర్మవాదుల డొంక కదిలింది. ప్రభుత్వం దిగివచ్చింది. చర్చలు ఫలప్రదమైనవి. లిఖితపూర్వక ఒప్పందానికి మార్గం సుగమమైంది. లాయర్ల దీక్ష విరమణ జరిగింది. ఇది తెలంగాణ పోరాటయాత్రలో ఒకమైలురాయి. స్పష్టమైన వాటాకు, కోటాకు తావేర్పరచిన గీటురాయి. తెలంగాణ లాయర్ల కీర్తి కిరీటంలో మేలిమి బంగరు తురాయి!*

**- శుక్ర**

# నల్లగొండలో సుసంపన్నమైన సాహిత్య కార్యక్రమం
# NBT, AIR పక్షాన ప్రప్రథమంగా దక్షిణ తెలంగాణ ప్రాంతంలో

## ఒకే రోజున 12 పుస్తకాల ఆవిష్కరణ : రెండు సదస్సులుగా కథాపఠనోత్సవం


- మైత్రేయ





ఏటేటా కేంద్ర ప్రభుత్వం NBT (ఢిల్లీ) ద్వారా ఆయా ప్రాంతాలలో సాహిత్య కార్యక్రమాలను నిర్వహిస్తూ, పెద్ద యెత్తున ఖర్చులను భరిస్తూ వుంటుంది. అయితే, మహా నగరాలు, రాజధానుల వంటి ప్రదేశాలకే ఈ కార్యక్రమాలు పరిమిత మౌతూ వుంటాయి. విమానాలు, మహా రైలు మార్గాలు, హోటళ్ళ సౌకర్యాలను మాత్రమే చూసి, ఆయా ప్రదేశాలలో స్థాయిగల సాహిత్య కార్యక్రమాలను నిర్వహించడమేమిటని ప్రాంతీయ రచయితల సంఘాలు, సృజనకారులు, తమ-తమ అభిప్రాయాలు-అభిలాషలను వివిధ వేదికల్లో వ్యక్తీకరిస్తూ వస్తున్నారు. అటువంటి చొరవ ఫలితంగా నల్లగొండలో ఒక బృహత్ - సాహిత్య కార్యక్రమాన్ని నిర్వహించేందుకు NBT సుముఖత చూపింది కార్యక్రమ నిర్వహణకు తావిచ్చింది.


సాగించుకుంటూ వచ్చినవాళ్ళదే కాదు సాహిత్యం, సాధన చేస్తూ వచ్చిన వారిందరిదీ అవుతుందని యిక్కడి ప్రాం తాల వారు నిరూపిస్తున్నారు గనుకనే యిటువంటి బృహత్కార్యాల నిర్వహణకు ఒక వరవడి ఏర్పడిందనవచ్చు. అడగందే ఇటువంటి అవకాశాలు రావు గనుక, దిటవు గుండెలతో యిక్కడి ప్రజలు ఒక్కొక్కటిగా కొన్నింటిని సాధించుకునే



















మార్గంలో వుంటూ వస్తున్నారు. అర్థమైనవాటిని అడగడం ప్రారంభించిన తరువాత యిక దేనికీ వెనుకాడని ఈ ప్రాంతాల వారు భూమిలో-నీటిలో-ఆకాశంలో అన్ని విధాలైన హక్కులలో, ముఖ్యంగా అవకాశాలలో "మావాటా మాకు దక్కవలసిందే"నని నిక్కచ్చిగా నిలదీస్తున్నారు గెలుస్తున్నారు కూడ! ఫలితంగా -(19.09.2010)న నల్లగొండలో 12 పుస్తకాల ఆవిష్కరణ జరిగింది. ఈ ఆవిష్కరణ కార్యక్రమానికి ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి అధ్యక్షత వహించగా, శ్రీ బలరామయ్య IAS (ఇం.మీ.బోర్డు సెక్రటరీ) ముఖ్య అతిథిగా విచ్చేశారు. డా॥ బోయ జంగయ్య, ప్రొ॥ ముత్యంరెడ్డి, విహారి, వేణు సంకోజు గారలు వేదికనలంకరించి ప్రసంగించారు. ఈ కార్యక్రమాన్ని గూర్చి వివరిస్తూ NBT పక్షాన డా॥ పత్తిపాక మోహన్ ప్రారంభోన్యాసం చేయగా, AIR పక్షాన శ్రీనాగసూరి వేణుగోపాల్ ప్రాతినిధ్యం వహించారు. వీరిరువురి కృషి, నిబద్ధత ఫలితంగా, ఏర్పాటైన కార్యక్రమం అత్యద్భుతంగా విజయ వంతమైంది.

## ఆవిష్కృతమైన గ్రంథాలు:

గంగాతీరపు పక్షిరెక్కలు, నాగార్జునుడు, కామరాజు ఒక అధ్యయనం, సామాజిక మార్పు కోసం విద్య, ముల్క్‌రాజ్ ఆనంద్, అడవిలో ఆనందం, స్నేహితుడు, మామిడిపండు పక్షులు, నాకొక జిరాఫీకావాలి, హరితవనం స్నేహితులు, బుసకొట్టు కాటేయకు, నవోదయం - ఇవన్నీ వివిధ భాషల నుండి అనువదింపబడిన పుస్తకాలు. వీటికి సంబంధించిన ఆసక్తిదాయకమైన అంశాలను విశేషాలను గూర్చి సంక్షిప్తంగా వెల్లడి చేశారు ఆవిష్కర్తలు. తెలుగు కథ జాతీయ స్థాయిలో ఎదగవలసిన అందలాలకు ఎదగలేకపోయిందన్నారు శ్రీ బలరామయ్య. విశ్వకథావీధిలో తెలుగు కథను, తెలుగు కవులను చూడగలిగే రోజుకోసం ప్రయత్నం జరగాలన్నారు. వరుసగా ఈ కథలనన్నింటినీ సెప్టెంబర్‌లో 10 రోజుల పాటు ప్రసారం చేసేందుకు AIR వారు ముందుకొచ్చారు.

మొదటి కథా పఠనోత్సవ కార్యక్రమానికి ప్రఖ్యాత రచయిత్రి డా॥ ముదిగంటి సుజాతారెడ్డి అధ్యక్షత వహించారు. కథలను చదివిన వారిలో - ప్రఖ్యాత కథా రచయితలు - కాలువ మల్లయ్య, 'బా'రహమతుల్లా, జాజుల గౌరి, సన్నపురెడ్డి వెంకట రామారెడ్డి ఉన్నారు. ఆయా కథలు విన్న ప్రేక్షకలోకం వాటిలోని మానవీయ కోణాలను విశ్లేషణ చేసుకున్నారు.

2వ విభాగంలో-కథాపఠనం గావించిన వారిలో శ్రీ రమణ, నందిగం కృష్ణారావు, ఏ.ఎం. జగన్నాథశర్మ వి. ప్రతిమ, గుడిపాటి వున్నారు. ఈ సమావేశానికి శ్రీ వేదగిరి రాంబాబు అధ్యక్షత వహించారు.

# కట... కటా... గండిపేట నీళ్లు తాగి బలిశారు

### సీమాంధ్ర ఎంపీలపై నిప్పులు చెరిగిన

## ఎంపీ మధు యాష్కీ



**ఇలాగే మాట్లాడితే బట్టలు విప్పి పంపుతారు**
**సీమాంధ్ర ఎంపీలను హెచ్చరించిన మధుయాష్కీ**
**తెలంగాణ సంపద, వనరులు దోచుకున్నారు**
**వారి అవినీతి అక్రమాలు బయటపెడతాం**

జస్టిస్ శ్రీకృష్ణ కమిటీ ముందు సీమాంధ్ర ఎంపీలు చేసిన వాదనపై నిజామాబాద్ ఎంపీ మధుయాష్కీ గౌడ్ నిప్పులు చెరిగారు. వారికి కనీస మర్యాద, చారిత్రక వాస్తవాలు తెలియనట్లుందని ఎద్దేవా చేశారు. "తెలంగాణ కోసం ఉద్యమిస్తున్న వారిని రాజకీయ నిరుద్యోగులంటారా.. ఖబడ్దార్" అని హెచ్చరించారు.

బస్సు ఎక్కడానికి చార్జీ లేనివారు కూడా గండిపేట నీళ్ళు తాగి బలిశారని, తెలంగాణలో వ్యాపారాలు పెట్టి పదింతలు ఆర్జించారని ఆరోపించారు. ఔటర్ రింగ్‌రోడ్డు, ఎమ్మార్ అక్రమాలలో సీమాంధ్రుల పేర్లే వినపడుతున్నాయని, వారు అవినీతికి మారుపేరని మండిపడ్డారు. "ఉద్యమం ఈ స్థాయిలో ఉన్నప్పుడు కూడా హైదరాబాద్-రామగుండం రహదారిలో రూ. 450 కోట్లు దోచుకున్నారని, ఔటర్ రింగ్ రోడ్డు కాంట్రాక్టు మేకపాటి రాజమోహనరెడ్డని, రాయపాటి సాంబశివరావు, కావూరి సాంబశివరావు లాంటి వారు టోల్‌గేట్ల ద్వారా దోచుకుం టున్నారన్నారు. వక్ఫ్ ఆస్తులను లగడపాటి దోచుకున్నారు" అని కూడ యాష్కీ ధ్వజమెత్తారు.


తమను నిరుద్యోగులన్న వారి అవినీతి, అక్రమాలను బయటపెడతామని హెచ్చరించారు. హుడా చైర్మన్‌తో కుమ్మక్కైన లగడపాటి.. తెలంగాణ పేద రైతుల భూములను చౌకగా కొని సంపాదన పెంచుకున్నారని ఆరోపించారు. తెలంగాణ నేతలు, ప్రజలను అవమానపరిచే రీతిలో మాట్లాడితే, వారు తిరగబడి బట్టలు విప్పి పంపుతారని యాష్కీ హెచ్చరించారు. విద్య, వైద్య రంగాల్లో దోచుకుంటున్నారని, జలయజ్ఞం కాంట్రాక్టుల్లో 95 శాతం సీమాంధ్రులవేనన్నారు. ఎవరైనా తెలంగాణ ఉద్యమానికి వెన్నుపోటు పొడిస్తే ఓయూలో టీడీపీ నేతలకు ఎలా పరాభవం జరిగిందో.. అలా ప్రతి గ్రామంలోని ప్రజలు తరిమి కొడతారని మధుయాష్కి హెచ్చరించారు. సీమాంధ్ర నేతలు రెండు మూతుల పాములన్నారు. ఇంకా ఇక్కడే తిష్ట వేసి వారు భూస్వాములయితే, తాము డ్రైవర్లుగా పనిచేయాలా? అంటూ యాష్కీ నిలదీశారు.

సంవీక్షణం

# సామూహిక నినాదాల కేంద్రకం - "వల్లుబండ"



- డా॥ కృష్ణ కౌండిన్య, 9704731346




కరీంనగర్ జిల్లా కవులు రాసిన నూటిరువై కవితల సంకలనం వల్లు బండ. ప్రముఖ కవి అన్నవరం దేవేందర్ సంపాదకత్వంలో రూపుదిద్దుకొన్నదిది. తెలంగాణ ఉద్యమం ముమ్మరంగా ఎగసిన చారిత్రక సందర్భంలో, ప్రత్యేకంగా - ఒక జిల్లా కవుల చైతన్యోద్యమ కవిత్వంగా వెలువడింది. దేవుని గుళ్ళల్లో తాము అనుకున్నది అవునో కాదో చెప్పేది వల్లుబండ. తమ మనసులో ఉన్నది కావాలని మొక్కే మొక్కుగా కూడా కరీంనగర్ జిల్లాలోని వేములవాడలో, ధర్మపురిలో భక్తులు తమ నమ్మిక కోసం వల్లు పట్టుకుంటారు. 'తెలంగాణ కావాలని ప్రగాఢంగా-కోరుకునే నూటిరువై మంది కవుల వల్లు ఈ వయ్యి' అయ్యిందని సంపాదకుడు వాచ్యం చేస్తాడు.

ఇది పద్య, గేయ, వచన కవితల సమాహారం. ఇందులోని కవులంతా 'ప్రత్యేక తెలంగాణ' అనే ప్రగాఢా కాంక్షను తెలియజేయడమే కాకుండా తెలంగాణ సాంస్కృతిక అస్తిత్వాన్ని తమ కవితల ద్వారా చాటిచెప్పే కృషిని ఆసాంతం కొనసాగించారని మనకు తెలిసి వస్తుంది. తెలంగాణకు జరిగే అన్యాయాన్ని, తెలంగాణ వెనుకబాటుతనానికి గల కారణాలను, వలసవాదుల దోపిడీని, తెలంగాణ కోసం బలైపోయిన వీరుల త్యాగాలను కళ్ళకు కట్టిస్తారిందలి సృజనకారులందరూ. దరువు ఎల్లన్న రాసిన 'వీరులారా వందనం' అన్న గేయంతో ప్రారంభమై, పెద్దోజు నరేశ్ రాసిన 'పోరుకేక' కవితతో ఈ సంకలనం ముగుస్తుంది. కాసోజు శ్రీకాంతాచారి, వేణు గోపాల్‌రెడ్డి లాంటి ఎందరో విద్యార్థుల ఆత్మాహుతులు, ఆత్మబలిదానాలను, ప్రధానంగా త్యాగాలను స్పృశిస్తూ రాయబడిన గీతం "వీరులారా వందనం"- దరువు ఎల్లన్నది. తెలంగాణ ఉద్యమ చైతన్యాన్ని రగిలించే ప్రతి వేదికపైనా, ప్రతినోటా ఈ గీతం ఆలపించబడుతూ వస్తున్నది. "కొండ కోనల వెండి వెలుగుల / గిరుల సిరుల పైరు నగలు / మొగులు నంటిన కరుణామూర్తి / ముక్కోటి బిడ్డల కలలధాత్రి / మా అవ్వగదరా తెలంగాణ మాబువ్వ గదరా తెలంగాణ" అంటూ - తెలంగాణ ప్రత్యేకతను వలస వాదుల దోపిడిని ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కొరకు చేయాల్సిన పోరాటాన్ని గురించి "మా అవ్వే తెలంగాణ" ద్వారా ఎరుకజేస్తాడు అల్లం వీరయ్య.

ప్రతి పువ్వును పరమాత్మగా భావించి పూజించే సంప్రదాయం ఒక్క తెలంగాణలో తప్ప ప్రపంచంలో ఎక్కడా కనిపించదు. పువ్వును ఒక భోగవస్తువుగా కాకుండా ఉపయోగవస్తువుగా భావించడం ఈ పండుగ ప్రత్యేకత. ఏటేటా బతుకమ్మ పండుగ జరిపే తెలంగాణ బిడ్డలంతా తెలంగాణ రావాలని, రాబోయే బతుకమ్మను పాటల్లో, ఆటల్లో కొలువాలని- కవయిత్రి గర్శకుర్తి శ్యామల పిలుపునిస్తున్నది - "బతుకమ్మ బతుకమ్మ కోల్" ద్వారా.

'దంచుడే దంచుడే పొల్లు పొల్లు దంచుడే / తెలంగాణ ఇచ్చేదాక లొల్లి జేసుడే' అంటూ కలమెత్తి లొల్లి జేస్తున్నాడు సి. హెచ్. రమణాచారి - 'తెగించి కొట్లాడుడే' కవిత ద్వారా. అల్లం కృష్ణవంశీ రాసిన 'పోరుచరిత' ఉయ్యాల పాటలో తెలంగాణ కోసం నిరాహారదీక్షలు ఒకవైపు, ఆత్మహత్యలు మరోవైపు జరిగే వైనాన్ని కళ్ళకు కట్టిస్తాడు. అరచేతిని అడ్డుపెట్టి సూర్యకాంతిని ఆపలేనట్లే, కమిటీల పేరుతో ఉద్యమాన్ని ఆపలేరని తేల్చిచెప్తాడు. తెలంగాణ వైభవాన్ని చాటిచెప్పే గీతం ముత్తోజు వీరబ్రహ్మాచార్యులు రాసిన 'తెలంగాణ విజయగీతం'.

'తెలంగాణ సాధనకై పోరుబాట'లో నడవాలని అక్కల్ని, చెల్లెండ్లను, అమ్మల్ని, అమ్మమ్మల్ని, రైతుల్ని, ఉద్యోగుల్ని, విద్యార్థుల్ని కోరుతున్న కవి - బత్తిని రాజమల్లు. 'చావద్దు చావద్దు - చచ్చి సాధించలేమ' అంటూ ఆత్మహత్యలు చేసుకొనేవారిని ఉద్దేశించి 'చావద్దు' కవిత ద్వారా అభ్యర్థిస్తాడు తులా సుధాకర రావు. సాగర మథనంలో ముందుగా హాలాహలం వచ్చినట్లుగా ఉద్యమారంభంలో కూడా అనేక అడ్డంకులుంటాయని, ఉద్యమగతి శీలతను కవితగా సూత్రీకరిస్తాడు ఆడెపు నారాయణ 'జయహో తెలంగాణ' కవిత ద్వారా. ఆంధ్రోడు అడుగడుగునా తెలంగాణకు చేసే మోసాన్ని తేటతెల్లం చేస్తూ పోరాటాలను 'బతుకుబాట' కవిత ద్వారా కాట్నపల్లి సత్యనారాయణ శర్మ కీర్తిస్తున్నాడు.

'తంత్రి తెగిన వీణ మా తెలంగాణ, కుతంత్రాలకు బలియయ్యే మా తెలంగాణ, బాధగాధల మయం జనజీవనం, పుట్టిన గడ్డపైనే పరాయిలం-మేం బానిసలం' అంటూ 'తెలంగానం'లో మందల రవీందర్‌రెడ్డి వాపోతున్నాడు. తెలంగాణ రాష్ట్ర ప్రక్రియ ప్రారంభం అవుతుందంటూ చిదంబరం చేసిన ప్రకటనతో (అంతకుముందు) ప్రత్యేక రాష్ట్రానికి మద్దతు తెలిపిన సీమాంధ్రనేతలు యుటర్న్ తీసుకుని సమైక్యాంధ్ర అంటూ పాటపాడిన కుత్సితాల్ని 'జై తెలంగాణ' కవిత ద్వారా ఎండగడుతున్నాడు నడిమెట్ల రామయ్య.

ఇష్రత్ సుల్తానా రాసిన 'లేవరా' గీతం 'తెలుగు వీర లేవరా' గీతానికి అనుసరణీయంగా అగుపిస్తుంది. 'ఉద్దెమ సూరీన్ని ముద్దాడుతున్న, గమ్యం పాదాక్రాంతం అయ్యేదాకా కదంతొక్కుతున్న నా పాదాలాగిపోవు, పదమెత్తుకున్న నాపెదాలు మూగబోవు' అని ప్రతిన బూనుతూ 'సవాల్' కవితను రాసిన కవి నూటెంకి రవీంద్ర. ప్రతిచేయీ బిగిసిన పిడికిలై విద్యుత్తుగా పరవశించిపోతుందంటూ జూకంటి జగన్నాథం "ఆత్మగౌరవ శిబిరం" ద్వారా అవగతం గావిస్తాడు. ఇప్పుడు ఉద్యమం పెద్దదై, నాయకులెట్లా పొట్టిగైపోయారో వివరిస్తూ, ప్రజల చేతుల్లోకి తెలంగాణ ఉద్యమం చేరిందన్న సత్యాన్ని చాటుతాడు.

"రాతియుగ జనావాసాల నుంచి రాచరిక కాలాల ధాటి-దాటి, నేటి ప్రజాస్వామ్య పాలనదాకా ప్రజ్వలించి రాణించిన జాణ, గతం ఘన చరిత్ర ఖజానా నా తెలంగాణ"మని తనదైన శైలిలో కీర్తిగానం చేస్తాడు డా॥ మలయశ్రీ. 'ఇక తెలంగాణ కోసం మా బిడ్డలు పానాలు దీసుకోరు, పానాలు తియ్యరు. వాటం తెల్సినోళ్ళు.. ఏడకాటు పెడితె రెండు పచ్చెలయితదో తెల్సుకున్నరు. తమ మోచేతులల్ల బలంతోటి మొండి గొడ్డలితోనైనా సమైక్యం తెగ్గొడుతరు' అంటూ ('గుయ్యారం' ద్వారా) డా॥ నలిమెల భాస్కర్ - భవిష్యత్ దర్శనం గావిస్తాడు.

ఆంధ్రులు చేసిన అన్యాయాల్ని ఏకరువు పెడుతూ శ్రీకృష్ణుని ప్రార్థిస్తూ రాయబడిన గజానన్ థామన్ కవిత -'శ్రీకృష్ణ'. ఒకవైపు తెలంగాణ ఉద్యమం ముమ్మరంగా జరుగుతుంటే కొందరు స్వార్థ రాజకీయ నాయకులు తమ పదవుల కోసం ఏ విధంగా ఉద్యమాన్ని నీరుగారుస్తున్నరో 'ఈరగోల' నెత్తి చూపాడు వేముల సత్యనారాయణ. తెలంగాణ ఉద్యమానికి కేంద్ర బిందువుగా మారిన ఉస్మానియా ఆర్ట్స్ కాలేజీని 'మోదుగుపూల వనం' అన్న దీర్ఘకవితగా ఆవిష్కరించిన కవి అల్లం నారాయణ.

తరతరాలుగా తెలంగాణకు జరుగుతున్న అన్యాయాన్ని వలపోస్తూ, నర్మగర్భంగా "హెచ్చరిక" చేశాడు కవి తైదల అంజయ్య. శత్రువు ఎన్ని ముఖాలుగా విస్తరించాడో, పన్నాగం పన్నాడో - పదునుగా ప్రకటిస్తున్న కవి ఈతడు. అర్థాంతరంగా నిష్క్రమించడాన్ని ప్రశ్నిస్తూ ఆత్మహత్యలు చేసుకొనేవారిని ఆలోచింపజేస్తుంది - "ఈమట్టిపై ప్రేమెందుకు"- సూరేపల్లి సుజాత రాసిన కవిత.

"మూడు మాటలు-ఒక పాట" అంటూ డా॥ పత్తిపాక మోహన్ రాసిన కవిత - "తెలంగాణమంటె ఎత్తిన పిడికిలి, సరిజేసిన వడిసెల, మోగుతున్న డప్పు, దద్దరిల్లుతున్న నగారా" అని అవగతం గావిస్తుంది. తెలంగాణ ఉద్యమం పతాకస్థాయిని చేరుకున్న సందర్భాన్ని - సంక్షుభిత సమయాలను అద్భుతంగా ఒడిసిపట్టుకుంది.

ఇక, అన్నవరం దేవేందర్ రాసిన అచ్చమైన తెలంగాణ కవిత 'దీపం వత్తి'. "తినే ఇస్తారిల మన్నువోసింద్రు, కాళ్ళసందుల కట్టెబెట్టింద్రు, మంచినీళ్ళబాయిల మందుకలిపింద్రు" వంటి సత్యాలను ఏకరువు పెడుతూ, సీమాంధ్రుల దౌష్ట్యాన్ని దీపం వెలిగించి మరీ లోకానికి చూపుతుంది. బతుకమ్మంటే రకరకాల పూలతో పేర్చిన నిలువెత్తు గౌరమ్మ మాత్రమే కాదు, తెలంగాణ సంస్కృతికి నిలువెత్తు దర్పణం అని తెలిపిన కవి కాలువ మల్లయ్య కాగా, "రగులుతున్న నిప్పుకణం తెలంగాణం/ తిరుగుబాటు ధిక్కారనాదం తెలంగాణం/అమర వీరుల ఆఖరి వందనం తెలంగాణం" అని కొత్త నిర్వచనం చేస్తాడు అల్లం కృష్ణచైతన్య - తన "పులకింత" ద్వారా. రాత్రికి రాత్రి తలెత్తిన కుహనా సమైక్యవాదం గూర్చి వఝల శివకుమార్ రాసిన కవిత 'దొంగనాటకం'. 'అన్ని దీక్షలూ ఆమరణాలు కానేరవు, రాత్రికి రాత్రి లగెత్తుకుపారిపోయే దీక్ష, ఉద్యమం పేర ఉల్లెక్కల అటౌతుంది' అని - కిరాతకుల, కపట దీక్షల్ని కసిగా ఎత్తిపొడుస్తుంది.

సుదీర్ఘకాలంగా తెలంగాణలో జరుగుతున్న ఉద్యమస్థాయిని, దేశ దేశాల్లోని, వివిధ కాలాల్లోని యితర ఉద్యమాలకూ -దీనికీ గల భేదాన్ని బలంగా ఎత్తి చూపిందీ సంకలనం. శత్రువు మీద బాణాల్ని సంధించడంతోపాటు, శత్రు సంబంధ - విషపాతకపు చర్యలు, మతులబులను మహాద్భుతంగా కాన్వాసు మీది చిత్రం లాగున అలికి చూపింది. తెలంగాణ చారిత్రక వారసత్వాన్ని, సాంస్కృతిక అస్తిత్వాన్ని ప్రత్యేకతలను ఎలుగెత్తిచాటింది. కుహనా రాజకీయ నాయకుల-కుళ్ళును కళ్ళకు కట్టిస్తూ, వారి ద్వంద్వ వైఖరులను పట్టున పగులజీరినంత పనిచేసింది. సుమారు రెండు పదుల పాటలు - పదిపదుల కవితలతో కలిపి నూటయిరువై తెలంగాణ గొంతుకల తీవ్రాకాంక్షలు, ఆవేదనలు, ఆక్రందనలు-వెరసి యిదొక తెలంగాణ సామూహిక నినాదాల కేంద్రకంగా మనముందు సాక్షాత్కరించింది.

## "రైతుదే - తెలంగాణము రైతుదే"

# యూరియా కోసం రైతుల అవస్థలు



అన్నదాత అన్ని విధాలా నిలువు దోపిడికి గురవుతున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. ఈ సంవత్సరం ఖరీఫ్‌లో ఆది నుండి ప్రకృతి కరుణిస్తున్నా, అధికారులు, వ్యాపారులు కనికరం లేకపోవడంతో అన్నదాత ముప్పేట దాడికి గురవుతున్నారు. మొన్న నకిలీ విత్తనాలు, నిన్న ఎరువుల కొరత, నేడు యూరియా కొరతతో అన్నదాత బెంబేలెత్తిపోతున్నాడు. అసలే వరినాట్లు పెద్దగా పూర్తికాలేదు. ఒక పక్క కాంప్లెక్స్ ఎరువులకే ఆయకట్టు రైతాంగం ఆందోళన చెందుతుండగా, మరో పక్క యూరియా కొరత వెంటాడుతూనే ఉంది. బావులు, బోర్ల కింద వరినాట్లు వేసి నెల రోజులు కావడంతో రైతులు యూరియా కోసం ఎదురు చూస్తున్నారు. గత వారం రోజుల నుండి అల్పపీడనం కారణంగా ఎరువుల ర్యాక్‌ల రాక ఆలస్యం అయింది. ఇంకేముంది ఆలస్యం వ్యాపారులకు సిరులపంటగా మారింది.

కొంత మంది వ్యాపారులకు యూరియా రావడంతో 275 రూపాయలకు అమ్మవలసిన యూరియాను మూడువందల నుండి 350 రూపాయల వరకు అమ్ముతూవచ్చారు. ఇదేమని ప్రశ్నిస్తే తామే ప్రైవేటుగా అధిక ధరలకు కొనుగోలు చేస్తున్నామని, అందువల్లనే అధిక ధరలకు విక్రయించాల్సి వస్తుందని బాహాటంగానే వ్యాపారులు చెబుతున్నారు. గట్టిగా ప్రశ్నించిన వారికి తమవద్ద యూరియా లేదని సమాధానం ఇవ్వడంతో పలువురు రైతులు వాపోతున్నారు. గత 15 రోజుల నుండి యూరియా కోసం ఎదురు చూసినా వచ్చిరాని యూరియాతో ధరలు మాత్రం ఏకంగా బంగారపు ధరలను మరిపిస్తున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు అధిక ధరలకు విక్రయించకుండా చర్యలు తీసుకొంటామని చేస్తున్న ప్రకటనలు కాగితాలకే తప్ప ఆచరణలో జరగడంలేదు. అధిక ధరలను అరికట్టేదుకు సహకార సంఘాల ద్వారా అందించాలని ప్రయత్నం చేస్తున్నా అది నెరవేరడం లేదు.

రైతులకు యూరియా ఇబ్బందులు తప్పడం లేదు. అవసరాలకు సరిపడా యూరియా దొరక్కపోవడంతో అదను దాటిపోతుందని వారు ఆందోళన చెందుతున్నారు. డిమాండ్ మేరకు ప్రభుత్వం యూరియా సరఫరా చేయాలని కోరుతున్నారు. కొన్ని జిల్లాలు, యించు మించు అన్ని మండలాల్లోనూ యిదే పరిస్థితి. ఈస్థితి తెలంగాణ జిల్లాల్లో మరింత భయంకరంగా ఉండటాన్ని గమనించాలె. అడిగి - అడిగి, ప్రార్థించి, విసిగి పోతున్నారు రైతులు. పీఏసీఎస్ నుంచి దశల వారీగా యూరియాను రైతులకు సరఫరా చేస్తున్నా... అవి ఆలస్యంగా అందుతుడడంతో ఏ మూలకూ సరిపోవడం లేదు. మండల కేంద్రాల్లో ఉన్న పీఏసిఎస్‌లో ఉదయం నుంచి రైతులు వందల సంఖ్యలో బారులు తీరుతున్నారు. నిత్యం దూర ప్రాంతాల నుంచి వచ్చినా ఎరువులు దొరక్క వెనుదిరగాల్సిన పరిస్థితి. అయినా, అధికారులు సరఫరా చేసే ఎరువులను పెంచడం లేదు.

లోపం ఎక్కడవుందని ఎప్పటికప్పుడు రైతులు ఆరాతీస్తూనేవున్నారు. అనేక లొసుగులను, మోసాలను బయట పెడుతూనే వున్నారు. దొంగ-అక్రమ రవాణాలను అడ్డుకుంటూనేవున్నారు. వాటిని పెడ చెవిని పెడుతూ, అమాయకత్వం నటిస్తూ తప్పించుకో జూస్తూనే వున్నారు సంబంధిత అధికారులు, మంత్రిపుంగవులు కూడ. ప్రభుత్వమైతే నిమ్మకు నీరెత్తినట్లు, చెవిటి-గుడ్డి-మూగ కూడ అయినట్లు వ్యవహరిస్తుడటంతో, గత్యంతరంలేక రైతులు-దొంగ రవాణా అవుతున్న లారీలలోని ఎరువుల బస్తాలను కొన్ని జిల్లాలలో లూటీ చేయడం జరిగింది. దొంగ రవాణా గురించి నోరెత్తని అధికారులు, నోళ్ళూ-కీళ్ళూ పడిపోయినట్లు వ్యవహరించిన సంబంధీకులు-లూటీ జరుగుతుందని తెలియగానే పోలీసులకు పనిచెప్తారు.

తక్షణం రంగంలోకి దిగిన పోలీసులు - విచక్షణా రహితంగా - అన్నంపెట్టే రూతుల మీద విరుచుకుపడి - చావ-చిట్లగొడతారు. ఉల్టా కేసులు పెడతారు గాని - 'ఎందుకీ కృత్రిమ ఎరువుల కొరత' అని అడగబోరు - కనీసం ఆలోచించలేరు. వారికి తెలిసిందల్లా వారి పై అధికారుల ఆజ్ఞలను పాటించడమే. నిరపరాదులూ, ఎరువుల పేరిట - దుర్భర బాధితులూ అయిన రైతుల మీద నెనరు - జాలి వంటివి వుండవు గాక వుండవు.

ఫ్యూడల్ వ్యవస్థల్లో, రాజులనాటికాలాల్లోనూ యిటువంటి దుర్నీతులు, దుష్టపన్నాగాలు లేవేమో! ఆ మాటకొస్తే, యావత్ ప్రపంచంలో ఎక్కడా యిటువంటి దుష్చర్యలు-తత్ ఫలితంగా అన్నదాతలకు అన్యాయాలు - ఏకోశానా వూడి వుండవేమో! ఏమైనా, రైతులను వేదించుకుతిన్న ఏ పాలనా బతికి బట్టకట్టినట్లు చరిత్రలో దాఖలాలు లేవు. ఒకానొక సందర్భంలో నిజాం ప్రభువునుద్దేశించి మహాకవి దాశరథి అన్న మాటలను గుర్తుచేసుకున్నప్పుడు- "ముసలినక్కకు రాచరికమ్ము దక్కునే? రైతుదే-తెలంగాణము రైతుదే!" అని తీర్మానించినట్లవుతుంది. తథాస్తు!

**- సంచారి**

ఉద్యమపర్వం

## బీసీ పత్రికల యాజమాన్యాలు ఐక్యం కావాలి

# ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ

హైద్రాబాద్ ప్రతినిధి: రాష్ట్రంలోని బీసీ పత్రికల యాజమాన్యాలు ఐక్యంగా ఉంటూ వెనుకబడిన తరగతుల అభ్యున్నతికి కృషి చేయాల్సిన అవసరం ఉందని మాజీ మంత్రి, స్వాతంత్ర్య సమరయోధుడు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ అభిప్రాయపడ్డారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో బీసీ కుల సంఘాల ప్రముఖులతో పాటు పలు బీసీ పత్రికల సంపాదకుల సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడుతూ వెనుకబడిన కులాలు ఐక్యతగా ఉండడంతోపాటు ఆయా వర్గాల ప్రజలను చైతన్యపరచాలని సూచించారు. రాష్ట్రంలో వున్న బీసీ చిన్న పత్రికల సంపాదకులు ఐక్యంగా ఉండి ఒక ట్రస్టుగా ఏర్పడితే ఐదు లక్షల రూపాయలు విరాళంగా ఇవ్వడానికి తాను సిద్ధంగా వున్నానని చెప్పారు. రాష్ట్రంలో వున్న వందలాది బీసీ సంఘాలు బీసీ పత్రికలు మనుగడ సాధించడానికి సహకరించాలని, పత్రికలను చదవడంతోపాటు ఆ పత్రికలు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి కూడా తనవంతు పాత్రను నెరవేర్చాలని ఆయన అన్నారు. వెనుకబడిన కులాలు సామాజిక న్యాయాన్ని సాధించడానికి బీసీ పత్రికలను ప్రోత్సహించాలని కొండా లక్ష్మణ్ బాపూజీ పిలుపునిచ్చారు. ఆదర్శవాణి పత్రిక ఎడిటర్ వంగాల




బాలరాజ్‌గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో యాదవ టుడే, పద్మశాలి, శాలివాహన, పద్మపీఠం, బీసీ టైమ్స్, మానుకోట, పద్మమిత్ర, పత్రికల సంపాదకులు – రమణ విశ్వం, లక్ష్మీ, బీసీ చైతన్య వేదిక నాయకులు – వీరవల్లి శ్రీనివాస్, తెలంగాణ బీసీ జాక్ రాష్ట్ర కన్వీనర్ రామ్‌రాజ్, డా॥ విజయలక్ష్మీ, బోనం ఊర్మిళ, చీమల మల్లేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# స్వయం పాలన కావాలి

### ఓయూ ఆత్మగౌరవ సభలో కోదండరాం

### న్యాయవాదులకు 42శాతం కోటా ఇవ్వాలని – గ్రూప్–1ను వెంటనే రద్దు చేయాలని పిలుపు

సెప్టెంబర్ 17న నైజాం స్టేట్‌ను భారత ప్రభుత్వం ఇండియన్ యూనియన్‌లోకి విలీనం చేసిన సందర్భాన్ని పురస్కరించుకొని ఓ.యూ విద్యార్థులు ఆత్మగౌరవ సభను నిర్వహించారు. తెలంగాణ కళాకారుల పాటలు, అతిథుల ఉపన్యాసాలతో సభ విద్యార్థులను హోరెత్తించింది. సభ మధ్యలో వర్షం వచ్చినప్పటికీ వేలాది మంది విద్యార్థులు ఓపికగా సభలోనే చివరివరకూ ఉన్నారు. ఓయూ జాక్ నాయకులు పిడమర్తి రవి అధ్యక్షతన జరిగిన ఆత్మగౌరవ సభలో తెలంగాణ జాక్ చైర్మన్ ప్రొఫెసర్ కోదండరాం, టీఆర్ఎస్ ఎల్పీ నేత ఈటెల రాజేందర్, తెలంగాణ జాక్ కో–చైర్మన్ మల్లేపల్లి లక్ష్మయ్య, మొ॥నవారు పాల్గొన్నారు.

### రాజ్యాధికారమే తెచ్చుకోవాలె : కోదండరాం

తెలంగాణ ప్రజలకు ఇక కావల్సింది వాటా కోటా కాదు స్వయం పాలనకోసం రాజ్యాధికారమే తెచ్చుకోవాలని ప్రొ॥ కోదండరాం పేర్కొన్నారు. తెలంగాణ ప్రజలను సంఘటిత పరచి ఆంధ్రుల పెత్తనాన్ని కూలదోసేందుకు ఉద్యమమార్గ నిర్దేశనం చేయాల్సిన బాధ్యత ఓయూ విద్యార్థులపై ఉందన్నారు. "వివిధ పార్టీల్లో వున్న తెలంగాణ నాయకులారా కలసి వస్తే మంచిది లేకపోతే తెలంగాణ ఉద్యమ రథ చక్రాల కింద నలిగి పోతార"ని హెచ్చరించారు. ఆంధ్ర సంపన్న వర్గాల అహంకారాన్ని



ప్రశ్నించడమే ఈ ఆత్మగౌరవ సభ ముఖ్య ఉద్దేశ్యమన్నారు. అడ్వకేట్ జనరల్ ముఖ్యమంత్రికి విశ్వాస పాత్రుడిగా వుండటం కాదు ఆ వ్యక్తికి రాజ్యాంగం, న్యాయం తెలిసి వుండి ప్రభుత్వం ప్రజాస్వామిక సూత్రాల ప్రకారం నడిచేటట్లు చూడాలన్నారు.

### సమైక్యవాదుల్లారా ఆగిపోదు తెలంగాణ ఉద్యమం అలసిపోదు : ఈటెల

తెలంగాణ రాష్ట్రం సాధించేంత వరకు తెలంగాణ ఉద్యమం ఆగిపోదూ, అలిసిపోదని సమైక్యవాదులను టీఆర్ఎస్ ఎల్పీ నేత ఈటెల రాజేందర్ హెచ్చరించారు. ఆత్మగౌరవ సభలో ప్రసంగిస్తూ – "తెలంగాణ ప్రజలకు ఇంకెన్నాళ్ళు కన్నీళ్లు–కష్టాలు? వీటి గురించి ఎన్ని రోజులు చెప్పుకుందాం?" – అని ఆయన ప్రశ్నించారు. "తెలంగాణలో చేనేత కార్మికుల ఆత్మహత్యలు, పాలమూరులో వలసలు, ఎండుతున్న పొలాలు, ఆంధ్రదోపిడీ, అమరుల త్యాగాలు–ఇంకెన్ని రోజులు?" – అని నిలదీస్తూ భగత్ సింగ్ వలె పోరాడే సమయం ఆసన్నమైందని పేర్కొన్నారు.


### ఆత్మగౌరవ సభ తీర్మానాలు

1. తెలంగాణ ప్రజల ఆకాంక్షను గుర్తిస్తూ పార్లమెంట్‌లో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు బిల్లును ప్రవేశపెట్టాలె 2. గ్రూప్–1 పరీక్షను వెంటనే రద్దు చేయాలె 3. ఏపిపిఎస్సీ చైర్మన్ వెంకట్రామిరెడ్డిని తొలగించాలె 4. విద్యార్థులపై కేసులను ఎత్తివేయాలె 5. తెలంగాణ న్యాయవాదులకు కోర్టుల్లో నలభై శాతం వాటాను ఇవ్వాలె.

ఆదర్శం

# కాళోజీ జీవితమే పోరాటాల చరిత్ర

**– మల్లయ్య,** 9908853052



ప్రజాకవి కాళోజీ నిజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా సాగిన ప్రజా పోరాటంలో అగ్రభాగాన నిలిచిన వీర సైనికుడు. నిజం పలికినందుకు నిజాం ప్రభుత్వం ఆయన్ని నగర బహిష్కరణకు గురిచేసింది. జైలుకు కూడా పంపింది. అయినా, ఆయన ఏనాడూ ప్రభుత్వంతో రాజీపడలేదు. పదవులకోసం పాకులాడలేదు. అంతకన్నా మిక్కిలి – ప్రజల్ని మరిచిపోలేదు. ఆయన సాహిత్య, సాంఘిక, రాజకీయాది ఉద్యమాలన్నింటిలో పాల్గొన్నాడు. ఆర్యసమాజ కార్యకలాపాల్లో పాల్గొన్నాడు. ఆంధ్ర మహాసభల్లో పాల్గొన్నాడు. స్టేట్ కాంగ్రెస్ ఉద్యమాలకు నడుం బిగించాడు. గ్రంథాలయోద్యమాన్ని బలోపేతం చేశాడు. ఒకటేమిటి తెలంగాణ సాంస్కృతిక పునరుజ్జీవన ఉద్యమాలన్నింటికీ ఆయన ఒక ఎత్తిన విజయపతాక. పోరాటమే శ్వాసగా బతికాడు. పోరాటం ఆయన రక్తంలో ఇమిడిపోయింది. "కాళోజీ" అన్న మూడక్షరాలు పోరాటానికి సంకేతంగా మిగిలాయి. కాళోజీ కారుణ్యమూర్తి. మానవతా వాది. అన్యాయాన్ని ఎదిరించే సమరశీలి. దుర్మార్గాన్ని ఖండించే శక్తి సంపన్నుడు. ప్రజావ్యతిరేకుల్ని తన కలానికి బలిచేసే కర్మవీరుడు. నిరాడంబరుడు, నిష్కలంకుడు, పీడితులకోసం – తాడితుల కోసం కడవల కొద్ది కన్నీరు కార్చాడు. వాళ్ళకోసమే తపించాడు. తల్లడిల్లాడు. తల్లిలా చేరదీశాడు. సమగ్ర సామాజిక విప్లవం రావాలన్నాడు.

1914 సెప్టెంబర్ 9వ తేదీన రంగారావు, రమాబాయి దంపతులకు కాళోజీ జన్మించాడు. విద్యాభ్యాసం ఎక్కువగా వరంగల్ నగరంలోనే జరిగింది. ఆయన ప్రాథమిక విద్యాభ్యాసం కొద్దికాలం హైదరాబాద్‌లోని పాతబస్తీలో సాగితే, హన్మకొండలో కాలేజీ చదువులు పూర్తయినాయి. 1939లో న్యాయశాస్త్ర పరీక్షలు రాసి ఉత్తీర్ణుడయ్యాడు. 1948లో వరంగల్ కోర్టులో న్యాయవాద వృత్తిని చేపట్టాడు. 1940లో రుక్మిణీబాయితో ఆయనకు వివాహం జరిగింది.

1930 నుంచి గ్రంథాలయ ఉద్యమంలో కాళోజీ ప్రముఖపాత్ర వహించాడు. తెలంగాణ ప్రాంతంలో ఊరూరా గ్రంథాలయాల స్థాపనకు కంకణం కట్టుకొని పనిచేశాడు. 1935లో మిత్రమండలి సాహిత్య కార్యక్రమాలకు అంకురార్పణ చేశాడు. మొదటిసారి జైలుకెళ్ళాడు. 1942లో క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని అరెస్టయ్యాడు. 1946–47లో నిజాం ప్రభుత్వంలోని రజాకార్లు సాగించిన రాక్షస కృత్యాలకు వ్యతిరేకంగా ఉద్యమాలు నిర్మించాడు. 1947లో ఆయన మూడవసారి జైలుకెళ్ళాడు. 1969లో కూడ ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో పాల్గొని జైలుశిక్ష అనుభవించాడు.

కాళోజీ గొప్ప దేశభక్తుడే కాకుండా బహుభాషావేత్తగా ఎదిగినాడు. తెలుగు, ఉర్దూ, ఇంగ్లీషు, మరాఠీ, హిందీ భాషల్లో సాహితీవేత్తగా పేరుగాంచాడు. పరభాషపై మోజు పెంచుకొని కన్నతల్లి వంటి స్వభాషను నిరాకరించడాన్ని అవహేళన చేస్తూ...

**తెలుగు బిడ్డవురోరి తెలుగుమాట్లాడుటకు**

**సంకోచపడియెదవు సంగతేమిటిరా?**

**అన్యభాషలు నేర్చి ఆంధ్రంబు రాదంచు**

**సకిలించు ఆంధ్రుడా! చావవేటికిరా?** అని కాళోజీ అన్నాడు.

పోరాటమే కాళోజీ స్వభావం. ఆయన జీవితమే పోరాటాల చరిత్ర. ప్రజల కోసం అతని ఆరాటమూ, పోరాటమూ, సర్వస్వం కూడా.

తెలంగాణ సాహిత్య ఉద్యమ చరిత్రలో ఒక మహోన్నత చారిత్రాత్మక బురుజుగా నిలిచిన ధీర శిఖరం కాళోజీ నారాయణరావు. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాటం జరిపి ప్రజాకవిగా ఎదిగిన కాళోజీ రచనలు ఏకకాలంలో ఉద్యమ నిరతిని నింపుకుంటూ, సాహిత్య

గౌరవాన్ని యినుమడింపజేసుకుంటూ వచ్చినవి. "అన్యాయాన్నె దిరిస్తే నా గొడవకు సంతృప్తి... అన్యాయం అంతరిస్తె నా గొడవకు ముక్తి ప్రాప్తి... అన్యాయాన్నెది రించినోడు నాకు ఆరాధ్యుడు" అన్నవాడు కాళోజీ ఒక్కడే. కాళోజీ కవిత ప్రజల కవిత. కాళోజీ అంటేనే జనం మనిషి. ఆయనకు భయమంటే ఏమిటో తెలియదు. తనకు, తన సమాజానికి అన్యాయం అనిపించిన దాన్ని నిస్సంకోచంగా, నిర్భీతితో ఎలుగెత్తి చాటినాడు. ఒట్టి మాటలు చెప్పడం ఆయనకు చేతకాదు. పెత్తనాలకు ఎన్నడూ దేవులాడలేదు. ఎవరి మనస్సు నొచ్చినా, ఎవరి మనసు మెచ్చినా తానేది అనుకున్నాడో దానిని కుండబద్దలు కొట్టినట్లు చెప్పినవాడు. ఆయనకు ఎవరిపైనా ద్వేషం లేదు. ఎవరినీ అతిగా ప్రేమించినవాడూ కాదు. "పద్మవిభూషణ" బిరుదును అందించిన పి.వి. నరసింహారావు తనవాడే... దాన్ని తీసుకోవద్దని అడ్డుకున్న వరవరరావూ తనవాడే. ఆయనకు ఆడంబరాలు తెలియవు. కపటమెరుగనివాడు. ఆతని ప్రతి మాటా ఒక నినాదం. ఆధునిక తెలుగు సాహిత్యంలో ప్రజాకవిగా, వేమనతో పోల్చదగిన ఏకైక కవి వరేణ్యుడుగా నిలిచి అనేక ఉద్యమాలకు ముందు వరసన నిలుచుండి నడిపించినాడు.


ఆర్య సమాజ్ నుండి పౌర హక్కుల సంఘాల దాకా, అందరి కార్యక్రమాల్లోనూ చురుకుగా పాల్గొన్నవాడు. అయితే ఏ సంఘానికీ, ఏ నిర్మాణానికీ ఆయన పరిమితం కాలేదు. కళ్ళ ముందు జరుగుతున్నది చూస్తూ తనకేమీ పట్టనట్లుండడం కాళోజీకి చేతకాదు. ఆయన ముందు జరుగుతున్న అవకత వకలను సాధ్యమైనంతగా చక్కదిద్దడానికే ప్రయత్నించాడు. ఎన్నికల్లో ప్రతినిధులను ఎన్నుకోవడంపై హితబోధ చేసినట్లే, అటు ఎన్నికలను బహిష్కరించమని పిలుపునిచ్చిన నక్సలైట్లను సైతం ఆయన మందలించాడు. కాళోజీ జీవితమే ఉద్యమాల చరిత్ర. 1932లో తెలంగాణ ప్రాంతం నుంచి స్వాతంత్ర్యో ద్యమంలో చురుగ్గా పాల్గొన్న కాళోజీ నైజాం ప్రభుత్వంపై తిరుగుబాటు ఎగురవేసి పలువురికి మార్గదర్శకులయ్యారు.

హన్మకొండ నక్కలగుట్టలోని కాళోజీ ఇంట్లో ప్రతివారం కవితాగోష్ఠి జరిగేది. ఈ గోష్ఠిని వారు ఆమర ణాంతం ఎంతో చైతన్యవంతంగానూ, స్ఫూర్తి దాయకంగానూ, వినూత్నంగానూ కొనసాగించారు. 1960 ప్రాంతంలో పి.వి. నర్సింహారావు గారు కూడ కాళోజీ లోగిలిలో జరిగే సభల్లో పాల్గొని తన కవితల్ని వినిపించినవాడే. అనేక మంది కవులు, రచయితలకు కాళోజీ స్ఫూర్తి. అల్పమైన పదాల్లో అనల్పమైన అర్థాల్ని పొదిగే కాళోజీ కవితలు తూటాల్లా సూటిగా గుండెల్లో గుచ్చుకునేవి. అందుకే తెలుగు సాహితీ ఉద్యమంలో అనేక యిజాలు చోటు చేసుకున్నప్పటికినీ కాళోజీ కవిత చెక్కు చెదరకుండా సాగింది. "ఓరుగల్లు కోటస్తంభం", "కాకతీయ సాహితీ వటవృక్షం"గా పేరెన్నికగన్న కాళోజీ 2002 నవంబర్ 14వ తేదీన నేల కూలడంతో ఓరుగల్లు బోరుమంది. సాహితీలోకం చిన్నబోయింది. పౌరహక్కుల గళం మూగబోయింది.

లోకనాయక జయప్రకాష్ నారాయణ్‌ను గురించి, అనితర సాధ్యంగా కాళోజీ చెప్పిన మాటలు, అక్షరాలా ఆతనికీ వర్తిస్తాయి :

***"పుటుకనీది, చావునీది***

***బతుకంతా దేశానిది!"***




1930 నుంచి గ్రంథాలయ ఉద్యమంలో కాళోజీ ప్రముఖపాత్ర వహించాడు. తెలంగాణ ప్రాంతంలో ఊరూరా గ్రంథాలయాల స్థాపనకు కంకణం కట్టుకొని పనిచేశాడు. 1935లో మిత్రమండలి సాహిత్య కార్యక్రమాలకు అంకురార్పణ చేశాడు. మొదటిసారి జైలుకెళ్ళాడు.

జీవస్పర్శ

# తలనొప్పి - పార్శ్వనొప్పి

(Head Ache and Migraine)



మెదడు, నొప్పిని తెలియజేసే నాడులు (The Brain and the Sensitive pain Fibres) :

నిజానికి మెదడు నొప్పికి స్పందించదు. కాని పుఱ్ఱెకు (Skull) లోపల, బయట నొప్పిని తెలియజేసే నాడులుంటాయి. వాటిలో ముఖ్యమైనవి:

1. ధమనులు (The Arteries) : మంచి రక్తాన్ని తీసుకుపోయే రక్తనాళాలు.
2. మెదడుకు సంబంధించి వెనస్ సైన్యూసెస్ (The Venous Sinuses of the Brain).
3. పుఱ్ఱెకు బయటనుండే సుతి మెత్తని, నొప్పిని తెలియజేసే కండరాలు (External scalp muscles).

పై మూడు రకాల నొప్పిని తెలియజేసే సాధనాల్లో ఒకటి గాని అంతకంటే ఎక్కువగాని నొప్పికి సంబంధించిన సమాచారాన్ని మెదడులోని కేంద్రానికి అందజేస్తాయి.

**తలనొప్పి రకాలు** (Types of Head Aches):

తలనొప్పి పలురకాలుగా రావచ్చు. వాటిలో కొన్ని ఈ విధంగా ఉంటాయి.

**1. వ్యాస్కులర్ తలనొప్పులు** (Vascular Head Aches)

ఒక్కొక్కసారి భరింపరాని తలనొప్పి వస్తుంది. దీనికి కారణం మెదడులో రక్తనాళాలు ఒకేసారి వ్యాకోచించడం (Dilation of the Intracranial Blood vessels). ముఖ్యంగా జ్వరంతో వచ్చే తలనొప్పి, అంటు వ్యాధులతో వచ్చే తలనొప్పి, మూర్ఛ వ్యాధితో వచ్చే తలనొప్పి, ఎత్తైన పర్వత ప్రాంతాల్లో వచ్చే తలనొప్పి, సారా వంటి మత్తు పదార్థాలు సేవించినప్పుడు వచ్చే తలనొప్పి – ఈ రకమైన తలనొప్పి.

**2. కండరం కుంచించుకు పోవడం** (Muscle Spasm) **వల్ల వచ్చే తలనొప్పి:**

అత్యంత ఆవేశంలోగాని, ఆవేదనలోగాని మెడ, తలలోని కండరాలు ఆకస్మాత్తుగా కుంచించుకుపోవడం వల్ల విపరీతమైన నొప్పి కలుగుతుంది. తీవ్రమైన అన్ని రకాల తలనొప్పులకు (విష జ్వరాలవల్ల, వ్రణాలవల్ల, మెనింజైటిస్ అనగా మెదడును రక్షించే కండరాలవాపు వల్ల వచ్చేవి) డాక్టర్ చేత పరీక్ష చేయించుకోవడం, తత్కాలమే అవసరమైన ఔషధాన్ని సేవించడం అనివార్యం.

**3. పార్శ్వపునొప్పి** (Migraine): మానసిక వత్తిడివల్ల బావోద్వేగాల వల్ల వచ్చే తలనొప్పిని సైకోజెనిక్ తలనొప్పి అంటారు (Psychogenic Head Ache). తలపై భాగంలో ఈ నొప్పి అనిపిస్తుంది. తలకిరువైపుల కూడా ఈ నొప్పి రావచ్చు. పార్శ్వపునొప్పి (Migraine) ఈ రకం నొప్పి. ఒకవైపే రావడం వల్ల దీన్ని పార్శ్వపునొప్పి అంటారు. వుండి ఉండి నొప్పి వస్తుంది. (వరుసగా ఉండదు). అప్పుడప్పుడు వాంతి చేసుకోవడం, కంటిచూపు మందగించడం కూడా జరుగుతుంది. ఉదయం నొప్పి కొద్దిగా ఉండి, ఎండ ఎక్కువైన కొద్దీ నొప్పి కూడా ఎక్కువౌతుందని చాలామంది అనుభవం చెపుతుంది. తలలో మెదడుకు రక్తాన్ని సరఫరా చేసే రక్తనాళాలు అధికంగా వ్యాకోచం చెందడం ద్వారా, నొప్పిని తెలియజేసే నరాల కొనలను సాగదీయడం వల్ల అటోనమస్ నరాల సంతులను కోల్పోయి నొప్పి కలుగుతుంది.

**4. శారీరక వత్తిడి వల్ల కలిగే తలనొప్పి** (Tension Head Ache):

సోమాటిక్ నరాల (Somatic Nervous System) ద్వారా తలనొప్పి కలుగుతుంది. తల భాగంలోని కండరాలు (External Scalp Muscles) వెంట వెంట సంకోచం చెందడం వల్ల ఈ నొప్పి వస్తుంది. ఇటువంటి నొప్పి తీవ్రత ఎక్కువగా లేకపోయినప్పటికీ, చాలాసేపు ఉంటుంది. తలకు ఒకవైపు గాని, రెండు వైపులగాని ఈ నొప్పి కలుగవచ్చు.

**ముఖ్య గమనిక : 1. ఆహారం:** సాత్త్వికాహారం అనగా త్వరగా జీర్ణమయ్యేది తీసుకోవాలి. చాకోలేట్లు, జున్ను, సారా, అధికంగా భుజించడం వంటివి మానెయ్యాలి.

**2. మానసిక వత్తిడి** వల్ల తలనొప్పి, మైగ్రేన్ వచ్చే సూచనలు కన్పించినప్పుడు ఆ పూట భోజనం మానేసి, 10 నిమిషాలు పూర్తి విశ్రాంతిని తీసుకోవాలి.

– యోగాచార్య డా॥ పైళ్ళ సుదర్శన్ రెడ్డి, 9949997923

# రాశి ఫలాలు - అక్టోబర్ నెల



**మేషరాశి:** ఈ మేషరాశి వారికి ఈనెల బంధుమిత్ర విరోధాలు, వ్యాపారాలలో ఆటంకాలు, స్థానచలనాలు, శారీరక రుగ్మతలు, భార్యకు ఆరోగ్యభంగము, కష్టనష్టాలు సంభవించును. సామాన్య ఫలితము లిచ్చును.



**వృషభరాశి:** ఈనెల వృషభరాశి వారికి పూర్తిగా అనుకూలంగా ఉండును. అన్ని రంగాల వారికి అనుకూలమైన మాసం. ప్రయాణాలు, కొత్త వ్యక్తులతో పరిచయాలు, కుటుంబసౌఖ్యం, మంచి ఆలోచనలతో నూతన కార్యాలు ప్రారంభిస్తారు.



**మిథునరాశి:** ఈరాశి వారికి ఈనెలలో నూతన వస్తువులు కొనుగోలు చేయుట, బంధుమిత్రులను కలుసుకొనుట, కళత్రసౌఖ్యం, కుటుంబ సౌఖ్యం, వాహన సౌఖ్యం, ఆరోగ్యలాభం, ధనలాభం, మనోధైర్యం కలుగును.



**కర్కాటకరాశి:** ఈనెలలో కర్కాటకరాశి వారికి అన్నింటా విజయం. వృత్తివ్యాపారాలలో అనుకూలత, సంతాన సౌఖ్యం, శత్రువులపై ఆధిక్యత, స్త్రీ లాభం, కీర్తి, యశోభూషణ ప్రాప్తి, సంఘంలో పలుకుబడి లభించును.



**సింహరాశి:** సింహరాశి వారికి ఈనెలలో అనుకూల ముగా, గృహములో శుభకార్యములు, బంధుమిత్రు లతో సంతోషంగా పాల్గొనుట, స్థిరాస్థి వృద్ధి, ప్రయాణసౌఖ్యం, పుణ్యక్షేత్ర సందర్శనం, అంతా ఉత్సాహంగా ఉండును.




**కన్యారాశి:** ఈ రాశి వారికి ఈనెలలో మనోనిబ్బరం కోల్పోవుట, 16వ తేదీ వరకు కష్టాలే ఎక్కువగా ఉండును. ఉద్యోగులకు ఇబ్బందులు తప్పవు. అన్నింటా అపజయం, చివరలో కొంత అనుకూలంగా ఉండును.



**తులరాశి:** ఈరాశి వారికి ఈనెలలో పాతసమస్యలే కాకుండా కొత్త సమస్యలు ఎదురగును. కొంత కోపం పెరిగి పట్టుదలకు పోవుటచేత తట్టుకోలేని పరిస్థితులు ఏర్పడును. వాహన మూలకంగా ఇబ్బందులు, కళత్రవంశచూతకములు, సోదర మూలకంగా ఇబ్బందులు కలుగును.



**వృశ్చికరాశి:** ఈనెలలో వృశ్చికరాశి (అన్నిరంగాల) వారికి ఇబ్బందులు తప్పవు. ఆదాయమునకు మించిన ఖర్చులు, ఆరోగ్య భంగములు కలుగును. స్త్రీల మూలకంగా, వ్యసనముల ద్వారా ధనవ్యయము భూ తగాదాలవలన కొన్ని ఇబ్బందులు తప్పవు. ఔషధసేవ అవరమగును.



**ధనుస్సురాశి:** ఈనెలలో ధనుస్సురాశి వారికి కొంత అనుకూలంగానే ఉండును. భార్యమూలకంగా కొన్ని సమస్యల నుండి బయటపడతారు. రావాల్సిన బాకీలు వసూలౌతాయి. ధనవ్యయము కూడ ఎక్కువే. సంఘంలో గౌరవం పెరుగును. అనవసరపు ఖర్చులు చేస్తారు.



**మకరరాశి:** ఈరాశి వారికి ఈనెల ఎంతో అనుకూలంగా ఉండును. కోర్టు వ్యవహారములు లాభించును. నూతన వాహనలాభము, నూతన గృహ ప్రారంభం, ప్రభుత్వకార్యాల లాభం, అన్ని రంగముల వారికీ యోగకాలమే. నూతన పరిచయాలు ఏర్పడును.



**కుంభరాశి:** కుంభరాశి వారికి ఈనెలలో కొంత ఇబ్బందికరంగానే ఉండును. మాటకు విలువలేకుండా పోవుట, అనేక సమస్యలతో ఇబ్బందులు, అందరితో మనస్పర్థలు, విరోధాలు, స్వల్పకష్టాలు, వాహన ప్రమాదాలు, భూ సంబంధ నష్టాలు కలుగును.




**మీనరాశి:** ఈరాశి వారికి ఈనెలలో ఏపనీ పూర్తిగాకుండా మనోదుఃఖములు, మానసికవ్యధ, అల సట, తెలిసినవారే మోసం చేయుట, ఏ పనిచేసినా అస్తవ్యస్థముగనుండును. భార్యకు అనారోగ్యం, శస్త్రచి కిత్స వంటివి జరుగవచ్చును. ఆరోగ్య భంగ ములు తప్పవు. అసహనంగా వుండును.





– పంతంగి నాగరాజు శర్మ,
సెల్ 9848843568





C.M


మన పార్టీ ఆవిర్భావం నుండి చూస్తున్నా! ఇంతకీ మీరు ఏ లక్ష్యంతో రాజకీయాల్లోకొచ్చారు సార్!!?
పిఆర్పీ
తెలంగాణకు అనుకూలం _చిరు
సమైక్యమే మేలు _చిరు
అభివృద్ధిని కాంక్షించే వారు వేర్పాటు కోరుకోరు _చిరు
అవకాశాన్నిబట్టి కాంగ్రెస్‌కు మద్దతు _చిరు
శ్రీకృష్ణ కమిటీకి కట్టుబడతాం _చిరు


ప్రజల్లో తెలంగాణా వాదం లేదు... చూసావా... తెలంగాణా ఉద్యమం ఎలా చల్లారిందో!
గుర్ర్.....


గణేష్ నిమజ్జనం
తెరాస
బాబు
టిడిపికి డిపాజిట్లు గల్లంతు


తెలంగాణ పార్టీ (టిపి)గానైనా మారిస్తే మనకు కాస్త భవిష్యత్తుంటుందేమోనని నేనే ఇలా రాయించా సార్!!
TDP
ఎన్నికల్లో టిడిపి ఓటమి


'జై తెలంగాణా' అంటాను గాని.. ముందు బతుకమ్మను ఆపమండి లొల్లి...!